

భారతి

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు
వెల: రూపాయిన్నర

ఫిబ్రవరి 1976

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

ఫిబ్రవరి 1976

సంపుటము : 53　　సంచిక : 2

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1976

తులసీదాసు హనుమాన్ చాలీసా

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

గురు పదాబ్జ రజము గుప్పి మన్మానస
దర్పణమ్ము దుడిచి ధర్మ విత్త
కామ మోక్షములను గరుణించు రాఘవు
నిగ్గుదేఱుకీర్తి నుగ్గడింతు.

ఏను! బుద్ధిలేమి నీ మేనఁ బడి యుంట
యెఱిఁగినాఁడ హనుమ నెంతు నిఁకను
బుద్ధి బలము విద్య పొసఁగించి యితఁడు స
న్నలఁచు వికృతిబాధ నణఁచుఁ గాక!

1 జయ! జయ! హనుమద్దేవా!
జయ! జయ! జ్ఞానాది సుగుణ సంప జ్జలధీ!
జయ! జయ! త్రిజగద్దీపక!
జయ! జయ! కపిలోకనాథ! జయ! జయ! సుకృతీ!

2 ఆంజనాపుత్ర! పవనాత్మజా!జగాన
లేఁడు నీవంటి బలశాలి లేఁడు లేఁడు
నిరుపమం బగునోజస్సు నీది గాన
ఖ్యాతి గంటివి శ్రీరాము దూత వగుచు

3 వీర మౌళి వీవు విక్రమ నిధి వీవు
వజ్రకాయ మున్న వలఁతి వీవు
దుష్టమైన తలఁపు తొలఁగింతు వీవు స
ద్బుద్ధి నలరువారిఁ బ్రోతు వీవు

4 జాళువా వన్నె గలమేను శ్రవణ యుగళి
గునిసి యాడెడి రత్నాల కుండలములు
బద్ధకేశకలాప మబ్రంబు గూర్చు
వేషము కదయ్య నీది పవిత్ర చరిత !

5 తనరు వజ్రరేఖ ధ్వజరేఖ నీమహా
పురుషతన్ వెలార్పఁ గరమునందు
తళుకు లీను ముంజదర్భజందెము భుజం
బునను బ్రహ్మతేజ మినుమడింప.

6 శంకరాంశమ వీవు కేసరికిఁ గూర్చు
తనయుఁడవు నీవు తేజఃప్రతాపములకు
నిక్క వీవు నీ ముందఱ నెల్ల జగతి
మస్తకము వంచు భక్తిసమగ్ర మగుచు.

7 సూరి వీవు సకల సుగుణాలగని వీవు
నేర్పులెల్ల లెస్స నేర్చి తీవు
రామసేవకై విరామమ్ము గోరక
యెదురు సూచువాఁడ వీవు హనుమ!

8 రామకథలోని రుచి గన్న రసిక లోక
చక్రవర్తివి కానఁ గౌసల్య కొడుకు,
మిథిలరాజు కొమార్తె సుమిత్ర పట్టి
నీ మదిన్ సతతమ్ముగా నిలుచు హనుమ!

9 అమ్మ జానకమ్మ కత్యల్ప రూపానఁ
గానఁబడితి వీవు దానవేంద్రు
మనికి లంకఁ గాల్చి మసిచేసితివి విక
టాకృతిన్ ధరించి యగ్గలించి.

10 భీకరాకారమున సాధులోకమునకుఁ
జేటు గూర్చు రాకాసులఁ జెండివైచి
స్వామి కార్యము సాధించి రాము కరుణ
పడయఁ గల్గితి వీవు ధన్యుఁడవు హనుమ!

11 తివిరి సంజీవ నౌషధి తెచ్చి మూర్ఛఁ
బడిన లక్ష్మణు బ్రదికింపఁ బ్రభుఁ డురానఁ
జేర్చి నిన్నొత్తి కౌఁగిలించెను గదయ్య!
యెందఱకు దక్కె నీ భాగ్య మిద్ధచరిత!

12 "పావనీ! నాకు నీవు మా భరతు వంటి
సోదరుఁడ" వని రాముఁ డత్యాదరమున
నిన్నుఁ గొనియాడెనట్టె! నీ పున్నెమునకు
మేర లేదు కదా! మహావీర తిలక!

13 వేనోళ్ల నీ యశమ్మును
గానం బొనరించె నిన్నుఁ గౌఁగిటఁ జేర్చెన్
జానకినాథుఁ డయారే!
తా నెంతగ నలరెనో కదా నీ సేవన్!

14 సనక ముఖ్య దేవర్షులు జలజభవ ము
ఖామరులు ముని మూర్ధన్యు లజుని రాణి
నారదుఁడు ఫణిరాజు నీ పేరు పెంపు
వినుతి సేయంగ నసమర్థు లనుట నిజము.

15 రాము మెప్పు గన్న నీ మహిమన్ దెల్ప
నింద్ర యమ కుబేరు లెంతవారు?
కవులకేని గుండె కలదా? మనీషుల
నేర్మియైన నిందు నిలువఁగలదె?

16 నీ వుపకార ప్రియుఁడవు
కావున సుగ్రీవు రాముగాదిలిమిత్రుం
గావించి కీశరాజ్య
శ్రీ విభుఁ జేసితివి; నీకు జేజేల్ హనుమా!

17 లోకమెల్ల నెఱుఁగు నీ కనుకూలుఁడై
నీ హితోక్తిపట్ల నెమ్మి చూపి
రాము నాశ్రయించి రాజై విభీషణుఁ
డసురరాజ్య మేలె నన్న మాట.

18 పండని తలంచి పసినాఁడె రెండువేల
యామడల దవ్వునం గల యరుణ కిరణు
లీలగాఁ బటితివి మేల్! బళీ! యటంచు
సురలు దైత్యులు నరులు నబ్బురపడంగ.

19 రామనామాక్షరంబుల రమ్యమైన
యుంగరము నోట నిడి శత యోజనముల
మేర గల వారినిధిని సమీరపుత్ర!
యూవు దాటుటలో వింత యేమి కలదు!

20 లోకమున దుర్లభంబగు
నేకార్యంబైన సులభమే యగునుగదా!
నీ కొలువున రాణించిన
నీ కరుణం గనిన భక్త నికరంబునకున్.

21 శ్రీ రామరాజ భవన
ద్వారమ్మును గాచుహక్కు దక్కెను నీకున్,
ఏరేని లోనికిం జన
తేరుకదా నీయనుజ్ఞ లేక కపీంద్రా!

22 నిన్ను శరణువేఁడ నిఖిల సుఖంబులు
దక్కఁగలవు, నీవు త్రాత వైన
నొరుల వలన భీతి యుండదు ప్రాణికి
నంజనాకుమార! యఘ విదూర!

23 నీవుగా కెవండు నీ తేజము నణంపఁ
గలఁడు! హనుమ!; ముజ్జగమ్ము నీదు
కేక విన్నమాత్ర నాకులమై వడ
వడ వడంకు డిల్లవడును జెడును.

24 భూతప్రేత పిశాచ
వ్రాతము నీపేరు చెవికి వచ్చినయంతన్
భీతంబై పరుగెత్తును
జోతలు వీరాగ్రగణ్య! జోతలు నీకున్.

25 నిను సదా జపించు మనుజుల రోగంబు
లెల్ల నడఁగు బీడలెల్లఁ దొలఁగు
నగ్గపడును వీర హనుమంత! నీ భక్త
కోటి కెడఁదఁ బుట్టు కోర్కెలెల్ల.

26 మానసముతోడ నుడితోడ మేనితోడ
నిన్నుఁ దలపోయువానికి నీవు సుప్ర
సన్నుఁ డయ్యెద వాతని సంకటములఁ
దూల్తు వాశ్రిత కల్పకద్రుమము నీవు.

27 రాజకులమౌళి జానకీరాముఁ డఖిల
తాపసప్రీతి నర్జించు ధర్మమూర్తి
యతఁడు నీ దొర, నీవు సంతతము ప్రభువు
పనులు నెరవేర్చుచుందువు పవన సూతి!

28 నమ్మి నిన్నుఁ గొల్చు నరునకుఁ గల తలం
పేదియైనఁ దీర్తు వీవు కరఁగి
భానుతేజ! నీదుభక్తునిబ్రదు కెందుఁ
గనిన సఫల రీతిఁ గానిపించు.

29 నిన్న వేఁడు గాదు నీదుప్రతాపంబు
కలదయా! చతుర్యుగాలయందు
జగము దీనికతన జం కెఱుంగనిదై స
ముజ్జ్వలించె వెతల నుత్తరించె.

30 ఈవు సాధుసజ్జనావన దీక్షలో
నవధిలేనికీర్తి నందఁ గంటి
వసుర సమితి బింకమణఁచి రాముని ప్రేమ
నాహరించుకొంటి వాంజనేయ!

31 సీత నిన్ను మెచ్చి సిద్ధు లెన్మిదియును
నిధులు తొమ్మిదియును నీవు భక్త
వరుల కొసఁగ జాలువర మిచ్చెనా ధన్య
తరము నీదుజీవితము హరీశ!

నీయొద్దఁ గలదు రామ ర
సాయన మమృతంబు నిచ్చునౌషధ మనఘా!
పాయని శ్రద్ధను సీతా
నాయకు సేవించి పడసినాఁడవు దీనిన్.

ఏము నిన్ను భజించుట రామునకు న
పార మగుతుష్టి గూర్చు, నీ భజనకతన
శతసహస్ర భవమ్ముల వెతలనైన
మఱచెదము మేము, మము డాయ వెఱచు నఘము.

34 ఆంజనేయ! నీ భక్తుఁడే హరికి భక్తుఁ
డతఁడె రామునకును భక్తుఁ డాతఁ డెందుఁ
బుట్టినను రాముచెంతకే పోవుఁ దుదకు
నతనినెలవే యయోధ్యగా నుతి గడించు.

35 నియతబుద్ధితోడ నిన్నే మనమ్మున
నిలిపి కొలుచువారు నిఖిల సుఖము
లనుభవింత్రు యుష్మదనుకంపకతన; నీ
యాశ్రయంబు దుర్దశాపహంబు;

36 బలమునఁ దేజమునన్ దయ
నలఘుండవు నీవు, నిన్ను నర్థిన్ దలఁపన్
దొలఁగును సంకటపాటులు
మఱఁగును గ్లేశంబులెల్ల మారుత పుత్త్రా!

37 నా గురుండ వీవు నను దయన్ చూచి నా
కెఱుక నీఁగదే జితేంద్రియా! న
మస్కరింతు నీకు మరుదాత్మజా! జయ!
జయ! కపీశ! రామచంద్ర దాస!

38 నిష్కళంకశీల! నిన్నుఁ గీర్తించిన
పద్యములను నాల్గుపదుల నెవఁడు
నూఱుమార్లు చదువునో వాని బంధముల్
తెగును వానికబ్బు దివ్యసుఖము.

39 "హనుమాన్ చాలీసా" యనఁ
జను నీకై వార మర్థిఁ జదివినవారల్
కనెద రుమాపతి సాక్షిగ
ననవద్యం బైనసిద్ధి నా శితవరదా!

40 ప్రభుఁడ యీ తులసీదాసు పవలు రేయి
రాముని భజించు. నీకు నా రాముఁ డుసుఱు,
కావ రామునితోడ మన్మానసమునఁ
గాఁపురింపుము నీవు నక్కటిక మూని.

పవన తనయ! దుఃఖ భంజక! మంగళా
కార! నీవు జానకమ్మతోడ
రామచం ద్రుతోడ సౌమి త్రితో సక
లామరాళితో మదాత్మ నిలుమ!

"కవులు ఎప్పుడూ అనుచరులే"

శ్రీ తిరుమల రామచంద్ర

ఇటీవల కొందరు తమకు ఇష్టమైన రచయితల యోగ్యతలను గోరంతలను కొండంతలను చేస్తూ వారు సంఘ నాయకులని, నవ సమాజ నిర్మాతలని, క్రాంత దర్శకులని ప్రచారముచేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. చరిత్రగతి తెలిసిన వారెవరూ ఈ మాటలకు, ప్రచారానికి మోసపోరు. నేడు గాని నాడు గాని ఏ నాడు గాని కవులు సంఘాన్ని ఎప్పుడూ నడిపించలేదు సరిగదా సంఘ నాయకులకు అనుచరులుగానే ఉన్నారు.

సంఘం అవసరాలనుబట్టి కళలు, సాహిత్యం మొదలైనవి ఏర్పడుతాయి, రూపు దిద్దుకొంటాయి. సంఘంలో ఏర్పడిన నీతిగాని, వ్యవస్థగాని కాలానుగుణం కాక మార్పుచెందవలసి వచ్చినపుడు గాని క్రొత్త సంఘ నీతే ఏర్పడవలసి వచ్చినప్పుడు గాని దానిని దార్శనికుడు, లేక తత్వవేత్త మొట్టమొదటిసారిగా దర్శిస్తాడు. ఉన్న దానిలో ఈలోపం వున్నది; మార్పులు అవసరం: మార్పులవల్ల కలిగే లాభం ఏమిటి—మొదలైన విషయాలను సహేతుకంగా జనానికి వివరించడం కోసం ఆ దార్శనికుడు ప్రయత్నిస్తాడు. దార్శనికుడు అంటే కేవలం జగత్ సృష్టి స్థితి లయాలను గురించిగాని బ్రహ్మసత్యత్వ జగన్మిథ్యాత్వములను గురించిగాని ఆలోచించేవాడు మాత్రమేకాదు. సంఘ వ్యవస్థను, తత్ పరిణామాన్ని, పరిణామ ప్రయోజనాలను సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయించే సంఘసేవకుడుకూడా. ఈ దృష్టితో చూచినపుడు సంఘ శ్రేయస్సును ఏ కోణంనుంచి చూచేవానినైనా నేను దార్శనికుడు అంటాను. ఈ దార్శనికుని పరమ ప్రయోజనం మానవాళి సంక్షేమమే కనుక, సంఘ సంక్షేమంకోసం చేయవలసిన పనులకు అవసరమైన సాహిత్యంలో అతడు తన కార్యక్రమం ప్రారంభిస్తాడు. కార్యవ్యగ్రుడైన అతనిని సాహిత్యమే ఆరాధిస్తుంది. ప్రయోజన గౌరవ లాఘవాలనుబట్టి, లక్ష్యసిద్ధినిబట్టి అతనిని పదజాలం తనంతటతానే అనుగ్రహించి అనుసరిస్తుంది. అతని కార్యసాధన పద్ధతిని, ప్రయత్న ఫలోన్ముఖతను, సిద్ధినిబట్టి జనం ఆరాధిస్తుంది; కవులు, గాయకులు అతని పనిని తమ పనిగానే నెత్తిన వేసుకొని అతనికి అనుచరులై గొంతు విప్పుతారు. ఈ ప్రక్రియ ప్రపంచం పుట్టినప్పటినుంచి నేటివరకు సుతరాము మారలేదు.

సూర్యాదేవి పూషణ్ కుమారుని వరించింది.

వారిరువురి ప్రేమ అచంచలమైనది. ఆమె అతనిని అభిసరించి పెండ్లాడింది. ఇది ప్రపంచంలోనే తొలి స్వయంవరమని నా అభిప్రాయము. వారిరువురి ఈ వివాహం సంఘంలో గొప్ప వ్యవస్థను ఏర్పరిచింది. గృహిణికిగల స్థానం భర్తృ బంధువులకుగల స్థానం నిర్ణయించింది. దూరదర్శులైన వారి ప్రతిజ్ఞలు, వాగ్దానాలు తరువాతి వారికి వరవడులై, మంత్రాలై నేటికి వివాహాలలో ప్రధాన వచనాలైనవి. వారి మాటలకు, వారి అకుంఠిత దీక్షకు విస్తుపోయిన ఏ మహాకవో, మంత్రద్రష్టో, దానిని గానం చేసినాడు. అది ఋగ్వేదంలో శాశ్వతమైన స్థానం చేకూర్చుకొన్నది.

సంఘంలో కాలానుగుణంగా క్రొత్త నీతి సిద్ధాంతాలు బయలుదేరాయి. అదివరకు అన్న మరణిస్తే అన్న భార్యను దమ్ముడు కట్టుకునే వ్యవస్థపై జుగుప్స ఏర్పడింది. దార్శనికులైన ధర్మశాస్త్రజ్ఞులు ఈ పద్ధతి తప్పని నొక్కి చెప్పారు. దానితో సంఘంలో అన్న భార్య స్థానం తల్లిస్థాయికి హెచ్చింది. అది అప్పటి సంఘానికి అవసరమైనది. దానితో అన్నభార్యను తల్లిగా భావించాలనే నూతన నీతి సంఘంలో పాదుకొన్నది. దాని వైభవ వర్ణనయే వాల్మీకి రామాయణం. ఈ నూతన నీతి వాల్మీక్యుపజ్ఞంకాదు. వాల్మీకి అంతగా చెప్పిన రామాయణం ఉత్తర భారతంలో ఎంతగానో ప్రచారంలో వున్నా, క్రింది కులాల వారిలో అన్నతరువాత అన్న భార్యను వివాహమాడే పద్ధతి నేటికీ పోలేదు.

సంఘంలో కర్మకాండపై అశ్రద్ధ, అనాదరం పెరిగాయి. వర్ణ వ్యవస్థపై తిరుగుబాటు కలిగింది. "కొందరే ఉత్తములు మరి కొందరు అధములు కావాలి?"—అనే ప్రశ్న పలువురిలో బయలుదేరింది. కేవలం ఆస్తికతా వాదంతో అన్యాయాలు చేయడం జనాన్ని రెచ్చగొట్టింది. ప్రజల హృదయంలో విప్లవం ప్రజ్వరిల్లింది. ఈ విప్లవ జ్వాలను అందుకొన్నాడు గౌతమ బుద్ధుడు. తన వాదాన్ని తన ఆచరణలో ప్రచారం చేశాడు. ఆ మహా దార్శనికుని మార్గాన్ని కవులు, మేధావులు, చిత్రకారులు, శిల్పులు తమ రచనతో తీర్చి దిద్దినారు. ఇక్కడ కూడా నూతన వాదానికి తథాగతుడు ఆచార్యుడు కాగా కవులు మొదలైనవారు అనుయాయులే అయినారు. దేశ విదేశాలకు వ్యాపింప చేసినారు.

కవికుల గురువని వేనోళ్ళ పొగడ్తలు పొందుతున్న కాళిదాస మహాకవి కూడా అనుయాయే అయినాడు గాని నాయకుడు కాలేదు. గుప్త సమ్రాట్టులు తమ కాలమునాటి వ్యవస్థనో తాము మంచిదనుకున్న వ్యవస్థనో సుప్రతిష్ఠితం చేయగా, దానిని కాళిదాసు ప్రాచీన వస్తువుల మరుగున సమర్థించినాడు. అనాటి కవిగాని, తరువాతి కవులుగాని, సంఘానికి నాయకత్వం వహించలేదు. సంఘసంస్కర్తలో, శాసకులో, మతాచార్యులో, భక్తులో ధైర్యంతో సంఘంలో మార్పులు చేయగా దానికి వంతపాడడమో గంతులు వేయడమో తప్ప కవి చేసినది ఏమీలేదు. దార్శనికుడే కవి అయినప్పుడు సంగతివేరు. దీనికి మన చరిత్రలోని భక్త కవులను ఎందరినో పేర్కొనవచ్చు.

సంఘం అవసరాలనుబట్టే మత విశ్వాసాలలోను మార్పులు వస్తాయి. మన దేశంలో అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతాల ప్రాదుర్భావం సంఘ అవసరాన్నిబట్టే ఈ మత ప్రస్థానాచార్యులు కవితలో ఏ మహాకవికీ తీసిపోరు. కాని వారి లక్ష్యం కవితకాదు. అపవర్గం. ప్రజలను ఈ సంసార తాపత్రయంనుంచి తాము నమ్మిన పద్ధతిలో సముద్ధరించడానికి వారు ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలకు కవులు బాకాలు ఊదారు. కావ్యాలు రచించారు. నాటకాలు ప్రదర్శించారు. జీవిత వైభవాలు వర్ణించారు.

19 వ శతాబ్దంలోను ఇరవైయవ శతాబ్దంలోను మనదేశంలో జరిగిన ఉద్యమాలసంగతి మనకు పైన పేర్కొన్న సిద్ధాంతాన్ని మరింత స్పష్టం చేస్తుంది. గొప్పగా జరిగిన సంఘ సంస్కరణోద్యమాలకు వీరేశలింగం పంతులు మొదలైన సంఘసంస్కర్తలు నాయకులైయ్యారేగాని ఏ కవి బ్రహ్మ నాయకుడు కాలేదు, వారి ఉద్యమం ఫలోన్ముఖం కావడంచూచి కవులందరు వెంటపడ్డారు. తిలక్‌వంటి దార్శనికుడు, గాంధీజీవంటి తత్వవేత్త స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించారేగాని కవులు ఎవరూ గొంతు విప్పలేదు. వారికి సమకాలికులైన మహా కవులు, మహామేధావులు స్వరాజ్యం నా జన్మహక్కు, సత్యాగ్రహం — వంటి ఉద్యమాలను గేలిచేశారు: ఈసడించారు. ఖద్దరు సిద్ధాంతం, ఖద్దరు మనిషి, ఖద్దరుబుద్ధి, ఉత్తర ధృవం తెలివి తేటలు—అని ఎగతాళి చేసిన తెలుగు మహాకవి ఒకరు నేడు సహస్రమాస జీవియై వున్నాడు. గాంధీ సిద్ధాంతాలను, గాంధీ పద్ధ

తులసు ఈసడించిన ఈయన దేశం స్వతంత్రం కాగానే గాంధీజీ సిద్ధాంతాలను, పద్ధతులను, ఆయన నడకను, ఆయన నీర్కావి ధోవతిని, ఆయన బోసి నవ్వును, బోసినోటిలోని తొఱ్ఱను కూడా సుందర, లలితాతిలలిత పదజాలంతో వర్ణించి జాతీయ వాదులను వెనకకు త్రోసి ముందుకు రావడానికి యత్నించారు: శిష్యవర్గంతో వాటిని—కవితలు, గేయాలు, నాటికలు మొదలైన వాటిని—ప్రచారం కూడా చేయించారు.

గాంధీజీ సత్యాగ్రహోద్యమానికి సేనాని కాగానే మొదట్లో సమకాలిక మేధావులందరు "ప్చ్" అన్నారు. మరికొందరు బాహాటం గానే, విమర్శించారు. ఇది అయ్యేపని కాదు, ప్రపంచమంతా వ్యాపించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఈ బడుగు ఎట్లా కదిలిస్తాడు, కొండతో పొట్టేలు ఢీకొనడం వంటిది కాదా, ఏమి వెఱ్ఱి వెంగళప్ప!—అని విధ విధాలుగా విమర్శలు చెలరేగినాయి.

గాంధీజీ కవికాడు—అంటే నేడు అధికారంలో వున్న అంశ పురుషులకు రచనలు అంకితమిచ్చే కవి కాడు. ఋక్కులలో చెప్పిన నిజమైన కవి. "కవికవిర్మనీషి" అన్న పదాలకు సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు, మహామేధావి విశ్వరహస్యాలను కరతలామలకంగా తెలిసిన విశ్వస్వరూపుడనే అర్థమేకాని రెండుమ్మూడు గేయాలు వ్రాసి కేకలువేసేవాడు కాడు. ఇది అప్రస్తుతం. గాంధీజీ ద్రష్ట్యయైన మహా దార్శనికుడు. భారతదేశ శ్రేయమే కాక విశ్వశ్రేయమే ఆయన లక్ష్యం. లేకపోతే అంతటి శత్రువును బ్రిటిష్ సమ్రాట్టులు ఆదరించి వుండరు. చీటికి మాటికి చిన్న అధికారంకోసం కంఠాలు ఛేదించుకొనే ఈకాలంలో మన పరిసరాలలోనే ఇలాటి దుర్ఘటనలు తరచు జరుగుచున్న ఈ కాలంలో మహా దార్శనికుడైన గాంధీజీ విలువ ఎంతో మనకు తెలియ వస్తున్నది. ఆయన ప్రయత్నాలు ఫలోన్ముఖం అవుతున్నాయని పసికట్టగానే పలువురు మేధావులు, విశ్వకవులు తమ బిరుదులను, బహుమానాలను వదులుకొని ఆయన అండ చేరారు ఆయన మాటలకు. టీకా, టిప్పణులు, వ్యాఖ్యలు, భాష్యాలు వ్రాయసాగినారే కాని స్వతంత్రించి ఒక్క పలుకు పలక లేదు.

గాంధీజీ చరితం తలచుకొన్నపుడు భారత వర్షైకీకరణకు ప్రయత్నించిన కృష్ణుని చరితం ఎట్టఎదుట నిలబడుతుంది. తన కాలంలో పలువురు బలవంతులైన రాజుల పరిపాలనలోవున్న వివిధ ప్రాంతాల బలం తగ్గించి బలిష్టమైన కేంద్ర ప్రభుత్వం అవసర మని ఊహించిన మహారాజ నీతి దార్శనికుడైన శ్రీకృష్ణుడు వరుసగా ప్రతి బలిష్ఠుడైన ప్రాంతీయ పాలకుని పీచమడచి ఇంద్రప్రస్థాన్ని బలపరచి దేశంలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వవ్యవస్థను నిర్మించాడు. ఈ విషయాన్నే ఏ కవీ అంతకుముందుగాని ఆ సమకాలంలోగాని చెప్ప లేదు సరిగదా ఊహించనైనా ఊహించలేదు. కృష్ణుని ప్రయత్నాలను గ్రహించిన మేధావులు అనగా — ఋషులు ప్రశంసించినారు. దూరదర్శిగాను, పరమాత్మగాను కీర్తించినారు. తరువాత ఈ కవులనబడేవారు కఱ్ఱిగావున్న కృష్ణుని శ్యామసుందరుడని అతని చిన్ననాటి చిలిపి, పోకిరిచేష్టలను లీలలుగా వర్ణించినారు. అతడు ఏ చేష్టచేసినా అదొక విలాసమని ఏ కాకి రెక్కపెట్టుకున్నా అదొక ఆభరణమని వర్ణించినారు. ఇవన్నీ అతడు జీవితమంతా సాధించిన విజయాలకు కవులు ఇచ్చిన ఖితాబులు.

ఈ విధంగా భారత చరిత్రగతిని పరిశీలించినపుడు దార్శనికులు, సంఘసంస్కర్తలు, పరిపాలకులు సంఘంలోగాని పరిపాలన వ్యవస్థలోగాని నూతన పరిణామాలకు నాయకత్వం వహించినారేగాని కవులు ఎన్నడూ అగ్రేసరులు కాలేదని, పైవారికి అనుచరులుగానే వున్నారని స్పష్టమవుతున్నది. నాయకులు ప్రవచించిన విషయాలను కవులు, వ్యాఖ్యాతలు తమ వాక్చాతుర్యంతో రచనా వైవిధ్యంతో వివరించినట్టివారే కాని వారు తమంతట తాము ఎప్పుడూ ప్రవక్తలు కాలేదు. నిజం ఇట్లుండగా నేటి కవులు, తదనుయాయులు వాస్తవస్థితిని గ్రహించక నేటి వుత్తమ పరిణామాలకు కవులే ప్రవర్తకులని ప్రచారం చేయడం, ఛోటా నాయకులను వీరాధివీరులుగా చిత్రించడం. గడ్డిపోచలను గండు మగలుగా తీర్చిన గాంధీజీతో పోల్చడం విచిత్రమే కాక అసహ్యంగాను వుంది. ప్రజలు నిజం గ్రహించి కవుల స్థానమేమిటో నూతన సిద్ధాంతాలను ప్రవచించి సంఘ శ్రేయస్సు చేకూర్చే దార్శనిక నాయకుల స్థానమేమిటో గ్రహించాలి. ఏతావతా, కవులు నాడుగాని, నేడుగాని, మరేనాడుగాని ప్రవక్తలు నాయకులు కాలేదని, అనువక్తలు అనుచరులు మాత్రమేనని స్పష్టం.

సమాధిలో కలం

శ్రీ అద్దేపల్లి రామమోహనరావు

అనుభవాల సంతల్లో
హడావుడిగా తిరుగుతూ
నరాలు మీటుకునే
మనస్సు అపశ్రుతులు వింటూ
ఎక్కడో జారవిడుచుకున్నాను
నా కలాన్ని—
పొంగుతున్న నా రక్తమాంసాల అలలు
నా లోపలి చీకటి పరిధుల తీరాల్లో
విరుగుతున్నవేళ
ఎక్కడో పారేసుకున్నాను
నా కలాన్ని—
అణువణువూ తనను ఆక్రమించుకున్న
ఆకాశపు శూన్యతా ప్రతిబింబాన్ని
తరిమెయ్యడానికి
ప్రతిక్షణం కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ
గుండెమూలల్నించి ఘోష పెడుతున్న
అనంత సముద్ర తీరాన నిలబడి
అడిగాను "నా కలం నీ దగ్గర ఉందా?" అని—
"నా ఆవేదన నాకు చాలు
కవి కలంలోని వేదన భరించే శక్తి నాకులేదు"
అని ఘోషించింది సముద్రం—
నిశ్శబ్దాన్ని కౌగిలించుకుని
నక్షత్రాల కన్నీటిబొట్లు కారుస్తూ
చీకటి ఏడుస్తున్నపుడు
దాని గుండెలోని జాలికి
కీచురాళ్ళు వ్యాఖ్యానం చేస్తున్నప్పుడు—
నిలబడి ప్రశ్నించాను
"నా కలం నీ దగ్గర ఉందా?" అని
"ఈ సృష్టి మొదటి చీకటి గర్భానికి
కవి కలంలోని వెలుగు మోసే శక్తి లేదు"
అని గాలితరగ లూదింది చీకటి—
పడమటి కొండమీద జారిపోతూ
ఊరిచివరి తుమ్మతోపుల ముళ్ళు గుండెలో గుచ్చుకుని
నెత్తురు కారుస్తున్నాడు సూర్యుడు
ఆ నెత్తురు తాగి
కన్నీటితో గడ్డకట్టి నిలబడ్డది కాలవ—
అడిగాను సూర్యుణ్ణి
"నా కలం నీ దగ్గర ఉందా?" అని
గూళ్ళు చేరబోయే పక్షుల వరసల్ని
సున్నాలుగా చూపిస్తూ, పెదవి విరుస్తూ
జారిపోయాడు సూర్యుడు—
నిరాశతో నిట్టూర్చి తిరిగి వచ్చేవేళ
శ్మశానాల్ని దాటివస్తుంటే
సమాధిలోనుండి పిలుపు వినిపించింది—
"కవీ! యిక్కడున్నాను నేను!
నీ సముద్రపు కన్నీటిలో నిలువెల్లా తడిశాను
నే చీకటి నిట్టూర్పుల్లో అణువణువూ మండాను
నీ మూగనెత్తుటి వేదనలో తనువంతా మోగాను
సమాధిగోడల్ని చీల్చుకు వచ్చి
సరికొత్త రూపాన నీ చేతుల్లో మెరుస్తాను!"

*　　*　　*

రెప్పలపైన కలల్ని పూసుకుంటూ
వెలుగులేని కన్నుల్లో భవిష్యత్తుని మోసుకుంటూ
గాలిఅలలమీద నడుస్తున్నాను—
రక్తం నిండా
కలం పునర్జన్మ ప్రతిధ్వనుల్ని
నింపుకుంటున్నాను—

శక్తి కథాచక్రము-అంకమ్మ కథలు

డా. తంగిరాల వెంకటసుబ్బారావు

శక్త్యారాధనమునకు అంకురార్పణము వేదములలోనే కనిపించును.

ఋగ్వేదములో 'శక్తి' సర్వమహాశక్తుల సమాహారమూర్తిగా అభివర్ణితమయినది. అనంతరము కేనోపనిషత్తులో దేదీప్యమాన విగ్రహయగు 'ఉమా' రూపమున ఆమె మనకు దర్శనమిచ్చును. పురాణములలో శ్రీకృష్ణుని సోదరియగు 'మహామాయ'గా వర్ణితయై, వైష్ణవ మతముతో గూడ సంబంధము కల్పించుకొన్నది. శైవమతానుసారము శక్తి శివపత్ని. కాలచక్రమున సర్వ జగన్మాతగా శక్తి నారాధించు ఆచారము ప్రబలినది. 'శక్తియొక్క వివిధ స్వరూపములలో భయంకర స్వరూపిణియగు కాళీమూర్తి బహుళ ప్రచారములోనికి వచ్చినది. పర్వతాధిదేవతయగు 'దుర్గ'గాను, సౌందర్య పరసీమయగు 'లలిత' గాను కూడ శక్తి ఆరాధిత యగుచున్నది. శక్తిని ఎవ్వరే విధముగ ఆరాధించినను, ఎప్పుడును స్త్రీ మూర్తిగనే ఆరాధింతురు. శాక్తేయ మతమునకు తంత్రములు ఆధార గ్రంథములు. [1]

శక్తులు అనంత విధములు. ఇవన్నియును ఆదిశక్తిలోనుండి వచ్చినవనుట సాధారణ సూత్రము. వేదములో 'ఏకం సద్ విప్రా బహుధావదంతి' అనినట్లు ఒకేశక్తి బహు రూపములలో బహునామములలో భావింపబడుచుండును. కొందరకు లలితమూర్తు లిష్టమగుచో, మరి కొందరకు ఉగ్రమూర్తు లిష్టము. "అతివసౌమ్యం లలితేతి శబ్దం, ప్రచండ చండీతి పదం చ భీమం" అని కావ్యకంఠ గణపతి ముని 'ఒకే శక్తి లలిత భీమరీతులుగా పలుకబడుచుండును'ని వ్రాసెను.

అణిమాదికములైన అష్టసిద్ధులు ఉన్నతశక్తులు. ఇవన్నియు ఘోర తపస్సు చేసినగాని లభింపవు. కొద్దిపాటి సాధనతో, అదియును నీచములగు మద్యమాంసాదుల సహాయముతో, అల్పతంత్రముల సహాయముతో ఇతరుల కపకారము చేయుటకును, చిన్న చిన్న ప్రజ్ఞలు ప్రదర్శించుటకును సాధించెడు వానిని క్షుద్రశక్తులందురు. (సామాన్యముగా 'క్షుద్ర'మనెడిది నీచార్థమున వాడబడుచున్నది. అంతకన్న ఈ శబ్దమును అల్పార్థమున భావించుట సముచితము).

స్తంభన, విద్వేషణ, ఉచ్చాటన, భ్రామణ, ఉత్పాదన, మారణాది క్షుద్ర శక్తులను గూర్చి అన్ని మంత్ర శాస్త్రములలోను ప్రస్తావింపబడినది. ఇవికాక, దేశమున నొక మహత్తర కార్యము కొరకు ప్రాణము వదలిన వ్యక్తులు దేవతలై వెలయుచుందురు. రేణుక అట్టివారిలో నొకతె. కావ్యకంఠ గణపతి ముని తన 'ప్రచండ చండీ త్రిశతి'లో రేణుకను భిల్లకాంతగా వర్ణించినాడు:

శ్లో. "గుంజాఫలాకల్పిత చారుహారా
శీర్షే శిఖండం శిఖినో వహంతీ
ధనుశ్చ బాణాన్ దధతీ కరాభ్యాం
సా రేణుకా వల్కల భృద్ విచింత్యా"

[తలయందు నెమలిపింఛము, మెడలో గురివెందల దండ, చేతులలో ధనుర్బాణములుగల వల్కల ధారిణియైన రేణుక ధ్యానింపదగినది].

రేణుక మంత్ర శాస్త్రములో నుత్తమ దేవతగా పొగడబడినది. భయంకర మూర్తులగు కాళీ, బగళా, చండికా, మాతంగీ మొదలైన దేవతలు మంత్ర శాస్త్రములలో ఉత్తమ తపోమార్గములలోను, క్షుద్రసాధనములలోను—రెండింటను కాన్పింతురు. కాని మంత్రతంత్రములు మాత్రము భిన్నములు. ముఖ్యముగా సాధనా పద్ధతులలో భేదమెక్కువ. దక్షిణాచార మార్గములో యమనియమములు, శుద్ధత, ఆచారము, ప్రధానము. వామాచార మార్గములో 'పంచమకారములు', అనగా మద్యము, మత్స్యము, మాంసము, మైథునము, ముద్ర ప్రధానము. గమ్యమొక్కటే యైనను అనుసరణమార్గములువేరు. ఉత్తమ సాధనకు దేవతా సాక్షాత్కారము, జన్మరాహిత్యము మొదలగునవి ముఖ్యము కాగా, క్షుద్రసాధకునకు సిద్ధులు, లోకములో వాని ఉపయోగములు ముఖ్యము.

శక్తిపూజ ఎంతకాలముగా నున్నదో చెప్పుట కష్టము. ఆర్యుల అగ్ని సూర్యాద్యుపాసనలకంటె ప్రాచీన జాతుల శక్తిపూజ ముందరిదని చారిత్రకులు భావించుచున్నారు. వైదిక వాఙ్మయములో తంత్రములు బయలుదేరునాటికి శక్తిపూజ మిక్కిలి ప్రచారములోనికి వచ్చినది.

లలిత, చండిక, దుర్గ మొదలైనవి వైదిక దేవతలు. మంత్ర తంత్ర జపహోమాద్యుపాసనా పద్ధతులు వీని ఆరాధనా మార్గములు. ఎల్లమ్మ (రేణుక), పోలేరమ్మ, ముత్యాలమ్మ, గంగానమ్మ, కాకతమ్మ,

మాహురమ్మ, అంకమ్మ మొదలగునవి క్షుద్రదేవతలు. మద్యము, బలి మున్నగు వానితో నివి తృప్తి వహించును. ఈ క్షుద్రశక్తులు, వీని పద్ధతి తెలిసి చేసినచో త్వరగ సిద్ధించును. కాని, ఎంతయో నిగ్రహమున్న తప్ప వీనివలన మానవుడు పతనము చెందెడి అవకాశములు హెచ్చు. అందువలన దివ్యత్వమునకు ప్రయాణముచేసెడి మానవుడు ఉత్తమ శక్తులను ఉపాసింపవలెను.[2]

జానపదులలో క్షుద్ర శక్త్యారాధనమే హెచ్చు. ఈ దేవతలను గ్రామదేవతలందురు. అంకమ్మ (అంకాళమ్మ, అంకు), ఎఱ్ఱి పోతమ్మ, ఎల్లమ్మ, కొండమ్మ, గంగమ్మ, (గంగనమ్మ, గంగానమ్మ) గంటలమ్మ, పల్లకమ్మ, పళ్లాలమ్మ, పుట్టాలమ్మ, పెద్దింట్లమ్మ, పైడమ్మ, పోలక (పోలకమ్మ), పోలేరమ్మ (పోలేరు), మారి, ముత్యాలమ్మ, మొగదారమ్మ—మున్నగునవి ఆంధ్రదేశమున పూజింపబడుచున్న కొన్ని ప్రధాన గ్రామదేవతలు. ఈ క్షుద్ర శక్త్యారాధనమున గ్రామీణులు జాతరలు, బలులు జరపుచుందురు. ఈ జాతరలలోనే ఆ శక్తుల మహిమలను దెల్పు కదలు గానముచేయబడును. ఇట్టి శక్తి కధలలో ఎల్లమ్మకథ, అంకమ్మకథ, పోలేరమ్మకథ, మాత పురాణము, మాతంగికథ, ముత్యాలమ్మకథ, మాహురమ్మ కథ (మావురమ్మకథ), చౌడమ్మ పాటలు, కాకతమ్మ కథ, జాలమ్మ కథ, గంగానమ్మకథ, పుట్టాలమ్మకథ మొదలగునవి కలవని తెలియుచున్నది. రేణుకకు జానపదులలో 'ఎల్లమ్మ' అని వ్యవహారము. 'మాహుర' మను గ్రామమున వెలసియుండుటచే ఈమెకు 'మాహురమ్మ' (మావురమ్మ) అనియు పేరు వచ్చినది. ఈ రేణుకయే ఓరుగల్లులో 'ఏకవీరాదేవి' గా వెలసినది. 'ఏకవీరాంబకథ' యను వీర గాథయు గలదు.

కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారును, వారి ననుసరించి వారి శిష్యులు ఆచార్య తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారును శక్తి కదలకొక పట్టిక నిచ్చిరి. ''మాతపురాణము, పరశురామ రామాయణము, గౌతను పురాణము, మఱ్ఱిచెట్లకథ, రేణుక యుద్ధము, కాకతమ్మకథ, అంకమ్మకథ, గంగానమ్మకథ, మాతంగికథ'' అనునవి వీరిచ్చిన పట్టికలో కలవు. ఈపట్టికలలో ఒకే కధను త్రిప్పి త్రిప్పి నాలుగు కధలుగా చెప్పుట జరిగినది.[3] పరశురామ రామాయణము—గౌతమ పురాణము అను రెండును ఒక్కటే. ఇది వీరగాథావృత్తము. (Ballad-cycle). 'మఱ్ఱిచెట్లకథ, రేణుక యుద్ధము' అనునవి యీ గాథావృత్తములో కొన్ని వీరగాథలు. వీరిచ్చిన పేర్లుకూడ జానపద వ్యవహారమునకు భిన్నముగా నున్నవి. 'పరశురామాయణ' మనుట సమంజసముకాని, 'పరశురామ రామాయణ' మనుట సరి కాదు. ఉరిచి భావజ్ఞుడను కవి రచించిన ద్విపద కావ్యమున కూడ 'పరశురామాయణ' మనియే చెప్పబడినది. (చూ. మదరాసు ప్ర. ప్రా. లి. పు. భాండాగారములోని తాళపత్ర ప్రతి D. No. 1110) అట్లే 'గౌతమ పురాణ' మనుట సమంజసముకాదు. జానపద సంప్రదాయమున పరశురాముని పితామహుడు 'సత్యగౌతుడు'. ఆ సత్యగౌతునితో ఈ పురాణము ప్రారంభింప బడును గావున దీనికి 'గౌతుపురాణ' మని పేరు. కావున 'గౌతు' శబ్దమే జానపద వ్యవహారమున సరియైనది. 'గౌతమ' శబ్దము పండిత సృష్టి. ఒకవేళ ఈ 'గౌతమ' శబ్దమే సాధువనియు, ఇది జానపదులలో భ్రష్టమైనదనియు దలంతుమన్న, శిష్ట వ్యవహారమున పరశురాముని పితామహుడు 'ఋచీకుడు' కాని గౌతముడు కాదు. పైగా, ఈ గౌతమపురాణము పరశురాముని వృత్తాంతమునే తెలుపుచున్నది. కాని, అహల్యా గౌతముల వృత్తాంతమును తెల్పుటలేదు. కాబట్టి జానపదుల 'గౌతు' శబ్దము, శిష్టుల వ్యవహారమున నున్న 'గౌతమ' శబ్దముకంటె భిన్నమైనదని నా అభిప్రాయము.

కోదండరామయ్యగారి వలెనే శ్రీపాద గోపాల కృష్ణమూర్తి గారును 1953 డిసెంబరునెల 'కిన్నెర'లో నొక శక్తి కధల పట్టిక నిచ్చిరి : ''మాహురమ్మకథ, మాతపురాణము, గౌతమ పురాణము, మఱ్ఱిచెట్లకథ, రేణుక యుద్ధము, కాకతమ్మకథ, అంకమ్మకథ, గంగానమ్మకథ, మాతంగికథ, కామేశ్వరిపాట, పరశురామ పురాణము'' శ్రీపాదవారిచ్చిన యీ పట్టికలోగూడ ఎల్లమ్మకథ చర్విత చర్వణమైనది. వీరుకూడ 'గౌతు పురాణము'న 'మ' అను అక్షరమును చేర్చిరి. పరశురామాయణమును పరశురామ పురాణమనిరి. వీరు చెప్పిన వానిలో 'మాహురమ్మకథ, గౌతమ పురాణము, పరశురామ పురాణము' అను మూడు కధలును ఒక్కటే. దీనిని 'పరశురాముని కధాచక్రము' లేక 'ఎల్లమ్మ కథాచక్రము' అని పిలువవచ్చును. శ్రీపాదవారుతెల్పిన 'మఱ్ఱిచెట్ల కథ' 'రేణుక యుద్ధము' అనునవి పై గాథాచక్రములోని అంతశ్శాఖలు. అట్లే మాత పురాణమన్నను, కాకతమ్మ కథయన్నను నొక్కటే.

పైన చర్చించిన శక్తి కధలలో 'ఎల్లమ్మకథలు, అంకమ్మ కధలు, పోలేరమ్మకథ, ఎల్లమ్మకథ (తెలంగాణా ప్రతి), ఏకవీరాంబ కథ (తాళపత్ర గ్రంథము), చౌడమ్మపాటలు, నాకు లభించినవి. 'మాత పురాణము, మాహురమ్మకథ, ఉరిచి భావజ్ఞుడు రచించిన 'పరశు రామాయణము' మదరాసు ప్ర. ప్రా. లి. పు. భాం.లో నున్నవి. (చూ. R. Nos. 693, 694; D. Nos. 1110, 1111). కాకతమ్మ కధ వరంగల్లు మండలమునను, ముత్యాలమ్మ

కథ నల్లగొండ మండలమునను, జాలమ్మకథ, ఒంగోలు తాలూకా లోను, ఆరంజోతి కథ చిత్తూరుమండలమున కాళహస్తి తాలూకా లోను, వ్యాప్తియందున్నట్లు తెలిసినది కాని, దేశ ద్రిమ్మరులగు ఆ గాథాకారులను పట్టుకొనుట నా కశక్యమైనది. కృష్ణామండలములో నాకు లభించిన ఏకవీరాంబ కథయను తాళపత్ర గ్రంథమున 'రేణుకా కల్యాణము' 'గిరిరాజు యుద్ధము' అను రెండు వీరగాథలున్నవి. రేణుక కల్యాణమునకే రేణుక రాయబారమనియు పేరు. రాజకీయ సంబంధ మగు సామరస్యమును నెరపు కార్యమునకే కాక, పెండ్లి సంబంధమును కుదుర్చు పనికి కూడ రాయబారమని పిలుచుట జానపదులలో పరి పాటి. దీనిని 'పెండ్లిరాయబార' మందురు. పల్నాటి వీరకథలలో మొదటి కథకు 'పెద్దన్న పెండ్లిరాయబారము' అని పేరు! కాబట్టి రేణుక రాయబారమనగా రేణుక కల్యాణమనియే అర్థము. గిరిరాజు యుద్ధమునకు రేణుక యుద్ధమని నామాంతరము. గిరిరాజు రేణుక తండ్రి. ఇతడు రాక్షసులతో చేసిన యుద్ధమున అలసిపోయి మూర్ఛ నొందును. అప్పుడు రేణుక తన తండ్రికి సహాయముగా వచ్చి రాక్షసు లను సంహరించును. అందుచే ఈ గిరిరాజు యుద్ధమునకు రేణుక యుద్ధమని పేరువచ్చినది.

ఇకపోగా, 'మఱ్ఱిచెట్ల కథ, గంగానమ్మకథ, మాతంగి కథ' —అను మూడు కథలును నేను సంప్రదించిన జానపదులలో ఎవరి యొద్దను వినబడలేదు, కనబడలేదు. అంతమాత్రమున ఇవి దేశమున లేవని చెప్పుటకాదు. వీనిని గూర్చి యింకను శోధింపవలసియున్నది. గాతు పురాణమున మొదటవచ్చు యాదవ మఱ్ఱిని గూర్చిన కథయే 'మఱ్ఱిచెట్ల కథ' యగునని ఊహించుచున్నాను. 'గంగానమ్మ' యాద వుల కులదైవమగు గంగయే యగుచో, కాటమరాజు కథాచక్రములోని 'గంగతర్క'మను కథయే గంగానమ్మ కథ కానోపును. పెండ్లి పెడాకులు లేని స్త్రీని 'మాతంగి' యందురు. పోలేరమ్మ కథలో ఆమె అవివాహితయగు ఈశ్వరపుత్రిగా తెలుపబడినది. కాబట్టి పోలే రమ్మ కథయు మాతంగి కథయు అభిన్నములు కావచ్చును.

'కామేశ్వరికథ' కూడ పై శక్తి జాతికి చెందినను, ఇది నేడు 'అక్కలపాట'యను స్త్రీల పాటగా మాత్రమే లభించుచున్నది; జాన పదులు పాడు వీరగాథగా కానవచ్చుటలేదు. స్త్రీల పాటలు జానపద కవిత్వము కానేరవు; అగ్రవర్ణములకు చెందిన జాతి దేశికవిత్వము. మదరాసు ప్ర. ప్రా. లి. పు. భాం.న రేటూరి భావనామాత్యుడు రచించిన 'కామేశ్వరీ చరిత్ర'మను ద్విపద కావ్యమొకటి గలదు. (కాగి తపు ప్రతి D. No. 1045). కామేశ్వరి కథను దెల్పు 'ఆదిలక్ష్మీ విలాస' మను పద్యకృతియు మరియొకటి గలదు. (D. No. 388) ఈ కామేశ్వరి కథయే క్రీడాభిరామమున జక్కులపురంధ్రి పాడిన "కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపు" జక్కులు పాడెడి పాట నేడు లభించుటలేదు. 'అక్కెమ్మపాట' అను పేర రాయలసీమ జాన పద స్త్రీలలో ఒక లఘు కథాగేయము ప్రచారమున నున్నది కాని, దాని యితివృత్తమునకును కామేశ్వరి కథకును ఏ విధమగు సంబంధమును లేదు. మొత్తముపై కామేశ్వరికథ నేడు అగ్రవర్ణముల స్త్రీలపాటగా లభించుచున్నదే కాని, జక్కులవంటి జానపద గాయక భిక్షుకులు పాడు వీరగాథగా లభించుటలేదు.

పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ—అనునవి కూడ జానపదులు పూజించు క్షుద్రశక్తులే. తెలంగాణమున వ్యాప్తియందున్న ఎల్లమ్మ కథలో ఆమెకు తండ్రియగు గిరిరాజు 'మైసమ్మాపురము' నెరణముగా నిచ్చెనని కలదు. కాబట్టి 'మైసమ్మ' యను పేరుకూడ ఎల్లమ్మకే వర్తించునని భావింపవచ్చును. మొత్తముపై శిష్టసాహిత్యములో జమదగ్ని భార్యయగు రేణుక జానపదులలో బహునామములతో వ్యవహ రింపబడుచున్నదని చెప్పవచ్చును. "ఎల్లమ్మ,ఎల్లారమ్మ, మాహురమ్మ, మావురమ్మ, మావురాల యెల్లమ్మ, ఏకవీరాంబ, ఏకవీర, మైసమ్మ" అను పేర్లు జానపద వ్యవహారమున గలవు. 'రేణుక' యను నామము కూడ అచ్చటచ్చట కాననగును. ఈ నామము లన్నిటిలోను 'ఎల్లమ్మ' నామము మిక్కిలి ప్రసిద్ధము. కాకతమ్మను గూడ ఎల్లమ్మగా భావించు విమర్శకులున్నారు. కాని 'కాకతమ్మకు సైదోడ ఏకవీర' లను క్రీడాభిరామ పద్యమునుబట్టి ఈమె కాకతమ్మకంటె భిన్న మైనదని ప్రభాకరశాస్త్రిగారు తీర్మానించిరి. 'మాతపురాణ'మను కథలో కాకతీయ రాజుల చరిత్ర వచ్చుటచే ఈ మాత పురాణమునే కాకతమ్మ కథగా భావింపవలసి యున్నది.

పైన తెల్పిన శక్తి కథలలో నాకు లభించిన వానిలో ఎల్లమ్మ కథలు, అంకమ్మ కథలు ప్రత్యేక వీరగాథా చక్రములుగా నేర్పడి యున్నవి. చౌడమ్మ పాటలుకూడా వీరగాథా చక్రమేకాని, యిందలి కథలకొక వరుసక్రమము కానరాదు. అందునను ఇవి లఘువీరగాథలే కాని సాధారణ వీరగాథలు కావు. (ఈ కథలన్నింటిని కలుపుచు 'చౌడు పురాణ' మనుపేర నొక పెద్ద వీరగాథ కలదని తెలియుచున్నది. దానిని సేకరింపవలెను). పోలేరమ్మకథ విడికథయే. మాత పురాణము అసమగ్రముగా లభించుటచే అది గాథావృత్తమో లేక విడిగాథయో చెప్పలేము. తక్కినవి అలభ్యములు కావున నవి ప్రత్యేకగాథలో లేక గాథావృత్తములో తెలుపుటకు వీలుపడదు. పైన తెల్పిన వివిధశక్తు లన్నియు ఆదిశక్తినుండి పుట్టినవే కావున, మొత్తము శక్తి కథలన్ని యును స్థూలముగా నొకేగాథావృత్తముగా భావింపనగును. ఈమూల గాథావృత్తములో 'ఎల్లమ్మకథాచక్రము, అంకమ్మ కథాచక్రము, చౌడమ్మ కథాచక్రము' అనునవి అంతశ్శాఖలని చెప్పవచ్చును. మాత

పురాణము, పోలేరమ్మకథ, ఆరంజ్యోతికథ-ఇత్యాదులు ఇతరశక్తి కథలు.

కాటమరాజు కథలుకూడ ఒక విధముగా పరిశీలించినచో శక్తి కథలేయని చెప్పవలెను. అందలి ప్రధానదైవము గంగమ్మ. ఈమె కృష్ణుని సోదరియగు 'మహామాయ' యని 'కంసుడు కథ' అనువీర గాధలో తెలుపబడినది. ఈమెకూడ శక్తి స్వరూపిణియే. అందుచే ఈమెను గూర్చిన యాదవరాజుల కథలుకూడ శక్తికథలే కావలెను. కాని యాదవరాజుల కథలకు 'గంగకథ' అను పేరు జానపద వ్యవహారమున లేదు; వీనికి 'కాటమరాజుకథ' లనియే నాడుక. కాటమరాజు క్రీ. శ. 13 వ శతాబ్దియందు నివసించిన చారిత్రక పురుషుడు. అందుచే ఈకథలను వేరుగా విభజింపవలసి వచ్చినది.

అంకమ్మ కథాచక్రము

ఇందు 'లంకమ్మ' లేక 'అంకాళమ్మ' అను శక్తిని కొలిచిన మారాసపు రాజుల కథలు మూడున్నవి: (1) మారాసపు అంకమ్మ కథ (2) రవద్దేవి రాజు కథ (3) కల్యాణపు గంగురాజుకథ. ఈ మూడు కథలకును 'అంకమ్మ పాంగెము' అనిపేరు. అనగా ఈ కథాచక్రమునకు జానపదులలో 'అంకమ్మపాంగె' మను వ్యవహారమున్నదని తెలియుచున్నది – (పరశురాముని కథలకు 'గౌరుపురాణ' మను పేరున్నట్లుగానే). ఇవి చారిత్రక వీరగాథలు. ఇవి కల్యాణమునేలిన పశ్చిమ చాళుక్యులకు సంబంధించిన వీరగాథలుగా కన్పట్టుచున్నవి. రవద్దేవిరాజు, గంగురాజు మున్నగు మారాసపువారు కొలుచుటచే ఈ లంకమ్మకు 'మారాసపు అంకమ్మ' అను పేరువచ్చినది. ఇంకను మరి రెండురకముల లంకమ్మలున్నారు: (1) 'పల్నాటి అంకమ్మ' లేక 'వీరుల అంకమ'–పల్నాటి వీరులలో కొమ్మరాజు కొలిచిన అంకమ్మ. ఈమె గుడి కారెంపూడిలో గలదు. ఈమెను జానపదులు'ఈర్లంకమ్మ' అందురు. (2) 'బయట అంకమ్మ': ఈమెను ఇంటిలోనుంచరు; ఊరిబయట నుంచెదరు. కావున్నే అంకమ్మలు మొత్తము ముగ్గురు: మారాసపు లంకమ్మ, పల్నాటి అంకమ్మ, లేక వీరులఅంకమ్మ, బయట అంకమ్మ, ప్రస్తుత కథాచక్రము మొదటి విధమగు అంకమ్మకు సంబంధించినది. పల్నాటి అంకమ్మను గూర్చిన కథ పల్నాటి వీర కథలలో వచ్చును. కొమ్మరాజు యుద్ధమునకు ముందు 'అంకమ్మ పుట్టుక' ను గూర్చిన కథ చెప్పుదురు.

ఈ పల్నాటి అంకమ్మకూడ మారాసపు అంకమ్మనుండి పుట్టినట్టిదే. అంకమ్మ కథలకును పల్నాటి వీరకథలకును దగ్గర సంబంధమున్నది. అంకమ్మను గొలిచిన మారాసపు రాజులు ఏడుగురన్నదమ్ములు. వారిలో చివరివాడు 'వీరసోమరాజు'. ఇతడు పల్నాటి వారితో కలిసిపోయినాడు. తన కూతురు సిరాదేవిని పెదమలిదేవ రాజునకిచ్చి వివాహము చేసెను. ఇతని పుత్రుడే కొమ్మరాజు. ఇతడు తనతోపాటుగ తన కులదైవమగు అంకమ్మనుకూడ పల్నాటికి తెచ్చినాడు. ఈమెయే 'పల్నాటి అంకమ్మ' లేక 'వీరుల అంకమ్మ'. ఇది చారిత్రక సత్యముగూడ.


ఈ అంకమ్మ కథలను పాడువారు 'అయ్యగారి దర్శనము' నకు చెందిన మాలలు. వీరిని 'పంబలవారు' అందురు. వీరు వాయించెడి పంబజోడునుబట్టి వీరికీ పేరు వచ్చియుండును. పంబజోడు, తిత్తి, కత్తి, జమజాల (కైజారు)–అనువానితో ఈ కథను పాడుదురు. కథకుని కుడిచేతిలో కత్తి, ఎడమచేతిలో జమజాల ఉండును. వంతలు పంబజోడును వాయించుచు తిత్తిపట్టుదురు.

అంకమ్మను అన్నివర్ణములవారును కొలిచెదరు. పల్నాడులో బ్రాహ్మణులు, కమ్మవారు; నెల్లూరు మండలమున పట్టుసాలీలు, ఓరుగంటి రెడ్లు, కుమ్మర్లు; ఉత్తరాదిని బోగమువారు, గవుళ్ళు, బలిజ, "శూద్ర" చాకళ్ళు, మాలలు, ముత్రాసులు మొదలగు వర్ణములవారు అంకమ్మను గొలిచెడివారిలో ప్రధానులు.

అంకమ్మ పాంగెములోని మూడు కథలనుబట్టి మారాసపు రాజుల వంశక్రమమిట్లున్నది: (తరువాతి పుట చూడుడు).

అంకమ్మ ఏడుగు రప్పచెల్లెండ్రలో పుట్టినదట: 'అంకమ్మ, పోలేరమ్మ, మాలతుమమ్మ, కనకదుర్గమ్మ, బంగారమ్మ, గంగమ్మ, కూనలమ్మ' – వీరేడ్గురును అక్కచెల్లెండ్రు. ఇందు కూనలమ్మకు నూర్గురు బిడ్డలట. శక్తులన్నియు అభిన్నములగుటచే కాబోలు, అంకమ్మ కథలలో మధ్యమధ్య అంకమ్మ రేణుకగా స్తుతింపబడు చుండును. ఇదియునుగాక, రాయలసీమలో ఎల్లమ్మకథలు పాడెడి ఆసాది వారిలో కొందరు అంకమ్మ కథలనుగూడ పాడుచున్నట్లు తెలియుచున్నది.

ఈ అంకమ్మ కథలను పాడుటలో పంబలవారు నలుగురుందురు. ఒకడు కథకుడు,తక్కిన ముగ్గురును వంతలు. ఈవంతలలో నొకడు పంబజోడును వాయించును. మరియొకడు తిత్తియూదును. వేరొకడు ఆకొట్టును, పంబజోడు తాళమును, తిత్తి శ్రుతిని సమకూర్చును. కథకుని కుడిచేతిలో పెద్ద పొడుగుపాటి కత్తియుండును; ఎడమచేతిలో 'జమజాల' అనెడి కైజారుండును. ఈ కథకుని వేష మొక రాజకుమారుని వేషమువలె నుండును. కాళ్లకు గజ్జెలు, నెత్తికి తలపాగ, దాని కిరుప్రక్కల రెండు చంద్రవంకలు, కలికి తురాయి, దాయిగుడ్డ (ఎడమ భుజము మీదినుండి వేసికొను వలెవాటునకు 'డాయిగుడ్డ' అనిపేరు), షరాయి (సన్నని



ప్యాంటువలె నుండును), నుదుటిపై కుంకుమతో అడ్డ బొట్టు ధరించును. ఈ కథకుడు లయానుసారముగ గంతువేయుచు, చేతిలో పెద్ద కత్తిని త్రిప్పుచు, జమజాలపై దానిని కొట్టి మ్రోగించుచు, వీరావేశముతో కథను పాడుచుండును. ఈ పాట మూడు విధములుగా సాగును. 'శోకము, మాటలు, వర్ణము'. పాట మిక్కిలి దీర్ఘాలాపనతో శోకరసముట్టిపడునట్లుగ పాడుట 'శోకము'. మాట లనగా వచనమని యర్థముకాదు. ద్విపదను గాని లేదా ఖండగతి రచనను గాని రాగము లేకుండ భావగర్భితముగా చదువుటను 'మాటలు' అందురు. శోకాలాపనలో నున్నంత దీర్ఘముతోగాక, కొంత యుద్రేకముతో పాడుటను 'వర్ణము' అందురు. ఇది శోకమునకును మాటలకును మధ్యస్థమగు పద్ధతి. వంతమెడలో వ్రేలాడు పంబజోడులో నొకటి తొడలపై ఆనుకొని యుండును; రెండవది మొదటి దానిపై నెక్కి యుండును. తొడల కానుకొనియున్న పంబ తక్కువ శ్రుతిలోను, దానిపై నెక్కియున్న పంబ ఎక్కువ శ్రుతిలోను బిగింపబడి యుండును. మొదటి పంబను ఎడమ చేతితో కొట్టుచు, రెండవ పంబను కుడిచేతిలోనున్న కఱ్ఱపుల్లతో తాకుచుండును. శోకమునందు తక్కువ శ్రుతిలోనున్న మొదటిపంబ మ్రోగింపబడును. వర్ణము పాడునప్పుడు హెచ్చు శ్రుతిలోనున్న రెండవపంబ వాయింపబడును. మాటలు చదువునప్పుడు కఱ్ఱపుల్లతో రెండవ పంబను తాళానుగుణముగా కొట్టుచుండును.

ఈ అంకమ్మ కథాచక్రమున గల మొదటి రెండు కథలను, అనగా 'అంకమ్మకథ, రవద్దేవి రాజుకథ' అను వానిని మౌఖిక ప్రసరణమున నుండగా నెల్లూరు మండలమున సేకరించితిని. మూడవదియగు గంగరాజు కథను కృష్ణామండలమున తాళపత్ర గ్రంథరూపమున నున్నదానిని సంపాదించితిని.

అంకమ్మ కథలను పాడు గాథాకారులు ఈ క్రిందివిధముగా ప్రార్థన చేయుదురు.

వర్ణన : (పంబ ఎక్కువ శ్రుతిలో మ్రోగుచుండును) :

గణనాయకా బ్రహ్మ గణనాయకా—గణనాయకా దేవ
గణనాయకా

వజ్రాల తేరువలె '' వాక్కు నాకియవయ్య ''

పగడాల తేరువలె '' పాట నాకియవయ్య ''

మాధవరాయ చిన్నికృష్ణ గోపాలా మమ్ముల దయ
చూడు స్వామి గోపాలా

కరుణచం ద రామకుంద " కానరాదె బ్రహ్మ మాయ"
పచ్చల భాగీరథమ్మ " పరశురాము గన్నతల్లి "
తాటక సంహారుడమ్మ " తల్లికి లోకాము దెల్పె "
అడగరాని దానమూలు " అడిగెనె మూడ డుగు లేమొ "
మచ్చావతారమూన " చొచ్చినాడె జలధి లోన "
చొచ్చి సోమకుని ద్రుంచి " తెచ్చినాడె వేదమూలు "

శ్లోకము: (పంబ తక్కువ శ్రుతిలో మ్రోగుచుండును):

శ్రీహరీ......ఓ దైవమా......
శరణమే ఆదిశక్తీ! శరణమే రేణుకా!
శరణమే తీరు భయంకరీ!
శరణమే ముప్పై మ్మూడు కోట్ల దేవతలారా!
శరణమ్మ మాపాలి ఓ శారదాంబ!
కనుగొని మేలుకున్నా నీమీద జ్ఞానంబు
నిద్రబోయి మేలుకున్నా నీమీద జ్ఞానంబు
బంటు బంటుకు నీ పిల్ల బంటుమమ్మ
మేలుకున్నంత మాకు మేలీయవమ్మ
హరిభక్తులు ఎందరో కలరు అవనిలోన
గంగలో స్నానముచేసి హరిని కానలేరమ్మ
శివభక్తులు ఎందరో కలరు స్థితిలోన
గంగలో స్నానముచేసి శివుని కానలేరమ్మ
హరిభక్తులకు శివభక్తులకు బ్రహ్మభక్తులకు
ఆధారకర్తవమ్మా...ఓ శారదాంబా......

చదువు శాస్త్రము నేర్పిన అయ్యలను ఈ సభ యందు దలచి
సాము విద్దెలు నేర్పిన అయ్యలను ఈ సభయందు దలచి
తప్పులున్న మిగుల ఒప్పుగా దిద్దుడీ

ఈ సభను కూర్చున్నట్టి ఓ సహృదయులార!
సరగున మిమ్మ మెప్పింప ఇక నేనెంత వాడనో
గోపాల వరదో... ఓ శారదాంబా...[4]

1. అంకమ్మకథ లేక మారాసపువారి అంకమ్మ కథ :—

అంకమ్మ పాంగెమున నిది మొదటికథ. కొన్నిచోట్ల మంజరీ ద్విపదగా, కొన్నిచోట్ల ఖండగతిరచనగా, మరికొన్నిచోట్ల లయాత్మక వచనముగా నిది సాగినది. సుమారు 1100 పాదము లున్నది. దీని ప్రారంభమిట్లున్నది :

మాటలు — (పంబను కర్రతో కొట్టుచు వంత 'ఆ' కొట్టుచుండును) :

వినరయ్య యీకత విశదంబుగాను
వినయముగ పెద్దలకు విన్నవించెదను
ఎడలేని కల్యాణపు దేవగిరి పట్టణము

ఏలేటిరాజు దేవాధిదేవ రుద్రుండు

ఒకనాటి సమయమున వంశమార్గమున
తనకైన ఏడుగురి తలవర్ల బిలచి
దారట్ల నాయుడను తలవరిని పిలచి
'దారట్ల నాయుడా! తలవరులార!
మన ఎడలేని కళ్యాణ దేవగిరి పట్టణము
వీధి ఇరవయ్యామడ తట్టు పన్నెండామడ
నలసదరము నాల్గు నూరామడ
ఎడలేని దేవగిరి ఈ పట్టణంబు
రాజులుగాని రాజ ప్రధానులు గాని
భట్టులుగాని బ్రాహ్మణులుగాని
నివేగులుగాని నీతిమంతులుగాని
ఎవరు ఏలుబడి చేస్తున్నారో
ఎవరు ఏలుబడి చేయంగలేదో
సొచ్చి శోధనచేసి శృంగారపు వనమునకు వచ్చి
విన్నవించండిరా తలవరులారా!' అని
శృంగారపువనమున తపస్సు చేస్తున్నాడు
దేవాధిదేవ రుద్రుండు తేజంబుగాను.[5]

కళ్యాణపు దేవగిరి పట్టణమును దేవాధి దేవరుద్రుండు పాలించుచుండెను. అతని భార్య దేవరుద్రులగంగ; కొడుకు దేవీజల బ్రాహ్మణుడు. ఈదేవీజల బ్రాహ్మణునకు ఏడ్గురు పుత్రులు: "ధర్మానికి పాలు పడ్డవాడు ధర్మసూడానిరాజు, అల్లానిరాజు, బల్లానిరాజు, అనుపద్మరాజు, కళ్యాణరాజు, కనకసోమరాజు, వీరసోమరాజు", దేవాధి దేవరుద్రుడు ఆడదియగు అంకాళశక్తిని కొలుచుట కిష్టము లేక, శృంగార వనములో తపస్సు చేయుచుండెను. అతని మనుమలు కూడ తాతగారి ననుసరించి అంకమ్మను ద్వేషించుచుండిరి.

ఆది భయంకరి అంకమ్మ 'భుజుని మాంకాళి పట్టణము' లో దివ్యభవనములో నూటొక్క శక్తులు కొలుచుచుండగా నివసించియుండెను. మారాసపు రాజులచే ఎట్లైనను తన్ను కొలిపించుకొనవలెనని అంకమ్మ పట్టుపట్టినది. ఒక వృద్ధురాలి వేషములో కళ్యాణ దేవగిరి పట్టణమునకువచ్చినది. మారాసపురాజు లేడ్గురును ఆమెనుచూచి కొట్టిరి; చిత్రహింసలు పెట్టిరి. పెద్దవాడు ధర్మసూడానిరాజు కొంచెము కనికరము చూపెను. చిన్నవాడు వీరసోమరాజు అమ్మవారి పట్టణమునకేగి ఆమె భవనములన్నిటిని కూల్చివేసెను.

తరువాత అమ్మవారు అల్లనేరేడుపండ్లను సృష్టించి, ఆ పండ్లొక తట్టలోపెట్టి, ఆ తట్టను నెత్తిని పెట్టుకొని కళ్యాణమునకువచ్చి పండ్లమ్మసాగెను. దేవాధి దేవరుద్రుని భార్య దేవరుద్రులగంగ పండ్లు కొనుచు, రుద్రాక్షలు విభూతిలేని ఆ అమ్మవారిని చూచి, మనుమలతో చెప్పినది. వారువచ్చి ఆ పండ్ల సమ్మెడిస్త్రీని అమ్మవారిగా గుర్తించి, పండ్లన్నియు నేలపై విసరి, ఆమెను ప్రేప బెత్తములతో కొట్టి, మెడలమీద చేతులువేసి అమ్మవారిని పడనెట్టినారు.

పిమ్మట మరియొకప్పుడు అమ్మవారు ఏడు పిడకలను బుట్టలో పెట్టుకొని కళ్యాణమునకు పోవుదారిలోనుండి, ఆ మార్గమున పోవుచున్న మారాసపు రాజులను ఆగంప నెత్తుడని ప్రాధేయపడినది. వారు ఆగంప నెత్తలేకపోయిరి. అంకమ్మ తన్ను చిత్రహింసలు పెట్టిన ఆ రాజులను సమయము వచ్చినప్పుడు ప్రతీకార మొనర్తునని హెచ్చరించినది.

అంకమ్మ ఎరుకల సింగడుగా మారి,నూటొక్కగుడిసెలు, గాడిద గుంపులు, పందులగుంపులుసృష్టించి, మారాసపువారిపంటలనునాశనము చేయసాగెను. మనుమలుపోయి తమ తాత దేవాధిదేవరుద్రునితో ఈ విషయము చెప్పిరి. ఆ పందులను బంధింపుడని తాత చెప్పెను. మారాసపురాజు లేడుగురును ఎరుకల గుడిసెలకడకు వచ్చిరి. అప్పుడు అమ్మవారు ముదుసలిరూపు దాల్చెను. అమ్మవారిని గుర్తించి రాజులామెను బెత్తములతో కొట్టబోయిరి. అమ్మవారు మంటలను సృష్టింపగా రాజులు కళ్యాణమునకు పారిపోయిరి.

అంకమ్మ తన చెల్లెలగు 'భండి వీరమాలక్ష్మి'ని ప్రార్థించి ఆమెచే కళ్యాణ దేవగిరి పట్టణమున ప్రజలకు దగ్గులు, పడిసెములు, వాంతులు, భేదులు కలిగించెను:

"పాలు త్రాగేటి బాలలు పాలారగించకుండ
ఉగ్గు త్రాగేటి బాలలు ఉగ్గారగించకుండ
రేపో పీనుగ మాపో పీనుగ
ఏడు కొల్లారపు బళ్లమీద ఎల్లదోలించవమ్మా!"

—అని అంకమ్మ తన చెల్లెలితో చెప్పెను. తాను ఎరుకలసాని వేషమును ధరించి, ఆ పట్టణమునకు వచ్చి, దేవరుద్రులగంగకు ఎరుక చెప్పి, దేవాధిదేవ రుద్రుని 'లక్షలకు దీరిన పచ్చలకిరీటంబు' కాజేసి పారిపోయెను.

తరువాత అంకమ్మదేవత జంగము వేషము ధరించి, 'భద్రగిరి చింతామణి పట్టణము'నకు పోయి, రాతికొలనులో పుష్పములు పండించి, ఆ పట్టణమేలు రాజుల మెప్పు పడసెను. 'కుంచెడు బియ్యము, కూరకట్ట, నలుగురు తలవరులను' ఆ రాజుకడ బహుమతిగా బడసి, ఒక పూలవనమును సృష్టించి, ఆ తలవరులను దెచ్చి దానికి కాపుంచెను. ఆ వనములోని పువ్వులను కోసి కళ్యాణ దేవగిరి పట్టణమునకు పంపెను. అప్పుడు కళ్యాణ దేవగిరి పట్టణమున పూవులు లేక శివపూజ లాగిపోయెను. మాయజంగము తల

వరులచే పంపిన పూవులను జూచి దేవాధిదేవరుద్రుండు మిక్కిలి సంతసించి, ఆ జంగమును తన దగ్గరకు తెమ్మనెను. రెండవ దినమున జంగమ వేషములోనున్న అమ్మవారు పూలుతెచ్చి దేవాధిదేవ రుద్రుని దర్శించెను. అతని దగ్గర బహుమతి బడసి వెడలిపోయెను. ఆ తరువాత పుష్పములు పంపలేదు. మారాసపు రాజులు తమ తాత ఆదేశానుసారము వెండిరథములు, మేఘరథములు, కంచురథములు తయారు చేసుకొని పుష్పములు తెచ్చుటకై భద్రగిరి చింతామణి పట్టణమునకు వచ్చిరి. అమ్మవారి వనములో పుష్పములు కోసికొని వెడలిపోయిరి. మరునాడుకూడ నట్లే పుష్పములు దొంగిలించుచుండగా అమ్మవారు వారిని పట్టుకొని బంధించినది. అక్కడ ఉక్కు స్తంభములు సృష్టించినది అమ్మవారు. మారాసపు రాజులను కల్యాణపు శంభుని మహిమచేత 'ఉక్కు నార్జాలు'[6] (ఉక్కు కత్తులు) కావింపుడని కోరినది; వారట్లే చేసిరి. ఆ ఉక్కు నార్జాలపై ఒరిగి పోవలసినదిగా ఆజ్ఞాపించినది అంకమ్మ. చేయునదిలేక మారాసపురాజు లేడ్గురును తమ తాత దేవాధిదేవ రుద్రుని దూషించుచు ఆ ఉక్కు నార్జాలపై నొరిగిపోయిరి. వారి రక్తము కారిపోకుండ, వారిపై ఈగలు వ్రాలకుండ అమ్మవారు 'దశకట్టులు' కట్టినది. అంకమ్మ ఈవిధముగా ఆ రాజులపై కసి తీర్చుకొని, బంగారు తూగుటుయ్యాలయందూగుచున్నది. ఈ కథాంతమున నిట్లున్నది:

మాటలు : "ఉక్కు నార్జాలపైన హరహర ఓ లింగ సనుశ్శివాయ యని

ఆ ఉక్కు నార్జాలపైని ఒరిగిరి మారాసపు రాజులు
రక్తధారలు భూపాత్ర మీదకు జడజడ కారుచునున్నవి.
ఆ రక్తము చూసి అమ్మవారు ఆ రాజులకు దశకటు
కడుతున్నద్ది

కారేటి రక్తము కరడు కట్టకుండ
ఈగ వ్రాలకుండ ఈలలు ముసరకుండ
ఆమడ దూరాన పోతున్న నక్కల నారాయుడు
తలయెత్తి రాజుల చాయ తప్పక చూడకుండ
దశకట్టులు కట్టి భుజాని మాంకాళి పట్టణము వెళ్లెను
అమ్మవారు తన మహిమచేత ఏడు భవనములు
కట్టించుకొని

తాలీ తోంబ్రము వంటి వస్త్రములు ధరించి
బంగారుతూగుటుయ్యలయందు తులతూగుతున్నాదట."[7]

2. రవద్దేవిరాజుకథ

ఇది అంకమ్మ కథాచక్రమున రెండవ వీరగాథ. పౌరాణిక ప్రసరణమునసున్నది. సుమారు 1060 పాదములు కలది. ఇందు గేయముకన్న వచనము హెచ్చుగానున్నది. దీని ప్రారంభమిట్లుండును :

''ముదిత గర్భిణియౌతున్న మూడు ఘడియలకు
నాలి గర్భిణియౌతున్న నాల్గు ఘడియలకు
లలిత గర్భిణియౌతున్న అయిదు ఘడియలకు
కడుపులో పిండంబు కదలాడసాగె
దంటి నొప్పులతోను తాళంగలేక
అడుగడుక్కు ఆ నోము అధికమై తోచె'' 8

పార్వతీ పరమేశ్వరులు ఆకాశవీధిని బోవుచుండిరి. కొరలబడ్డ మారాసపురాజుల శివనామ స్మరణము పార్వతివీనుల బడినది. ఆమె 'అది యేమి'టని శివుని ప్రశ్నించినది. శివుడు వారి కథను చెప్పి, ధర్మసూడానిరాజు గర్భమున జనించబోవు రవద్దేవిరాజు మాత్రమే వారి కొరలను లేపగల సమర్థుడని చెప్పెను.

మారాసపు రాజులు కొరలు పడుటకు మూడు ఘడియలు ముందుగా పాములపట్టుమేలు పద్మనందుల భాగీరథమ్మకు రవద్దేవిరాజు గర్భమున బడెను. ఈమె ధర్మసూడానిరాజు భార్య. ఆమెకు ఒకే కాన్పున ముగ్గురు సంతానము జన్మించిరి: రవద్దేవిరాజు, కనకరావేంద్రుడు—అను ఇరువురు కొడుకులు, 'శివగంటల మహాదేవమ్మ' అను కూతురు.

ఒకనాడు రవద్దేవిరాజు బొంగరము లాడుచు కోమటి యశోదమ్మచే దూషింపబడి, తన తండ్రులను వెదుకబోయెను. అతనికి అరణ్యమున ఒక ముని పంద్రెండుమెట్ల పైడి కిన్నెర నిచ్చెను. దానితో రవద్దేవిరాజు ఘుజుని మాంకాళి పట్టణమునకు పోయి, అమ్మవారికడ 'ఆనంద కోపులు' పాడి సంతోషపెట్టెను. ఆమె అరణ్యమున లంసిపోయి ఉండగా, ఆమెకు సిద్దులను కాపుంచి, బాలుడు అమ్మవారి భవనమున కేగి, ఆమె పంద్రెండు భద్రాయుధంబులను తెచ్చినాడు. ఈలోగా అమ్మవారు భయపడి నాగలోకమున కేగెను. ఆమె పోయిన సోరణకంతగుండా బాలుడుకూడా నాగలోకమునకు పోవుచుండెను. అమ్మవారు సోరణ కంతను 'ఆ గడ్డ యిటు, ఈ గడ్డ అటు కలవొత్తినది'. బాలుడు మధ్య నలిగిపోవుచు పరమేశ్వరుని ప్రార్థించెను. మరల నాగలోకమునకు మార్గము కనిపించెను. బాలుడు నాగలోకమున కేగగా అమ్మవారు పద్మసాలెస్త్రీ వలె మారి ఒడుగులు వేసుకొనుచుండెను. బాలు డామెను గుర్తింపగా, ఆమె పారిపోయి, ఆదికూర్మము చాటుకేగెను. బాలుడు ఆదికూర్మము ం ప్రార్థించెను. అమ్మవారి యుత్సవములో ఒకనాటి రాత్రి ఆదికూర్మమునకు వేడుక చేయింతునని చెప్పెను. ఆదికూర్మము ప్రక్కకు తొలగెను. బాలుడు అమ్మవారి వీరజడ లొడిసి పట్టుకొనెను. ఆమె తప్పించుకొని ఆదిశేషుని మరుగు జొచ్చెను. అమ్మవారికి భూలోకమున చేయు మత్సవములో ఒకనాటి రాత్రి 'శేషపాముపు' అను వేడుక చేయింతునని బాలుడు ఆదిశేషునకు మ్రొక్కుకొనెను. ఆ అంచమున కాసపడి శేషుడు ప్రక్కకు తొలగెను. బాలుడు తిరిగి అమ్మవారిని పట్టెను. ఇద్దరును పగడసాల పందెము నాడిరి.

ఇంతలో బాలుని మేనమామలగు ఆరువది ముగ్గురు గోవిందరాజులు 'తుమ్మెద భళ్లాణరాజు'న కోడి పారిపోవుచుండిరని అమ్మవారు చెప్పెను. బాలుడు అమ్మవారి సెలవు తీసుకొని, తుమ్మెద భళ్లాణరాజుపై దండెత్తి మూడు శిరసులు ఆరు హస్తములు ఖండించి, అమ్మవారికి కనకసివాళు లెత్తెను. అమ్మవారిదగ్గర బొమ్మిదిగడియల సెలవుతీసికొని మేనమామలు సంతసించిరి. పెద్ద మేనమామ పెద బాలగోవిందరాజు తన కుమార్తె 'ఉత్తర నలగంగ' నిచ్చి రవద్దేవిరాజునకు వివాహము చేసెను. బాలుడు తిరిగి అమ్మవారి దగ్గరకు నచ్చెను. అప్పటికి పంద్రెండు గడియలగుటచే అమ్మవారు కోమలపుట్టలో దాగిపోయెను. బాలుడు నాలుకలేని నాగస్వరము నూదెను. పంద్రెండు శిరసుల నాగేంద్రుడు బయటకు వచ్చెను. బాలుడు ధైర్యముతో ఆ పాము పంతము నొడిసి పట్టుకొనెను. అమ్మవారు ఆ బాలుని ధైర్యమునకు మెచ్చి అతని తండ్రులనందరిని కొరలు విడిపించినది.

అమ్మవారు తనకు దేవరుద్రుని బలిగా నిమ్మని బాలుని కోరినది. నరబలి యిచ్చుటకు వీలుకాదనియు, అతనికి బదులు మేకపోతును బలి యిచ్చెదననియు బాలుడు చెప్పెను. అట్లే అమ్మవారు కోరిన తలారివానికి బదులు గొఱ్ఱెను, కల్యాణరాజునకు బదులు బల్లిని, వీరస్వామిరాజునకు బదులు పందిని, అను పద్మరాజునకు బదులు ఎలుకను, కనక సోమరాజునకు బదులు పందికొక్కును, భళ్లాణరాజునకు బదులు దున్నపోతును బలియిచ్చుటకు బాలుడు అంగీకరించెను. తన తండ్రి ధర్మసూడానిరాజునకు బొందితో కైలాసమిచ్చెను. పాము రాయి పట్టణమునకు వచ్చి తల్లికి అగ్నిగుండమునకు సెలవిచ్చెను.

ఈ మారాసపురాజులలో చివరివాడగు వీర సోమరాజు ''ఆడ దేవతరాలు, అనాధీకురాలు, పిండి గోరుశక్తి, గోడ ఏల్బురాలు, కొంచెపు దైత్య, వేగిలేచి దీని ముఖారవిందము మన మారాసపువారు చూడ దోషంబు'' అని తలచి, అంకమ్మను కొలుచుట కిష్టములేక పల్నాటివారిలో కలసిపోయెను. అంకమ్మకూడ ఆ వీరసోమరాజుచే కొలిపించుకొనవలెనను పట్టుదలతో పల్నాటి అంకమ్మగా వెలసెను.

రవద్దేవిరాజు బ్రాహ్మణులు చెప్పిన జాతకమునునుసరించి తన చెల్లెలు శివగంటల మహాదేవమ్మను కాలు సేతులు లేనివాడును అంధుడును అగు శివన్నమహాదేవిరాజునకిచ్చి పెండ్లిచేసెను. ఆమెకు మూడు వరము లిచ్చుటకు అంగీకరించెను. రవద్దేవిరాజు తన భార్య

ఉత్తరపు నలగంగతో కలసి అంకాళశక్తిని కొలుచుచుండెను. ఈ కథాంత మిట్లున్నది.

"అన్నా! నీ యిష్ట ప్రకారముగనే కల్యాణము ఆడుతవున్నా. ముదమొప్ప మూడు వరములు కోరెదను, తప్పక యిచ్చెదవా?"

"సాష్టాంతముగా ఇచ్చెదను, కోరుకొనుము అమ్మా!"

"ఇప్పుడు వద్దు అన్నా. నాకు అవసరము వచ్చినప్పుడు కోరు కొనెదను"

"భూమి ఆకాశము సాక్షిగా, సూర్య చంద్రులు సాక్షిగా, మన కల్యాణ శంభుని సాక్షిగా, తప్పక యిచ్చెదను తల్లీ!"

ఆ శివగంటల మహద్దేవమ్మనిచ్చి శివన్న మహద్దేనిరాజునకు శ్రీ కల్యాణ మొనగూర్చెను. రవద్దేవిరాజు, భార్యయైన ఉత్తర నల గంగను కలసి, భార్యాభర్తలు సుఖజీవులై, అమ్మవారు అంకాళదేవతను విశ్రాంతిగా కొలుచుకొనుచుండిరి...... 9

ఏడుగురు మారాసపురాజులలో చివరివాడగు వీర సోమరాజుపల్నాటి వారితో కలిసినట్లుగాపల్నాటివీరకథలలోగూడ ప్రమాణములువ్వవి. ఈ వీరసోమునికూతురు సిరాదేవి. ఈమెను పెదమలిదేవరాజునకిచ్చి పెండ్లి చేసినట్లు పల్నాటి వీరకథలలో గలదు. ఈ వీర సోమరాజు కొడుకు కొమ్మరాజు. ఈ కొమ్మరాజు కొడుకు అలరాజు. ఇతడు నలగామరాజు కూతురు రత్నాలపేరిదేవిని పెండ్లాడెను. అలరాజు రాయబారమున, అలరాజు తల్లి 'పల్లమదేవి' తమ కొక్కడే పుత్రుడనియు, ఆమె మామగారి (వీరసోముని) అన్నదిమ్మలేడ్గురును ఆడదేవతను గొలిచి వశించి పోయిరనియు చెప్పెను.

ఇట్లు అంకమ్మను గొలిచిన పశ్చిమ చాళుక్యులకును, పల్నాటి హైహయులకును వివాహ సంబంధము లున్నవి. ఈ హైహయులు పశ్చిమ చాళుక్యులకు సామంతులగుట చారిత్రక సత్యము. నులిదేవ రాజాదులు బాలురుగా నున్నప్పుడు, కొమ్మరాజు కొంతకాలము మలి దేవుని రాజ్యమునకు (మాచెర్లకు) రాజుగా నుండెనని నాకు లభించిన పల్నాటి కథలో గలదు. ఈ హైహయులు పశ్చిమ చాళుక్యులకు సామంతు లగుటచేతనే వీరు కొమ్మరాజును, అలరాజును మిక్కిలిగా గౌరవించెడివారు. పల్నాటివారు కొమ్మరాజాదులను 'మహారాజుల వారు' అని పిలిచెడివారు. ఈ 'మహారాజులవారు' అను శబ్దమే 'మారాజులవారు' – 'మారాసపువారు'గా మారియుండునని నా యభిప్రాయము. సార్వభౌములని దీని కర్థము. దీనినిబట్టి పల్నాటి యుద్ధములోని కొమ్మరాజాదులును, అంకమ్మను గొలిచిన రాజులును పశ్చిమ చాళుక్యులనియు, వీరి రాజధాని కల్యాణనగరమనియు చెప్ప వచ్చును. కల్యాణము వీరి ముఖ్యపట్టణమగుటచే చారిత్రకులు వీరిని 'కల్యాణి చాళుక్యులు' అని పిలుతురు.10

అంకమ్మను కొలిచిన ఈ మారాసపు రాజులును, పల్నాటి యుద్ధములోని కొమ్మరాజాదులును చోళ(డ) రాజులేమో అనెడి అనుమానము కూడ వచ్చుచున్నది. అంకమ్మ కథలలో వచ్చు 'ధర్మ సూడానిరాజు' అను పేరుతో 'సూడాని' అనునది 'చోడాని' శబ్ద పరిణామము కావచ్చును. పల్నాటి వీరకథలలో నాకు లభించిన ఒక తాళపత్ర గంథమున కల్యాణమునేలు వీరసోముని గూర్చి వర్ణించుచు "చోడవంశమునందు శోభిల్లు రాజు" అని చెప్పబడినది.

రాయలసీమలో నాకు తటస్థపడిన ఒక గాథాకారుడు అంకమ్మ కథాస్థలము చిత్తూరు మండలమున సత్యవీడు తాలూకాలో నాగలా పురనుకడ నున్నదని తెల్పినాడు. ఇటనున్న రామగిరియే గంగురాజు కథలో వచ్చు 'దక్షిణ రామగిరి' అనినాడు. దీనికి పదిమైళ్లలో కనకరావేంద్రుడు (గంగురాజు పినతండ్రి) వసించిన దేవగిరికోట యున్నదట. ఇచట రామగిరిలో అంకమ్మ దేవళము, వెయ్యాది కోన, వెయిలింగాల పర్వతము కలవట. అంకమ్మ కథలో వచ్చెడి 'అలగల నల్లచెరువే' ఇటనున్న 'నెంద్రచెరు'వని గాథాకారుడు తెల్పి నాడు. దీని సత్యాసత్యములను పరిశీలింపవలసి యున్నది. కల్యాణ నగ రము, దేవగిరి పట్టణము అనునవి ప్రసిద్ధ చారిత్రక స్థలములు. ఇందు మొదటిది కర్నాటక రాష్ట్రమున గుల్బర్గా మండలమునగల కల్యాణ్. రెండవది మహారాష్ట్రమునగల దౌలతాబాద్. కాని అంకమ్మ కథలలో రెండింటిని కలిపి 'కల్యాణ దేవగిరి పట్టణము'ని ఒకే పేరుగా చెప్పబడినది.

3. గంగురాజు కథ లేక కల్యాణ గంగురాజు కథ

ఇది కృష్ణా మండలమున 1964లో నాకు లభించిన తాళ పత్ర గ్రంథము. ఇందు ముప్పది యెనిమిది పత్రము లున్నవి. తప్పు లెక్కువ. శైథిల్యము కలదు. అయినను కథ సమగ్రముగ నున్నది. సుమారు 1512 పంక్తులున్నవి. అంతయు మంజరీ ద్విపదయే. వచనములేదు.

'గంగురాజుకథ' అంకమ్మ గాథావృత్తమునగల మూడు గాథలలో చివరిది. రవద్దేవిరాజు పుత్రుడు గంగురాజు. ఇతని పిన తండ్రి (రవద్దేవిరాజు తమ్ముడు) కనకరావేంద్రుడు. ఈ కనక రావేంద్రుడు మిక్కిలి క్రూరుడు. రాజ్యము నపహరింప నెంచి కాబోలును, ఇతడు గంగు రాజును చంపుటకు ప్రయత్నించును. అమ్మవారి సహాయమున గంగురాజు ఇతనిని సంహరించును. ఈ గంగురాజును 'కల్యాణపు గంగురాజు' అని గాథాకారులు వ్యవహ రింతురు. తాళపత్ర గ్రంథమున 'రాజు గంగురాజు' అని కలదు.

కల్యాణపట్టణము నేలుటచే కల్యాణపు గంగురాజు అను పేరు వచ్చి యుండును.

రవద్దేవిరాజునకు ముగ్గురు పుత్రులు : గంగురాజు, భూపతి రాజు, కర్నమురాజు. వీరిలో గంగురాజు మహావీరుడు. ఏడేండ్ల బాలుడు. దేవగిరి పట్టణములో ఇతని పినతండ్రి కనకరావేంద్రుడు బావగారైన శివన్న మహద్దేవిరాజుతో నాలోచించి గంగు రాజు నేవిధముగానైనను చంపుటకు నిశ్చయించెను. (ఈ కథను బట్టి దేవగిరి పట్టణమును కనక రావేంద్రుడును, కల్యాణ పట్టణమును రవద్దేవి రాజును పాలించినట్లు తెలియుచున్నది). గంగురాజు తన తమ్ములతో దక్షిణ రామగిరి పట్టణమున నున్నాడు. అతడు గరిడిలో సాము చేయుచుండెను. కనకరావేంద్రుడు గంగురాజును చంపుటకై పదునార్గురు జెట్టిలను పంపినాడు. గరిడిలోనున్న గంగురాజు ఆ జెట్టిల నందరను జంపి, వారి శిరస్సులు తెచ్చి శివన్న మహద్దేవి రాజు ముందర క్రుమ్మరించెను. తరువాత కనకరావేంద్రుడు గంగు రాజుపై వెల్లయేనుగును పంపెను. గంగురాజు మావటివానితో సహా ఆ యేనుగును హతమార్చెను. ఇక లాభములేదని గంగురాజును కల్యాణముపై దండెత్తి పొమ్మనెను. కల్యాణములో అతడు తప్పక హతుడగునని తలచి యీ పన్నాగము పన్నెను. గంగురాజు తనకు వివాహము చేసినకాని కల్యాణముపైకి దండెత్తి పోననెను. అందుచే శివన్న మహద్దేవిరాజునకుగల ఏడుగురు కూతుళ్లలో పెద్దదియగు 'చుక్కల సూరద్దేవి' నిచ్చి పెండ్లిచేసిరి.

వివాహానంతరము గంగురాజు పండ్రెండువేల చతురంగ బలముతో కల్యాణముపై దండెత్తెను. తలారి మారినీడు, మువ్వల భీమినీడు, ఎరుకల పోతినీడు, పక్షుల భీమినీడు, తమ్ములు భూపతిరాజు—కర్నమురాజు మున్నగువారందరును గంగురాజుతో వెడలిరి. గంగురాజు భార్య చుక్కల సూరద్దేవి 'అష్టపద్మాల దేవగిరి యెంకు అంకాళ శక్తి'ని ప్రార్థించి, తన భర్తకు తోడుగా పంపెను. ఆ అమ్మవారి సహాయముతో గంగురాజు కష్టములన్నిటిని గట్టెక్కెను. పొంగిన ఏడేడు సముద్రములను దాటినాడు; బండి వీరమహంకాళి మఠమును దాటినాడు; బాలమండలపుకోటను ముట్టడించినాడు; బాలమండలపు రాజులను జంపినాడు; పరింగలకోటపై దండెత్తి పదునాల్గురు పరింగ దొరల నోడించినాడు.

దేవగిరి పట్టణములో కనకరావేంద్రుడు, తాను పంపిన గంగురాజు, కల్యాణపు దండయాత్రలో మరణించి యుండునని ఊహించి మిక్కిలి సంతోషించెను. గంగురాజుభార్య చుక్కల సూరద్దేవిని సహగమనము చేయుమని బలవంతము చేయసాగెను. ఆమె 'సాగుమానము' చేయుటకు సిద్ధముకాగా, అమ్మవారు వచ్చి రక్షించినది. ఇంతలో గంగురాజు విజయయాత్ర ముగించుకొని, దేవగిరి పట్టణమునకువచ్చి, క్రూరుడగు కనకరావేంద్రుని ఆ గుండములోనికి త్రోసి చంపెను త్రిమూర్తులు ప్రత్యక్షమై గంగురాజుదంపతుల నాశీర్వదించిరి.

కాటమరాజు కథాచక్రమునగల 'పెద్దిరాజుకథ'లో ఒక గంగురాజు వచ్చును. ఆతడును ఇతడును ఒక్కరేయేమో! పెద్దిరాజు కల్యాణ నగరమునకు వచ్చుట, అక్కడనున్న మారాసపు గంగురాజుతో చెలిమి చేయుట, ఆ గంగురాజునకు సహాయము చేయుటకై వాలికేతువ రాజుతో పోరి మరణించుట—మున్నగు అంశములు పెద్దిరాజు కథలో గలవు. పెద్దిరాజు మరణానంతరము, కాటమరాజును అతని చెల్లెలు పాపనూకను మారాసపు గంగురాజు పెందోట ముద్దమ్మ పెంచుదురు. కల్యాణ నగరమునకు పెద్దిరాజు పోవుట, అప్పుడు దానిని మారాసపు గంగురాజు పాలించుచుండుట—అను విషయములు పెద్దిరాజు కథలో స్పష్టముగా నున్నవి. అందుచే పెద్దిరాజు కథలోని గంగురాజును, అంకమ్మ కథలలోని గంగురాజును ఒక్కరే అయియుందురని నా నమ్మకము,

అంకమ్మ కథాచక్రములోని మొదటికథ, రెండవకథ కవిత్వ విషయమున అంత బింకముగా లేవు. మౌఖిక ప్రసరణముననున్న గాథలను సేకరించుటచే ఈ లోపము వచ్చియుండును. వీనికిగల తాళపత్ర గ్రంథములను సంపాదించినచో ఈ లోపము తీరునని నా నమ్మకము. మూడవ కథయగు 'గంగురాజుకథ'లో కవిత్వముపాలు హెచ్చుగానున్నది. ఇది తాళపత్ర గ్రంథముగా లభించుటచే నిట్లున్నదని చెప్పవచ్చును. మౌఖిక సంప్రదాయముననుండు కథలలో కథాకథనమే ప్రాముఖ్యము వహించి, కవితాదృష్టి సన్నగిల్లును. కవిత్వ దృష్టిగల పాదములను గాథాకారుడు విస్మరించియుండవచ్చును. తాళపత్ర గ్రంథములలో ఈ లోపము లుండవు. వీనిలో కండపట్టుగల భాగములు చెక్కు చెదరక అట్లే యుండును.

అంకమ్మకథలు ప్రధానముగా అద్భుతావహములగు వర్ణనలతో నిండియున్నవి. అంకమ్మ శక్తియగుటచే ఆమె ప్రభావమును తెలుపుటకు ఇట్లు వర్ణింపబడి యుండును. అంకమ్మ తన తమ్ముడు పోతురాజుతో గలసి పుష్పవనమును వేయుటకై భూమిని దున్ను సందర్భమున ఆమె కొఱ్ఱును సృష్టించుట అద్భుతరస ప్రధానముగ వర్ణింపబడినది :

> "నాగుబాముల బట్టెను కొఱ్ఱుకు నగలు కావించెను
> జెఱ్ఱిపోతుల బట్టెను కొఱ్ఱుకు చక్రములు గావించెను
> త్రాచుపాముల బట్టెను కొఱ్ఱుకు పరములు గావించెను
> పసిరిక పాములను బట్టెను కొఱ్ఱుకు పగ్గములుగావించెను

మునీశ్వరులవంటి పాముల బట్టేను కొట్టుకు ముళ్లకట్టు గావించెను
పొట్టి పొట్టి నక్కలనుబట్టి కొట్టుకు ఎద్దుల గావించెను

గంగురాజు కథలో తెనుగు నుడికారము, వీరగాథల సాధారణ ప్రయోగములు, దేశి ఉపమానములు పెక్కుగలవు. 'చెక్కిట బాగాలు చెదరంగ నవ్వెను', 'ఏంచంగ పెంచంగ ఏడేండ్ల బాల కుమారుడు' అనునవి నుడికారమునకు ఉదాహరణములు. 'మదగజంబులు రెండు మార్కొన్నయట్లు, కొదమ సింగములు రెండు కోరాడినట్లు' అనునది వీరగాథలలో తరచుగా గానవచ్చు ప్రయోగము. 'కొమ్మె వంగని దాన్ని మానై వంచగ'–'కొద్ది నిప్పుని కొంగున కట్టంగ తగదు' మున్నగు సామెతలు ఈ కథలో కొల్లలుగా నున్నవి. కనక రావేంద్రుడు గంగురాజును చంపుటకై పంపిన పదునార్గురు జెట్టీల వర్ణనలో మం కవిత్వమున్నది :

''గుద్దులకు దొడ్డవాడు గుజ్జుపుజెట్టి వకడు
వీశెసామునకు దొడ్డవాడు వీరజెట్టి వకడు
పందిరిమీద గుండువకడు, పైబడ్డ పిడుగు వకడు
నీళ్లలో ముల్లు వకడు, నిబ్బరమైన బంటు వకడు
కానరాని ముల్లు వకడు, అంగిట గాలమొకడు
తాకేకు మంటవకడు, దరిగొన్న చిచ్చు వకడు'' 12

ఈ అంకమ్మ కథాచక్రము పల్నాటి వీరకథా చక్రముతోను, కాటమరాజు కథాచక్రముతోను సంబంధమును చూపుచున్నది. కావున దీనిలోని చారిత్రక విషయములను గూర్చి కూలంకషముగా పరిశోధింపవలసిన ఆవశ్యకత యున్నది.

అ ధో జ్ఞా పి క లు

1. శ్రీమతి సరస్వతీ చెన్నకేశవన్, విజ్ఞానసర్వస్వము, సంపుటి 7, పుట 725.

2. శక్తి పూజను గురించిన ఈ విశేషములను తెల్పినవారు మిత్రులు డా. ప్రసాద్‌రాయ కులపతిగారు(గుంటూరు) వారికి మిక్కిలి కృతజ్ఞుడను.

3. ప్రభాకరశాస్త్రిగారిచ్చిన పట్టిక'శృంగార శ్రీనాథము'న గలదు. తిమ్మావజ్ఝల వారి పట్టిక ఆంధ్రపత్రిక విజయ సంవత్సరాది సంచిక (1953-54), పుట 33 లో గలదు.

4. నెల్లూరుజిల్లా, కోవూరు తాలూకా, ఊటుకూరు గ్రామములో డక్కాదేవదానం అను పంబలవాడు 26–7–1966 న పాడిన ప్రార్థన.

5. డక్కా దేవదానం పాడిన అంకమ్మకథలో ప్రారంభము (26–7–1966).

6. 'నారాజి' లేక 'నరాజి'=కత్తి.

7. డక్కా దేవదానం పాడిన కథలో అంత్యము (26–7–1966).

8. డక్కా దేవదానం పాడిన 'రవద్దేవి రాజు కథ' నుండి (27–7–1966)

9. డక్కా దేవదానం అను పంబలవాడు పాడిన 'రవద్దేవి రాజు కథ' (27–7–1966).

10. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు పెదపులివేవునకు పిల్లనిచ్చిన వీరసోముడు కలచూరి బిజ్జలుని కొడుకని అభిప్రాయపడిరి. ఇది నాకు సమంజసముగా తోచుట లేదు.

11. డక్కాదేవదానం అను పంబలవాడు పాడిన అంకమ్మ కథనుండి (26–7–1966).

12. కృష్ణామండలములో 1964లో నాకు లభించిన తాళపత్ర గ్రంథము, గంగురాజు కథ, పత్రము 7.

ముళ్లు

శ్రీ సోమసుందర్

పాదాలు విరిగేట్టు పరిగెటు కుంటూ వచ్చి
కాళ్ళు పారజాపుకుని కూర్చున్నానిక్కడ
నీ కోసం! ఎంత ఆతుర్దాపడ్డానో అంతా ఆశాభంగమే!

ఎక్కడో దూరంగా కొండలో అడవుల్లో అరకులోయల్లో
ఎడ్రస్సైనా లేకుండా ద్రిమ్మరిస్తున్న వేళల్లో
నువ్వు రాసిన ఉత్తరం – ఏడేళ్లాలస్యంగా అందింది

అడవుల్లోనూ
కొండల్లోనూ
విహరిస్తున్నపుడు

దారిని దొరికిన పువ్వుల్లా నీ కోసం కోశానా
బస్తాడు బండి గురివెందల్ని చేర్చానా
బుజాని కెత్తుకుని మోసుకు వచ్చానా
తీరా వచ్చేసరికి నువ్వు లేవు...

"కబురూ కాకరకాయా చేరక
ఉత్తరమూ పత్తరమూ అందక..."
నా కోసమే బయల్దేరావటగా? — మీ అమ్మ చెప్పింది;
విశిష్టాద్వైతంలా సాగతీసుకుంది

ఎక్కడ వెదుక్కుంటున్నావో ఏమో
అవన్నీ మొద్దుకొండలు, సూదిముళ్లు
ప్రమాదాల ఎదురు దెబ్బలు తగిలే రాళ్లు
— మీ అమ్మ కూడా ఆక్రోశించింది
మా ఇద్దరివీ రెండు రకాల ప్రేమలు ...

ఇక్కడ నేను నీ కోసం కలలుకంటూ
కలల్లో కవిత్వాలల్లుకుంటూ
కలత నిద్దర్లై లేచి శూన్యాన్ని వెదుక్కుంటూ
కనీసం నీ బొమ్మయినా మోయని పాడుగోడలు
నవ్వుతుంటాయి వెకిలిగా ... వెర్రిగా ... వెల్లగ ...

కొండమీద
పడుతూ లేస్తూ
పరిగెట్టి పరిగెట్టి

ఆఖరి కెలాగో పట్టుకుని
జేబులో భద్రంగా దాచుకుని
నీ సిగలో తురమాలని తెచ్చిన హరివిల్లు
కన్నీరులా కరగిపోతున్న సెలయేరు ...

త్వరగా వచ్చేవా?
వచ్చి చూడవా నా గుండెల్లో ఎన్ని ముళ్లో!
ఎన్నెన్ని విరహపు బాకు గాయాలో?
ఇన్నిన్ని విరిగిపోయిన కలల్ని దేనితో ఎలా అతుక్కోను!

నేను నీ·గిరి కొండలపై విహరిస్తున్నపుడు
దక్షిణానికి ఒరిగి జారిన శుక్ర తార
దొరికినట్టే దొరికి చేజారిపోయిందికదా –
ఆ కథంతా ఎవరికి చెప్పుకోను?

చచ్చి చెడి నీ కోసం పట్టితెచ్చిన చంద్రుడి చెవులపిల్లి
ఆకలితో శోషిల్లి, నాకులాగే సొమ్మసిల్లి
కదలకుండా పడి వుంది
దబ్బు దబ్బున రావా!
ఎంతసేపని ఇలా నీళ్లు నములుతూ
గుటకలు మింగుతూ
కాళ్లు పారజాపుకుని కూర్చోనిక్కడ?!

వేదుల సంస్మరణ

మహాకవులకు మరణం లేదు!

శ్రీ మిరియాల రామకృష్ణ

మా కవులు మరణిస్తారు. సార్థక్యం లేక మరణిస్తారు. వార్ధక్యం వచ్చి మరణిస్తారు. మహా కవులు మరణించారు. మరణంతో వారు చేసిన రణాలే వారి కావ్యాలు. వారు మృత్యుంజయులు.

భౌతికకాయం విసర్జించారు వేదుల! హేమంత హసంతికలో అదృశ్యమయ్యారు వేదుల! రసవత్ సరస్వతిలో మునిగిపోయారు వేదుల! ఈ శతాబ్దికి డబ్బైయ్యైదు శరత్తులు దానంచేసి వెళ్ళిపోయారు వేదుల!

భావకవితా వీధుల్లో ప్రతి విభావరినీ ఒక 'దీపావళి' చేశారు వేదుల! తన జీవితాన్ని ఒక 'ముక్తాఝరి' చేసుకుని మురిసిపోయారు వేదుల!

పలికిన ప్రతి పలుకులో ఒక తళుకు, ఒక మెలకువ, ఒక గుబాళింపు, ఒక జాణతనం, ఒక గానధనం గ్రుమ్మరించారు వేదుల!

మహాకవిత్వానికి రాశికాదు నికషోపలం! రామణీయకమే దానికి తూకం. చాలొక్క శ్లోకం జీవితమంతా పులకింపజెయ్యడానికి! మజ్జిగ నీళ్లకేమి చాలామంది పోస్తారు దాహంవేస్తూంటే! కానీ ఆయన పెట్టింది అచ్చంగా నవనీతం. నవతకు ప్రాణతుల్యమయిన నవనీతం!

వేదుల కవిత్వానికి ఆవేదన, ఆవేశము చక్రాలు. కాళిదాసు, భవభూతి ఛత్రాలు. రవీంద్రుడు, కృష్ణశాస్త్రి మిత్రాలు.

ముందెప్పుడో రాబోయే ప్రగతి వాదానికి ఆయన 'కాగడా,' కాంక్ష' వంటివి ఉదయకిరణాలయితే, సమకాలీన ప్రణయ కవితా వాదానికి ఆయన 'నిరీక్షణ,' 'దీపావళిపాడు', 'కన్నీటి పాటలు' వంటివి హిమాంశు పాంశువులయ్యాయి.

సిసలయిన కవికి పాత కొత్తలు నిమిత్త మాత్రాలు. విలువలాతని వలువలు. శిల్పమాతని శిరస్సు. భావన ఆతని జీవనం, రసం అతని హాసం. కళ అతని కల. వేదుల అక్షరాలా ఈ లక్షణాల లక్ష్యాధికారి.

బెంగాలీభాష నేర్చుకున్న వేదుల రవీంద్రుడ్ని రసమయాంధ్రంలోకి అనువదించారు. ఆంగ్లకవితా సీమల్లో అడుగుపెట్టకున్నా అభినవ కవిత్వానికి అంచులు చూశారు. నిజమే! హృదయం అతుక్కుంటే రాదు! వెతుక్కుంటే కవిలోనేఉంటుంది. తనలోనే కవిత్వం వెతుక్కున్న మహాకవి వేదుల.

'గౌతమీకోకిల' బిరుదు ఆయనకే చెల్లు! గౌతమీతీరంలోని తోటపల్లి ఆయన తల్లిఒడి. గౌతమీ తీరంలోని కవిసార్వభౌముడు ఆయన గురుదేవుడు. నన్నయవృత్తాల రసవన్నినాదం: రమణీయ హ్లాదం ఆయన కలంలోని ఫలం!

భావకవిత్వం ఒక పొదరిల్లు! ఎంత వెదికినా నాలుగైదే అందులోని అందాల హరిణాలు. సందేహమెందుకు? వేదుల కవిత్వం అందులోనిదే! అంధుల్ని సమ్మోహపరిచిన అపరంజి కురంగం వేదుల కవితారంగం!

నీహార విహార గంధవాహ మాయుర కవిత్వం! స్నేహారవింద మందహాస వికాస మాయన వ్యక్తిత్వం!!!

పద్య విద్య - అక్షర రమ్యత

శ్రీ కుమార భారతి

పై రెండు మాటలు మహితాత్ముడు నన్నయగారన్నవి. పద్యరచన మొక విద్య. శిల్పాత్మకము. యతిప్రాసాది ఛందోలక్షణములు కలది మాత్రమేకాదు. ఈ విద్య యనంతరూప. కవియొక్క సంస్కారము, శబ్దోపాసనా బలములచేత సాధ్యమైన బహుముఖమైన యీ విద్య అక్షరరమ్యతామూలమని యాదికవిభావన. ఇది శైలీ లక్షణము. శైలి కవిస్ఫురణ ననుసరించి ప్రయత్న సాధ్యమునై యావిష్కృత మగుచున్నది. ఇది మిక్కిలి జీవలక్షణమునకు సంబంధించి యుండును. ప్రధానముగ నీశైలి రెండురకాలు -

1. మధుర-సుకుమార, శైలి.
2. విచిత్ర-అద్భుత, శైలి.

నన్నయ మార్గము రమణీయము. సుకుమార మధురము. అది తన కిష్టమైనది. దానిని 'ఇతరులు' ఆదరింతురన్నాడు. 'లోనారసి మేలునా' దగని వారు లోనారయలేనివారు. వీరులోకమున నెక్కువ. కాగా సుకుమార శైలీ ప్రియత్వము బహుజనాదరణ పాత్రము. విచిత్ర శైలిని మెచ్చుకొనుటకు కావలసిన శక్తి-ఓర్పు-విచారణ దీనికక్కరలేదు. ఇందుచేతనె సోమన-రామకృష్ణ-రాయల మార్గములు దుర్భేద్యములై విచిత్ర కళా మనస్వుల మనస్సుల కెక్కినంతగా లోకాదృతి పొందలేదు. నన్నయ, పెద్దనాదుల మార్గములు మధుర ములై సర్వవేద్యములై వాసికెక్కినవి. కాగా విచిత్రశైలి నందఱు మెచ్చలేరు. దానికి 'చాల' కావలయును. దీని కంతక్కరలేదు. వినినంతనే సంగీతమట్లు మనసునకెగ్రబాకును.

అక్షరరమ్యత యననేమి ? "వర్ణ విన్యాసదృష్ట్యాచే మృదు - స్ఫుట మిశ్ర బంధములు లేక శైలులు మూడు. మృదుబంధము లలిత పద ఘటనచే-స్ఫుటము, ద్విత్వాద్యక్షర ఘటనచే సాధ్యము. మాధుర్యము శబ్దార్థగతముగా నుండును. అక్షర మాధుర్యము చెవికి సమానానుభూతినిచ్చు పదాసత్తి. ఇది సానుప్రాసము. రసావహ. ఇది మసృణము. సమాన స్థానజన్యమైన భిన్నాక్షర సంపుటియే శ్రవణపేయతను సిద్ధింప జేయును."

'ఏష రాజా యదాలక్ష్మీం ప్రాప వాన్ బ్రాహ్మణప్రియః'

ఇచట ష-వలు, జ-యలు, ద-లలు ఏకస్థాన జన్యములగుట అక్షర మాధుర్యము నిష్పన్న మగుచున్నది. ఇది వైదర్భుల మార్గము. ఇదొకరకము.

రెండవది పద-పాదగతమైన వర్ణావృత్తిరూపమైన యనుప్రాస. అదూరవర్తులై పూర్వానుభవ సంస్కార బోధ కల్గించు నక్షరముల కూర్పుచే సిద్ధించునట్టి దొకటి.

"చంద్రే శరన్నిశోత్తంసే కుంద స్తబక సన్నిభే-"

ఇందు శకారము రెండుమార్లు, కకారము రెండుమార్లు, సకారము మూడుమార్లు వచ్చుటచే సామ్యప్రతీతి కలిగి మాధుర్యము పుట్టు చున్నది.

సామ్యతా స్ఫోరకములగు నక్షరముల నడుమ అంతరముండరాదు ఉన్నచో మాధుర్య స్ఫూర్తి యుండదు.

'రామా ముఖాంభోజ-సదృశశ్చంద్రమాః'

మకార సాదృశ్యమునం దంతర మున్నందున నిట మాధుర్య పుట్టుటలేదు. ఈ మాధుర్యమును భంజించునట్టి మఱొక గుణము

[1] బంధ పారుష్యహేతువైన విసర్గ ఓకారసంధి క్రమము మఱియు పతత్ప్రకర్ష రూపదోషము.

దీనిని తిరుగవేసినచో బంధ సౌకుమార్య హేతువులైన సంధులు, బంధ శైథిల్యమైన పతత్ప్రకర్ష లేని రచన శోభాహేతువని తెలును.

1. రసానుగుణమైనట్టిదై సమానస్థాన జన్య భిన్నాక్షర ములుగల యనుప్రాస.

2. రసానుగుణము కాకుండియు సస్పృశ వర్ణావృత్తి రూపమైన అనుప్రాస.

3. బంధ సౌకుమార్యమును సంఘటించు సంధులు.

4. పద్యవాక్య రచనలో నెగుడు దిగుడులు లేకుండుట అశైథిల్యము. ఇవి అక్షర మాధుర్యహేతువులు. ఇది మృదుబంధ పద్ధతి.

అర్థగతమై గ్రామ్యత యెట్లు రసభంజక హేతువగుచున్నదో యట్లే బంధగతమైన శైథిల్యమును—

'మాలతీ మాలా లోలాలికలిలా—

ఇట వైదర్భు లనుప్రాసమున్నను మెచ్చరు. కారణము బంధము సందు సుశ్లిష్టతలేదు.

'కోకిలాలాప వాచాలో మామేతి మలయానిలః'

ఇది మృదుబంధపద్ధతి. ఇది కోమలము. సుశ్లిష్ట రచనమైన కారణమున మృదు బంధ పదవీ యోగ్యమైనది. ఇదంతయు దండి చెప్పినది. (చూ. కావ్యాదర్శ. ప్రథమ పరిచ్ఛేదము)

దీనిననుసరించిన ఉద్భటుని విచారణ మిట్లున్నది.

అనుప్రాస విషయమున మూడు భేదములు. అవి "రసాద్యభివ్యక్త్యనుగుణ వ్యవహారాత్మకము"లని వ్యాఖ్యాత ఇందురాజు. ఇవి వృత్తులు. (Styles అను బన్నట్టే అనువాదము) 1) పరుష 2) ఉపనాగరిక 3) గ్రామ్య.

* a 1. శ, ష, ట వర్గాక్షరములు. రేఫ సంయుక్తములు, (క్ర, ర్క) ల, వ కార సంయుక్తములు. (హ్ల, హ్వ) ఇత్యాద్యక్షరముల కూర్పు కలది పరుష.

2. ద్విత్వాక్షరములు, వర్గ పంచమాక్షరములు, వర్గాంతాక్షర సంయుతములు కలది ఉపనాగరిక.

3. పై రెంటిలో నుపయుక్తములు కాని యక్షరముల కూర్పు కలది గ్రామ్య.

* b ఉదా :— కేలి లోలాలి మాలానాం కలైః కోలాహలైః క్వచిత్
కుర్వతీ కాననారూఢ శ్రీ నూపురరవ భ్రమమ్

ఇదు లకార, కకార రేఫ సారూప్యము.

దండి బంధశబ్దమును వాడగా తత్స్థానమున నుద్భటుడు వృత్తి శబ్దమును వాడెను. రెండును అక్షర విన్యాసాత్మకమైన శైలీ విషయమునే సూచించును.

కుంతకుని యందీ విషయచర్చ పరా కోటి నధిష్ఠించినది. అతని విచారణసారాంశమిది.

పై వారిద్దరు బంధ -వృత్తులనగా కుంతకుడు వారి సిద్ధాంత సారమును తన వక్రతా సిద్ధాంతమున కంగీభూతముకావించి దానికి— పై వారి వాదమును వర్ణ విన్యాస వక్రతగా పేర్కొని దానినిట్లు వివరించెను.

వర్ణ విన్యాస వక్రత మువ్విధములు

1) అ) ఏకాక్షర పునరావృత్తి :—
వినివేశ

ఆ) ద్వ్యక్షర పునరావృత్తి :—
లీలామంథర తారకే
(ల—ర—లు)

ఇ) త్ర్యక్షర పునరావృత్తి :—
తాళతాళీసరల తరలతా లాసికా
(త—4, ల—5, ర—2)

2) రెండవపద్ధతి నిరూపణ :

అ) స్పర్శములు తత ద్వర్గాంతిమాక్షర సంయుక్తములగుట చే

ఆ) త: ల నాదుల ద్విత్వము—చే

ఇ) రకారాది సంయుక్తములైన శ్లేషవర్ణములచే ఏర్పడును

ఇదంతయు రసభావాద్యౌచిత్యము ననుసరించి.

ఉదా :— అ) పిశంగి తాంగా గుంజంతి మంజు మధుపాః — చుంబి బింబమ్.

ఆ) విరహోత్తామ్యత్తన్వీ — బిసినీ కందచ్ఛేదచ్ఛవిర్మృగ లాంఛనః

(త—ల నాదులలోని ఆదులన్నమాటతో చ్ఛ — గృహీతము)

ఇ) సౌందర్య ధుర్య

ఇట్లే రెండు మార్గములందును పునరావృత్త సమాన వ్యంజనములు స్వల్పాంతరస్థములు కావలెననుట సామాన్య లక్షణము. దీనికి వ్యతిరేకముగ సవ్యవధానమునందును స్వరముల యొక్క అసాదృశ్యము నందును వర్ణ విన్యాస వక్రత — సౌందర్య మనుభూత మగుచున్నది.

2) అ) అవ్యవధానమున సౌందర్యము. ఇది ఏకాక్షర సంబంధి.

* a వామం కజ్జలవద్విలోచన మురో రోహద్విసారి స్తనమ్.

ఇట్లే రెండు మూడక్షరములకు నుండవచ్చును (చూ. వక్రోక్తి జీవితము)

ఆ) వ్యవధాన పూర్వక వక్రత :—

స్వస్థాః సంతు వసంత తే రతిపతే రగ్రేసరా వాసరాః

సంతు—సంత—'వ' చే; సరా—సరాః—'వా' చేతను వ్యవధానితములు. ఇట్లే బహ్వక్షరములను నుండును.

ఇ) స్వరముల యొక్క అసాదృశ్యముచే నేర్పడునది.

రాజీవ జీవితేశ్వరే — జీవ-లో, జీవి—లో, అ—ఇలు అసదృశ స్వరములైనను వక్రతయున్నది.

ఈ విధమైన రచనకు కవిలోకము తీసికోదగిన జాగ్రత్తలు :—

1) ఔచిత్యము. రసభావానుగుణముగ స్వీకరించవలెను. మృదురసానుగుణమైన అక్షర సంపుటి వేరు. పరుష రసానురూపమైనది వేరు కావున.

* a 2) నిర్బంధము పనికిరాదు. వ్యసనము పనికిరాదు. అప్రయత్న సిద్ధమైనపుడేవక్రత. లేనిచో చాపలము.కృతకముగనున్నచో నందము లేకపోగా పాఠకునకు జుగుప్స కల్గును. అనగా భావపుష్టి లేక కేవల శబ్దాలంకారమైన అనుప్రాస వాడుట. (కుంతకుడు శబ్దాలంకారమైన అనుప్రాసవేరు, వర్ణ విన్యాస వక్రత వేరని యిట్లు భావించినట్లు స్పష్ట పడుచున్నది. అచట అర్థగౌరవ ముండదుకదా!)

ఉదా :—'భణ తరుణి రమణ మందిర మానంద స్యంది సుందరేందు ముఖి' వంటి శ్లోకములు.

"ప్రతిభా దారిద్ర్య దైన్యాదతిస్వల్పసుభాషితేన కవినా వర్ణ సావర్ణ్య రమ్యతామాత్ర" పర్యవసితములు.

'న పునః వాచ్య వైచిత్ర్య కణికా కాచిదస్తి'-అని కుంతకుని నిరసన. (వివరములకు వక్రోక్తి జీవితము 1—7 కారికా వివరణము చూడవలెను.)

* b 3) కాఠిన్యము పనికిరాదు. శీర్ణ ఘ్రాణాంఘ్రి పాణీన్— ఇట్లుండరాదు.

4) పూర్వము గ్రహించిన వానిని వదలుచు నూత్నములైన వానిని గ్రహించుట.

ఉదా:—ఏతాం పశ్య పురస్తటీమిహ కిలక్రీడాకిరాతో హరః

....

....

మందం మందమకారి యేన నిజయోర్దోర్దండయో ర్మండనమ్

ఇట్లు కుంతకుడు నిరూపించెను. ఇందు దండి, ఉద్భటుల మతాలు గర్భితములై యున్నవి. దండి స్వల్పాంతర ముండవలె నన్నట్లే కుంతకుడు నన్నాడు. అవ్యవధానమున-వ్యవధానముననను వక్రత యుండు నన్నను దండికి వ్యతిరేకము కాదు. కుంతకుని పై నిరూపణమందలి రెండవ పద్ధతి కేవల ముద్భటుని వృత్తిత్రయ నిరూపణము ననుసరించి చేయబడినదే.

శబ్ద సౌందర్య మర్థసౌందర్యము పరస్పరము స్పర్ధవహించినవో యన్నట్లు 'పోటీ' పడుటయే శబ్దార్థ సహితత్వము. దాని నిది దీని నది యొరసికొనుటనుండి పుట్టునది వక్రత. ఈ సంఘర్షణ — స్పర్థ - నుండి పుట్టునొక విచిత్రమైన భావను వక్రత. ఈ దృష్టిలో సాహిత్యమును విచారించిన మహాప్రతిభాశాలి కుంతకుడు. కావున వర్ణ విన్యాస వక్రతయందు-అనుప్రాసమున్నను—అది యది కాదు. అది యర్థ సౌందర్య విహీనమైన శబ్దాలంకారము. కాగా నౌచిత్య పురస్సరమైన సదృశ వ్యంజనావృత్తి వర్ణ విన్యాస వక్రత. తర్వాతివారు దీనినంతయు ననుప్రాసగా గ్రహించుటలో నీ సౌందర్యము-గభీరదృష్టి నశించిపోయినది. అది వేరుగా చూడదగిన విషయము—అప్రస్తుత మగుటచేత.

ఈ దృష్టియే నన్నయగారి 'అక్షర రమ్యత' యన్న మాటలో నిమిడియున్నది. పై శాస్త్రకారులు పెట్టిన పేర్లకంటె నిది మధురతమము. ఉద్భటుని ఉపనాగరికా వృత్తియే నన్నయగారి పద్యరచన యందున్నది. ఉపనాగరిక యని దాని కా పేరేల వచ్చినది?

'ఏషా ఖలు నాగరికయా వైదగ్ధీ జుషా
వనితయా ఉపమీయతే తత ఉపనాగరికా'

అని వ్యాఖ్యాత ఇందురాజు. ఈ నాగరకతా వైదగ్ధ్యము కలది శైలి. అది లేనిది వట్టి శాసనపద్యము. ఇందుచే నన్నయ ఆదికవి. ఉపనాగరికకు ఉద్భటుని ఉదాహరణము :—

* 'సాంద్రారవింద వృందోత్థ మకరందాంబుబిందుభిః
స్యందిభిః సుందర స్యందం నందితేందిందిరా క్వచిత్'—

ఇందలి బిందుపూర్వక దకార సంఘటన సుందరము. వర్ణితాంశము—శరత్తున అరవిందముల నుండి మరందబిందువు లందముగా కురియుచున్నవి. ఆ సాంద్ర వృష్టిచే భ్రమరము లానందించు చున్నవి. ఇదొక సుందర దృశ్యము. ఆ దృశ్యసౌందర్య మీశబ్ద విన్యాస సౌందర్యము మూర్తికట్టించుచున్నది.

* b ఇందుచే నిది వృత్తి. లేనిచో వట్టి అనుప్రాస. శబ్దాలంకారము.

శ బ్ద దృ ష్టి

'ఉచ్చారణ దకుచేత నభిహితంబగు శబ్దంబు నట్లపోలె'—ఆది. 3–127. శబ్దము=వేదము. అలౌకికము. తజ్జన్యలౌకికశబ్దము=కావ్యము నందలి శబ్దము. పై పోలిక శుశ్రుష పునర్జన్మకు. కాన ఉచ్చారణచే శబ్ద వ్యక్తీకృతి. ఏ శబ్దము నెంతగా నే యక్షరముపై నొక్కి ఊనిక నుంచి చదువవలెనని కవి యభిలషించెనో యట్లు చదువుటచే నక్షర సంపుటీరూపమైన శబ్దము నాదముగా మారి లయాన్విత చిత్తవృత్తి బోధకమగుచున్నది. ఈ నాదము లయాత్మకము కాని ప్రళయాత్మకము కాదు. ఆ లయ ఛందము. ఛందమనగా లయ. వృత్తాకారనాద భ్రమణ. ఆ నాదమక్కడక్కడే వలయాలు వలయాలుగా చుట్టుకొని లయాత్మకముగా స్వనించుకుండలినియై కేవల నాద బ్రహ్మానుభూతిని కలిగించును. అవ్యక్తనాద **(Abstract Music)** ముఖముగా చిత్తవృత్తి నాకర్షించుట. దీనికి, అక్షరమే పునాది **(Unit)** ఏకాక్షర పునరావృత్తిచే నేర్పడు నాదము; అక్షర రమ్యతాధ్యేయము. శబ్దము నాదముగా మార్చి దానియందు ప్రేక్షక చిత్తవృత్తిని లయింపజేయుట. నాటకమున సంగీత స్థాన మిట్టిదే. లౌకిక వ్యవహార మగ్నమైన మనస్సును రసోన్ముఖమొనర్చుటకైనమహాసాధనము సంగీతము. దీనిచే లౌకికచిత్తవృత్త్యుపశమనముకలుగును. కాళిదాసు ప్రమాణము.

> సూత్ర :– ''ఆర్యే! సాధు గీతం. అహో! రాగానుబద్ధ చిత్త
> వృత్తిరాలిఖిత ఇవ సర్వతోరంగః'—
> తవాస్మి గీత రాగేణ హారిణా ప్రసభం హృతః'
>
> — అభిజ్ఞాన శాకుంతలమ్.

కావున దీని లక్ష్యమిది. ఇతర వ్యవహారమగ్నమైన ఆంధ్ర జాతి మనస్సును తన అక్షర రమ్యతచే నాకర్షించి మహాకవి ఆ జాతి యొక్క ఆలంకారిక చిత్తవృత్తిని బయటకు తెచ్చెను.

<u>రమ్యతాశబ్దమును మహాకవి వాడిన చోట్లివి.</u>

మ. అమలాచార పవిత్ర భూసురవరేణ్యాగార పుణ్యప్రదే
శములం దధ్యయ నారవంబు విధివత్స్వాహాస్వధాస్వస్తి శ
బ్దములున్ మంగళతూర్యఘోషములునుద్యత్కౌతుకాశీర్వినా
దములున్ <u>రమ్యతరంబులయ్యె</u>ధరణిం దద్రాజ్యసంవృద్ధితోన్.

(ఆది. 5–4 ప.)

మాలిని. ''సరస సుర వధూ లాస్యంబులున్ సిద్ధ విద్యా
ధర పటుపటహాతోద్యంబులుం గిన్నరీ కిం
పురుష లలిత గీతంబుల్ <u>మహారమ్యమయ్యెన్</u>
వరముని దివిజాశీర్వాద నాదంబుతోడన్.

(ఆది. 5–127 ప)

ఛ. అరుదగు తత్పయోద సమయంబున నొక్కట విస్తరిల్లె నం
బరమున నంబుద ధ్వనియు బర్హుల భూముల భూరిదర్దురో
త్కరరవముల్, మహీరుహ శిఖండములందు శిఖండితాండవాం
తర మదమంజులస్వనము దానతిరమ్యమునై వనంబునన్.

(ఆరణ్య. 4–137)

ఇచ్చటి రమ్యతా నిష్పాదకమేది? అక్షరమా? సమాన వాక్య నిర్మాణతచే నేర్పడిన పద్యమందలి సమతా గుణమా? ఇది భిన్న వాక్యముల కూర్పుచే సిద్ధించునట్టిది. అనగా నాల్గుపాదాలలో సమాన స్థానములందు వాక్యములు విఱుగుటచే సమత పుట్టును. ఆది. 5–4. పద్యమున మొదటి పాదము ద్వితీయపాద ప్రథమ గణము వరకు — మొదటి వాక్యము రెండవ పాదమున 'అధ్యయనారవంబు' — ఒకటి, రెండవది మూడవ పాదాది ప్రథమ గణమువరకు — 3 వ వాక్యము మూడవ పాదమున సగము— అటనుండి నాల్గవ వాక్యము 4 వ పాద ప్రథమ గణము వరకు— సాగినది. ఈ కూర్పునందు సమత్వమున్నది. ఇట్లు వ్రాసి వెంటనే కవి 'రమ్యతరంబు' అన్నాడు. కథాపరముగా నచటి తత్తద్వ్యాపారములు. కావ్యపరిత్పపరముగా ఆ విషయములను వర్ణించు వాక్యఖండముల కూర్పు. దానిచే సిద్ధించిన సమత. ఇది అక్షరములను సమముగా గ్రహించిన భిన్నవాక్యముల కూర్పు. కావున రమ్యము.

ఆది. 5–127 ఇది మాలిని. యతి గణముపైన మూడు పాదములును విరుగుచున్నవి. సమానముగ వాక్యముల కూర్పున్నది. ఇందుచే వాక్యముల బరువంతయు యతిస్థాన గణముపైపడి పద్యమొక తూగు తూగుచున్నది. లా, స్యంబులున్; ఆతో, ద్యంబులున్; గీతంబుల్— ఇందు పూర్వ పద్యము కంటె నదనపు గుణము యతి గణముపై తూగు. ఇందుకని వెంటనే మహారమ్యమన్నాడు. పై పద్యమున సమాన వాక్య నిర్మాణము. ఇందు దానితో పాటిదియు; అగుట ఛందోగమనము లయాత్మకమైనది. ఆవృత్త స్వభావమునే వ్యాఖ్యానించినాడు కవి. కావున నిందు ఛందస్సౌభాగ్యమును బట్టి వాక్యనిర్మాణము కూర్చి భిన్నచ్ఛంద స్వభావము నిట్లిట్లు చూడవలెనను చున్నాడు.

ఆర. 4–137 ఇందు— అం, **బరమున—అంబుదధ్వనియు;** రో, త్కరరవముల్; తాండవాం, తర మద మంజుల స్వనము. 3 పాదములయందు మూడు వాక్యములు సమానముగా తెగని **కారణ**మున నిందు వాక్య సమత లేదు. మఱి పద్యమునందు విషమత ననుభవించుచున్నామా? లేదు. దీని నెట్లు సంబాళించెను? 'అతి రమ్యత' యెట్లు ?

1) అంబర–అంబుద 2) పల్వల–భూముల భూరి 3) దర్పు

రోత్కర రవముల్ 4) శిఖాంత–శిఖండి 5) తాండ

ఐదు విధాల అక్షర సంపుటి కూర్పు. ఇందు విచిత్ర లక్షణ మేమనగా 2–లోని 'ర' 3లోని 'ర'తో స్పర్ధ పడుచున్నది. 4లోని 'ండి' 5లో 'ండ'తో. ఇట్లు 2, 3, 4 పూర్వాపర సమన్వయమునందుచు 'నతి రమ్యము'లై తోచును.

పై పద్యములందుసు —

1) ఆచార–భూసుర వరేణ్యాగార పుణ్యప్ర

2) స్వాహా, స్వధా స్వస్తి శబ్దముల్

3) ధరణిన్ దద్రాజ్య

5–127 - 1) సరసనుర వధూలాస్యంబులు

2) హృద్య విద్యాధర — కిన్నరీ

3) పటు పటహ

4) కిన్నరీ కింపురుష

ఇందు ప్రాస'ర'. అది పద్యమందంతట నూదినిలిచి ప్రథమతఃపుట్టిన రేఫధ్వనిని పలుమార్లు నొక్కుటచే పద్యమందంతయు రేఫధ్వనియే. ఈ ధ్వనియే హృదయాకర్షకము. దీనిచే కేవల నాదావిర్భూతి. ఇది బిందుపూర్వకాక్షర పునరావృత్తిచే మిక్కిలి స్పష్టపడును.

కం. గంగాధర పింగ జటా
సంగమ మంగళ విశాల చటుల తరంగన్
గంగానది సేవించెను

గంగాద్వారమున విగత కల్మషు డగుచున్. (ఆ. 8–126) ప్రాసస్థానాక్షరమే పద్యమున నూని నిల్చినది. బిందు సాహచర్యముచే నక్షరము నాదమునందు లీనమగుచున్నది. అక్షరావృత్తి నాద మగు చున్నది. అది ప్రథమ శ్రవణమున జనించి పిదప పలుమార్లు చెవిని తాడించుచున్నది. ఇవి లయాత్మక నాదము. ఛందస్తరంగమును **(Musical Sounds)** సృష్టించుచున్నది. నాదస్వరూపుని స్తుతి యిట వర్ణితాంశము. ఈ నాదము అవ్యక్తనాద సదృశము. రసము బ్రహ్మానంద సహోదర మన్నట్లు.

క్వణదణు కింకిణీ కలిత కాంచన కాంచీ కలాపమున్ రణ
న్మణి కల నూపురంబులు–సుభద్ర తదద్రి (ఆది. 8–178)

1) క – 7 సార్లు 2) ణ – 5 సార్లు 3) కాంచ – కాంచి 4) తిరిగి 'ణ' పాదాంతమందు, వచ్చి రెండవ ప్రాసలో–ణ–ధ్వనికి నూనిక చిక్కి 'ను' (న) నాదముతో తేలిపోవుచున్నది. 5) ద్రది

క్వ – ణ – ద – ణు సమీపస్థాన జన్యాక్షర సంపుటి. దణ – వ సమీపస్థములు. దీనిచే నాద మాధుర్య ముద్భవించుచున్నది.

కేవల 'క' కారమున భిన్న ధ్వనులు పుట్టుచున్నవి.

క్వ – కింకి – కలిత | కాంచ – కాంచి | కలాప – కలనూపు – |
(1) (2) (3)

ఏకాక్షరము భిన్నోచ్చారణమున బడి మూడవచోట 'రణన్మణి'–చే నెడ పెట్టబడి 1, 2 వల్ల కలిగిన (ఒక వేళ కల్గినచో) జుగుప్సను పోగొట్టి మఱల 'కలనూపు'–అని 'కల'మీద బరువూనుచున్నది.

ఇంతకు కవి గ్రహించినది రెండక్షరములు – దానిపై నిన్ని భేదాలు– ఉచ్చారణ ననుసరించి లెచ్చుట– కేవల పంచీకరణ విద్యగా నున్నది.

ఇట్లు క–ణ నుండి భిన్న నాదోత్పత్తి యగుచు నా రెండు నాదములు ఒకదానినొకటి స్పర్ధతో సమతనుసృష్టించుచున్నవి. దీనినే కవి 'సమధ్వని నొప్పగ' అన్నాడు, సమాన ధ్వని యనగా నాద సమత. అక్షర రమ్యత. అక్షరముల సమత యనగా క–కంఠ్యము. ణ–ల లు సమీప స్థాన జన్యములు. నాల్క చివుళ్లపై తగులుటచే నేర్పడు చున్నది. కంఠ్య 'క' కార–ణ–ల కారములు సుదూర స్థాన జన్యములు. అందుకని మహాకవి క్వ– ప్రథమాక్షరముగా గ్రహించుటచే–వ– దంతోష్ఠ్యముచే సుదూర క – ణ లకు సన్నిహితమై అట్లే కింకిణి, కాంచి– ఇందు బిందుపూర్వకమగుటచే ణ–కు సన్నిహితమై– అదూరవర్తి అక్షర సంపుటి కూర్పు కేవల నాదముగా మారునది అక్షర రమ్యత. దీనికి సమధ్వని హేతువట. సమధ్వని = నాద సమత. అదూరవర్తిజన్యాక్షర సంపుటి.

ఇక్కడొక అంశమున్నది. సుదూరవర్తి స్థాన జన్యాక్షరసంపుటి శ్రవణ బాధాభార హేతువన్నమాట. అదూరవర్తిత శ్రవణ సుఖా సత్తికమైనచో సుదూరవర్తిత యంతేకదా! అనగా సమాన స్థాన, సమీపస్థాన జన్యాక్షర సంపుటీకరణమే అక్షర రమ్యత. వ్యతిరేకము కాదు– అనగా రౌద్రాది రసావిర్భావక అక్షర సంపుటి సుదూర స్థాన జన్యాక్షరముల కూర్పు. శృంగారాది మధుర రసములకు సమానస్థాన జన్యత. అనగా మధుర– ఉద్ధత రసముల కనుగుణముగా అక్షరముల కూర్పు అక్షర రమ్యత. ఇది రస విషయమున వేరే చూడదగినది.

ఆయనలో నీ సమధ్వని యెంతచిత్రముగా నుండెననగా–

అలఘు తరంబులై తుహినహారిసుధారుచి నిందురోచిరా
కుల శశికాంతవేది పృథుకుంజగళజ్ఝల నిర రంబులన్
విలసిత జాహ్నవీ విమల వీచి విలోల లసత్పతాకలం
బొలుపగుఁడత్పురీభవనముల్ హిమశైలముబోలియున్నతిన్– 8–72

(గ) విలసిత జాహ్నవీ విమల వీచి విలోల లసత్పతాకలన్ (8–72)

వి = 5; ల = 6. చివరి 'ల'కారమును బహువచన రూపముగా గ్రహించినచో = 5 'వి'లు 5 'ల'లు కలసి బహువచన మగుచున్నది. లేదా 'పతాక'లోని 'ప' – 'వ'లతో కలసి ఆరగుచుండుటచే 6 వ లు – 6 ల–లు. (వ–ప లు సమాన స్థానజములే.)

I దీని విభిన్నత – (1) వి–వీ ల నడుమ ఐదు భిన్నాక్షరాలు.
(2) వీ–వి వెన్వెంటనే వచ్చుట
(3) విమల – వీచి – రెండు వీ–లకు నడుమ– మల – రెండక్షరాలు.
(4) వీచి – విలోల - నడుమ నొక యక్షరము.

ఇట్లున్నది. ఎడపెట్టు నక్షరాలు భిన్న సంఖ్యలో నుండుటచే; (విలసిత జాహ్న, మల, చి) భిన్నతచే ఏకాక్షరమైన 'వి' పంచవారములావృత్తమైనను – జుగుప్స కలుగక వినూత్న చిత్ర మగుచున్నది.

II (1) ఇట్లే 'ల'. మొదటి 'ల' కు రెండవ 'ల' కు నడుమ 7 అక్షరాలు.
(2) రెండు, మూడు ల–లకు నడుమ 3 అక్షరాలు.
3) 3, 4, 5 ల లకు నడువు వ్యవధానము లేకుండుటచేతను భిన్నత సిద్ధించుచున్నది. అట్లే నెడపెట్టు నక్షరములును భిన్నములే.

సిత జాహ్నవీ విమ – వీ చి వి – ఇట్లు.

పై రెంటిలో 1–1 సమానము. I, 2 – II 3 సమానము. దీనిచేతను గ్రామ్యతపోవుచున్నది. (భామహ గ్రామ్యత యిట్లుపరాస్తము. ఈ ఎడపెట్టు అక్షరాలచే, వాని వ్యవధానముచే విశ్రాంతి చిక్కి గ్రామ్యత పరాస్తమగుచున్నదని యర్థము)

ఇదే పద్యమున మొదటి పాదమున –

హారి సుధారుచి నిందురోచిరాకుల –

ర కారము నాల్గుసార్లొని నిల్చినది. దీని గ్రామ్యత వాక్యమును రెండు దళాలుగ ఖండించుటచే విశ్రాంతి చిక్కినది. గ్రామ్యత లేదు. ఇదొక పద్ధతి

మూడవది – 'పృథుకుంజ గళజ్ఝల నిర రంబులన్'

ంజ, జ్ఝ, ర్ఝ – ఏక జకార త్రిరావృత్తి త్రిభంగిమలందు చెక్కబడినది.

నాల్గవది – నిర్ఝరంబు – లో 'ర్ఝ' పూర్వజకారముతో నొకటి పర 'ర' కారముతో నొకటి సమన్వయించి ర, ఝల స్పర్ధ చిత్రముగా నున్నది.

ఇట్లే 'గళజ్ఝల నిర్ఝ'– సమాసమున గళత్ జలనిర్ఝర – ఇట్లు ప్రవాహగతిని అలల దూకుటలను ధ్వనించుచున్నది. (చూ. పూర్వోదాహృత Abercrombic వాక్యము) ఇందుచే నిది శైలి కాని అనుప్రాస–శబ్దాలంకారము–కాదు.

1) ప్రవాహగతి యన్న యర్థమును ధ్వనించుట.

2) పై రీతి వ–ల ల కూర్పువైచిత్రిచేత నిది శబ్దాలంకార విషయము కాదు. ఆలంకారిక రచనా విశేషమై శైలీ విషయ మగుచున్నది.

ఇంతేగాక ఏ అక్షరాల ఆవృత్తియున్నదో యవి –

1) వి–ల లు సన్నిహితస్థాన జన్యము లగుట.

2) ర–ఏకస్థాన జన్యాక్షర మగుట.

3) ళ–ల లు సట్లే యగుటచే నాదలయావృత్తి సిద్ధించుచున్నది.

ఇంతవిషయము శబ్దాలంకారమందుండునా ?

ప్ర య త్న దృ ష్టి

ఇది కవి ప్రయత్న సాధ్యము. బుద్ధి పూర్వకముగ చేసినది. ఐనచో కృత్రిమత్వము రావలెను. కాని రాలేదు. అనగా నప్రయత్న సిద్ధమనవలెను. ఇదెట్లు పొసగును. కవియందు మనస్సు–హృదయములకు చక్కని పొంతన యుండును. మనస్సునకు సంబంధించినది ప్రయత్నము. హృదయమునకు సంబంధించినది అప్రయత్నము. మానసికమైన ఆలోచనను హృదయమునందు లీనమొనర్చినచో రచన యట నుండి బయల్వెడలును. దీనికి మనస్సు వ్యక్తిగతమైనది అడ్డురాదు. అక్షరరమ్యత హార్దికము. ఇందుచేనిది అపృథగ్యత్నసిద్ధమై అందమైనదగుచున్నది. అనగా నా మహాత్ముని చిత్తవృత్తియందే యక్షర రమ్యత యున్నదనవలెను. పద్యరచనవేళ కవిమనస్సునకు సంబంధించిన దిది. దానినిగూర్చి పై రీతిగా నూహించవలెనేగాని మరొకమార్గము లేదు.

కవిప్రయత్న దృష్టి చూడుడు :–

ఆరణ్యా. 2 ఆ. 95 ప. – 'ఊర్జిత శౌర్యు నర్జునిన్'

302ప. – 'అశేష విశేష'

228ప. – 'పుష్కరునివిడిచిపుచ్చి పుష్కలంబై స'

(ఇది వచనము. ఇందును పద్యమందువలెనే కూర్పున్నది)

ఆది. 5 ఆ. 78 ప. – 'ప్రతీచ్యుల నుదీచ్యులఁ బ్రాచ్యుల'

6 ఆ. 299ప. – 'విశాల విలల్'

సభా. 1 ఆ. 7 ప. – 'సభమణిప్రభ'

ఆది. 4 ఆ. 240ప. – 'హరినీల వినీల'

ఈ కూర్పెంత అప్రయత్న సిద్ధమనగా –

ఆది. 4. ఆ. 25 ప. – 'తనర్చి తలిర్చిన'

ఇది 7 అక్షరాల కూర్పు. ఇందెన్నిజంటలున్నవి ?

I 1) త–త 2) న–న 3) ర్చి–ర్చి–సమానాక్షరావృత్తి.

II త–న – ఏకవర్గాక్షర సంపుటి.

III న–ల – సమీపస్థాన జన్యాక్షర సంపుటి.

ఇది ప్రయత్నసాధ్యమనుటయెట్లు ? అనకుండుటెట్లు ?

ఏకాక్షరావృత్తియే రమ్యతయాః ఐనచో నదియున్న చోట్లెల్ల సుందరములు కావలయునుగదా ? కాని కొన్నిచోట్ల నుండదు.

ఆరణ్య. 2 ఆ. 3 ప. – మాయట్లిడుమలబడిన నరులు గలరె యొరులు ?

2 ఆ. 90 ప. – కిరాతుడు కామనిశాతశరాహతుడు

ఆది. 4 ఆ. 47 ప. – శకుంత తతులు.

(ఇట్టివానిని కుంతకు డంగీకరించెను. కాని యిందు రమ్యత లేదు. కారణము – 'శకుంత – తతి' మూడు స్థాల్లోకేచోట నొకే యక్షరము వచ్చుటయా ? కావచ్చు. కాక యిది శబ్దగతము కాని కూర్పునకు సంబంధించినది కాదు. కూర్పు శిల్పము.)

4 ఆ. 135 ప. – వశంబున నుండెఁ గరంబు –

ఆరణ్య. 2 ఆ. 329 ప. – క్రూర లశనంబుగ నుగ్రవనంబులో

(మొదటి దానిలో నేకాక్షరము. రెండవ దానిలో రెండు. రెండుచోట్ల నడుమ నైదక్షరాలే. దండి యన్నట్లు అదూర వర్తితచే రమ్యత లేదందుమా ? యన్నచో అట్టి లక్షణమితర పద్యములందుండియు రమ్యత పుట్టుచున్నదే ! ఎట్లు ?)

అరణ్య. 2 ఆ. 344 ప. – కంఠము దాక నకుంఠ వీర్యుఁడై –

(ఇచట నున్నవి – ంఠ – నొక్కి వినిపించుచున్నది గదా ! నడుమ నాల్గక్షరము లున్నను రమ్యత పోవుట లేదు. కఠినాక్షర మనుటచేత నిది వినిపించుచున్నదనవలెనా ? కాదు –)

కవిహృదయ పూర్వకముగ వచ్చినచోట్ల రమ్యత, రాని చోట్ల లేదు. మఱి యెట్లు వచ్చినది ధారః అనగా నలవాటు (Accidental). ఇట్టిచోట్ల నుండదు. అట హృదయము లేదు కావున. ఇందుచే నిది హృదయ సంబంధ శైలీ విషయము కాని మనస్సంబంధ అలంకార విషయము కాదు. అది అక్షరావృత్తి యున్నచో చాలు. దాని వెనుక హృదయ మక్కరలేదు.

1. ఏకాక్షరావృత్తి

ఆది. 2 ఆ. 234 - 'రయోద్ధతి నుద్ధూత వివర్తితాయత బృహద్ధ్వాన్తి'

(1) ఇందు ద్ధ–త జంటగా నున్నప్పటికిని ద్ధ–ఊనికచే మొదట చివర నుండుటచే త తేలిపోయినది. ర్తి ద్ధ కు పోషక మగుచున్నది. ఇందు యత్యక్షరము 'ద్ధ' యగుట దానికే ఊనిక.

(2) కొన్నిచోట్ల ఏకస్థాన జన్యాక్షరము యతి స్థానమునకు నడుమ వచ్చి యత్యక్షరమును నొక్కును.

ఆది. 3 - 112 వాడి మయూఖములఁ గలుగువాడ –

'వ - మలు ఓష్ఠ్యములు.

ఆది. 4 – 54 భామిని నాకు భార్యవగు భాసురలీల

8 - 171 భ్రాజిత శాతకుంభ గృహపంక్తులు ప–భ

సభా. 1 – 260 సహ, దేవునకు హయద్విపేంద్ర దివ్యాంబర - యతి ఊనిక.

ఫల పవనాంబు భోజన శుభవ్రత వృత్తుల అపారతపోబలసంపద బలయుతు లట్టి వారలకు భవ్యులకు (ఆది 6 184)

అన్నియు నోష్ఠ్యములే. యతులకు నడుమ వచ్చి యతిస్థానమును నొక్కుచున్నవి.

2. ద్వ్యక్షరావృత్తి

ఆది. 6-234 సారసార । వరుచిరావగా । నీరసర: । పులినంబు

సభా 1-7 ఇమ్మనుజేంద్రు డింద్ర దనుజేంద్రులకంటె

2-111 స్యంది సుగంధి దానజల సంపద —

— యతి తెలిపోయి ప్రాపాక్షరమూది నిల్చుచున్నది.

అర. 2-124 బంధుర సుందర కందరమగు మహేంద్ర —

— బిందు పూర్వక ద్వ్యక్షరావృత్తి.

1-346 లలిత నిలింప దంపతి విలాసవిహార మహోత్సవంబులన్

— కందర సుందర మందరాచలా

— బిందు పూర్వక ద్వ్యక్షరావృత్తి.

3. త్ర్యక్షరావృత్తి

ఆది. 4-42. కౌశికు, గౌశిక —

4. బహ్వక్షరావృత్తి

ఆది, 3-144 జలధి విలోల వీచి విలసత్ కలకాంచి సమేంటి తోపసి
తలవహన క్షమం బయిన దక్షిణ — ఉన్నమ
ద్గళదురు ఘర్మవారికణ క్రమకరాబ్జము వట్టి —
విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్ ॥

ఇందు 1) ల 2) వి 3) జ—ధ లు 4) ంచి 5) క్ష (6) తదన — దదు 7) ర 8) క 9) త (చివరిపాదం)

3-6 సమీపస్థాన జన్యాక్షరములు. 6—ఏకవర్గ్యం. మిగిలినవి ఏకాక్షరములు. ఇట్లు మూడుపద్ధతులుగా నుండుటచే గృహీత ముక్త రీతి యేర్పడి కృతకత్యమును పరాస్తము చేయుచున్నది.

జలధి—మూడును సమీపస్థాన జన్యములే. జ — తాలవ్యము; ధి—దంతోష్ఠ్యము; ల—జ క్రిందస్థానమున పుట్టుచున్నది. 'ధ' — పైదానికించుక క్రింద. పద్యము చిత్రముగనున్నది. ఎవడో మహా చిత్రకారుడు రంగులతో తమాషా చేసినట్లున్నది. రెంటను వర్ణమే కదా! త్రిగుణములు పంచభూతములచే నెంత వైవిధ్యమును సృష్టించు బ్రహ్మయట్లు కవియు నక్షరములచే నింత వైవిధ్యమును కల్పించుచున్నాడు.

అరణ్య. 4-137 అంబరమున నంబుద ధ్వనియు పల్వలతీరములం
భూరిదర్దురోత్కర రవముల్, శిఖాంతములందు
శిఖండి తాండవాంతర మదమంజుల స్వనము —

1) అంబర—అంబుద 2) వ—భూ—భూ 3) ర—ర్దు—రో—ర—ర 4) శిఖ—శిఖండి 5) ఖండి—తాండ 6) ంత—మ—మ

1) గ్రహించి విడిచెను. 2) వవర్గు గ్రహించి విడిచి 3. చివరి భూ—మీది 'ర' గ్రహించి మూడవదళము పెంచి 4) తర్వాత 'శిఖ' గ్రహించి విడిచి 5) దానిమీది 'ఖండి' లోని 'ండి' కి తాండవ—మందలి ండ—ఘటించి తుదకు ంత—రాగా దానికి మ — సంధించెను, ఇదేమి విద్య! విచిత్రమే కాక కూర్పులో చిక్కదనముతోబాటు విసుగు లేకుండ చేయుచున్నాడు.

అరణ్య. 4-138 దళిత నవీన కందళ కదంబ కదంబక కేతకీ —

1) ద, ళ, న' ంద, దం, దం, త 2) ళ—ళ 3) దంబ—దంబ 4) క—క—క—కే—కీ, వైచిత్రి ఏమనగా పూర్వ సకారమునకు కందళలోని ంద—యతి యగుచున్నది. (అనగా న—ంద—సమానాదము కలవనుట) కందళ—లో బిందువు క—పరకము కాగా తర్వాత ద—పరకము చేసినాడు. ఇది ప్రయత్నసిద్ధ మందమా? అప్రయత్నధార యందమా?

ఆరణ్య. 4-142. శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారకహార
పంక్తులం—గంధబంధురో దార సమీర సౌర
భము—కర్పూర పాండురుచి పూరములంబరి
పూరితంబులై.

పద్యమందెల్లెడ ప్రాసకే ఊనిక. రకారమిన్నిసార్లు వచ్చినను జుగుప్స లేకపోవుటకు కారణము ప్రతి పదాంతమందూనిక చిక్కుట. ఇందుచేనిది ఉద్భటానుప్రాస తప్ప భామహ గ్రామ్యానుప్రాసకాదు.

ఇందు 1) య—ల—ల 2) త్త—తా 3) ర—ర—ర 4) గంధ—ంధ 5) రో—ర—ర—ర— ర్పూ—ర—రా—రు—ర—రి—రి 6) ంబ—ంబు 7) స—సౌ 8) ర్పూర—పరా—రప—ల విని యమము, ఎనిమిది అక్షరగుళుచ్ఛములుండి శారదరాత్రులందలి పక్ష త్రాణకళ మెఱయుచున్నది.

అర. 4-84. కృపీటంకు ॥ శంకరు ॥ శశిఖండమండిత
శిఖండు ॥ శివున్

1) క్ష—శ—శ—శి—శి—శి 2) ంక 3) ండ
4) ఖంఖం

పాదముకొకటి రాళ్ళ విశ్రాంతులు చిక్కి చక్కని దశాలేర్పడుచున్నవి. వాళ్ళిటికి నాల్గక్షరాలు పరస్పరము పోషించుకొనుచు మొత్తముమీద స్ఫురించుచున్నవి.

విచిత్ర సంవిధానకము

కొన్నిచోట్ల పైదానికి వ్యతిరేకముగ నక్షర వినియమముచే — విపరీతతచే — రచన చమత్కారముగ నున్నది. ఆది 4 — 44 —

తరళ । తిపలీయుత । రోమరాజి

ఇందు తర – మొదటి సంపుటి. ౹త్రి – రెండవ సంపుటిగా నేకాక్షరమై నిలిచినది. నడుచుచు నడుచుచు ప్రవాహము గిఱుక్కున వెన్కకు మళ్లి సుడులు తిరిగినట్లున్నది రచన. ఇందు త్రివళులు–త్రిపదబంధములు.

1) తర – త్రి 2) ళ–ళీ 3) త–త 4) రో–రా

ఇది ద్వితీయ దళము. కావున దానిలో చేర్చుటకు వీలులేదు. ఏమి చమత్కారమైన రచన !

2 – 144 – విశ్రుత కీర్తి – శ్రుత–ర్తి

4 – 110 – భరతు డశేష భూభువన భార

ధురంధరుఁడై వసుంధరం –

1) రంధ 2) ధరం

ఈ విపరీత సంవిధానకమును గూర్చి యే యాలంకారికుడు నన్నట్లు లేదు. అహో ! మహాకవి ప్రతిభ ! ఆ సరస్వతికి నమస్కారము.

వాక్య (పద) ఆది–అంత–ఆవృత్తి

కొన్ని చోట్ల పద వాక్యాంతములం దేకాక్షరము నిల్చుట యెట్లో యట్లే పదాదియందు నట్టె యక్షరమే నిల్చుట దర్శనీయము.

ఆది. 4–13 మృగముం నేసియు – డాసిన మృగముల ప్రేసియు

పదాంతావృత్తిచే వేటాడుటలోని దుష్యంతుని పరాక్రమము ధ్వనింపజేయు చున్నది. ప్రేసియు–నేసియు దూరపాతితములగుటచే ప్రాసస్థానము జంటను కల్పుచు అదూర పాతితను సిద్ధింపజేయు చున్నది.

తేజిత బాణహస్తు దృఢదీర్ఘమలీమస కృష్ణదేహుఁ గృ
ష్ణాజిన వస్త్రు–సస్త్ర విషయాప్త విషాదు నిషాదుఁజూచి
ఆది 5.235.

విపరీత ప్రతిభాషలేమిటికి నుర్వీనాథ ! యీ పుత్రగా
త్ర పరిష్వంగ సుఖంబుసేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్ర పరాగప్రసరంబు చందనముఁ జంద్రజ్యోత్స్నయుంబుత్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబె కడున్ శీతమే. 4–9ఆది.

(1) *ఆది 5-235 హస్తు–వస్త్రు–ఒక గుత్తి. మఱల 'వస్త్రు'తో 'సస్త్ర' లగించి దీనిని పెంచి ఆప్త విషాదు–నిషాదు ఇట్లు వాక్యముల నెడత్రెంచును.

(2) *ఆది 4–91 విపరీత ప్రతిభాష–త్ర పరిష్వంగ–ంద్రపరా–త్ర పరిష్వంగ ఇవి ప్రాస స్థానములు. వాక్య పాద ఆదిమ గణములు. దీనిచే పద్య గమనమున కొక సొగసు వచ్చుచున్నది పై వాక్యములం దద్దముగా చూచితిమి గదా ! అట్లుకాక పద్యము నిల్పుగా చూడదగినది. త్ర–ంద్ర–త్ర–ఇట్టి పదాదిమపు విఱుపులు నన్నయగారివి కావు. తిక్కన గారివి. కాని యిట శకుంతల మనో నైస్య వ్యంజకములుగా కవి ఘటించియు తన సహజ రమ్యతను గోల్పోడు.

ధ్వజినీపాతభరంబునం దలరఁగా ధాత్రీ ధరాహీంద్ర మూ
ర్ధజరత్న ప్రకరంబులున్నత గజేంద్ర స్యందనప్రోల్లస
ద్ధ్వజ వాతాహతిఁదూలఁగా జలదబృందంబీక్రియన్ సర్వ ది
గ్విజయార్థంబరిగెం గురుప్రభుఁడు దోర్వీర్య ప్రకాశార్థియై
ఆది. 5–36

ఆది. 5–4 అమల–శములం–శ, బ్దములున్, నా, దములున్–పై రీతి రచన. పద్యాంతమున కవి 'రమ్య తరంబు లయ్యె' నన్నాడు. మనకిది సూచన. రచనలో రమ్యత యున్నదని.

(చూ. 7వ పుట)

5–36 ధ్వజినీ–మూ; ర్ధజ – లస; ద్ధ్వజ–ది, గ్విజ

పైదానివలె కాక యిందు ప్రథమాక్షర యుగళము స్పర్ధపడు చున్నది. పైన 2, 3 అక్షరాల సమత.

ఆశ్వాస – కథాంతావృత్తి

ఇదే విషయము (పదాంతావృత్తి) కథాంతమునకో ఆశ్వాసాంతమునకో యన్వయించవచ్చునుగదా! పదాంతావృత్తిచే పద్యమెట్లు కాంతు లెగజిమ్మునో యట్లే కథాంతాదుల చేయవచ్చును. దీనికి పీఠికగా నిదిచూడవచ్చు–

ఈ మునిపల్లె నుండుటిది యేమి? కరంబనురాగ మొప్పఁగా
భామిని నాకు భార్యవయి భాసుర లీల నశేష రాజ్య ల
క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందుమనిందితేందు పా
దామల తుంగ హర్మ్యముల హారి హిరణ్మయ కుట్టిమంబులన్
(ఆది 4–54)

ఇందు భా–యన్న యక్షర మూనిక కలది. రెండవదాని నుండి మొదటి భా–నాదము పైకి విడిచి మూడవదాని కడకు వచ్చుట ఆరోహణ మార్గమున. అట్లే 'అందు మనిందుతేందు–హర్మ్యముల హారి హిరణ్మయ' – ఈ మూడు బంధములందును ఆరోహణ క్రమమున్నది. పద్యము అక్షరాల – తద్బంధాల మెట్లనుండి పైకెక్కు చున్నది. అనగా నాయకుడు నాయికను మునిపల్లెనుండి అంతఃపురాల సౌధాగ్రభాగాలకు క్రమక్రమముగా పైకి తెచ్చుచున్నాడు. కావున అక్షర

రమ్యత కేవలశబ్దాలంకారము కాదు. అర్థముతో స్పర్థ వహించు చున్నది. రెండును—శబ్దార్థములు—పోటీ పడుచున్నవి. ఇది తర్వాత. కావున పద్యగతముగా నారోహణ యున్నట్లే కథాగతముగాకూడ నుండవచ్చునుగదా !

రాజ రాజ గుణరాజిత
రాజత్తేజ రాజకులదీప విశిష్టాం
భోజమిత్ర నృపపూజిత పాదాం
భోజ భూవినుత పుణ్యవరేణ్యా ! (7-290)
రాజ భూషణ=నిత్య సత్యా—
—విష్ణు సన్నిభ విష్ణువర్ధన భూపతీ ! (8-324)
సాగరులకు సద్గతిగా
సాగరమును దివిరి సలిల సంపూర్ణముగా
భూగతయై భాగీరథి
భాగీరథ కీర్తి భువన పంక్తుల నించెన్.
(అరణ్య3-84)

మొదటి రెండు నాశ్వాసాంత సంబుద్ధులు (5, 6, 7, 8, సభా, ఆశ్వాసాలు, ఆరణ్య 1, ఆశ్వాసాంతము లన్నీ జ—కార ప్రాసములు—తద్బహుళములే. ఆది పర్వములో 1, 2 3, 4 – ఆరణ్య. 2, 3 మాత్రము కావు.)

ఆశ్వాసాంతములు – పై రీతిగా పుణ్యవరేణ్యా ! భూపతీ ! యిట్లంత మగుట మహాకవిగా మహారాజుపై నున్న ఆర్ద్ర భావము నెంత వ్యంజించుచున్నదో! మూడవది – భగీరథ కథాంతము. ఆ కథా సౌందర్యమంతటిని నా చివరి వాక్యము – అక్షర రమ్యతా పూర్వకము—ఆకర్షించి పాఠకుని మనస్సులో తత్కథా పావిత్ర్యము నారబోయు చున్నది.

ఇట్లక్షర రమ్యత భావముఖ మగుట శైలి కాని శబ్దాలం కారము కాదు. దీనిని ప్రత్యేకముగా నిరూపించుకోవచ్చు.

భావ ముఖీనత

దీనికి ముందు ప్రాచీనాలంకారిక లక్షణములు పూర్వము చూచిన వానిని కొన్నిచోట్ల నన్వయించి చూచుకోవచ్చు.

ఆది 4-25 I సం, కుటిమిళితాళినీల—పరికుంచిత కోమలకుంతలన్, శకుంతలన్ 7-20 II కుల పవిత్ర సితేతరోత్పల కోమలామల వర్ణ—యుత్పల సుగంధి లసన్మహోత్పల పత్రనేత్ర యరాల కుంతల విభాసిని—

సభా 1-110 సాగర సార వారిరుహ—శౌక్తిక మౌక్తిక—విద్రు మద్రుమమై లాగురు=సింహళ కేరళ చోళ—

మొదటి రెండును శకుంతలా ద్రౌపదుల వర్ణన. ప్రాసాక్షర మైన —ల—సౌకుమార్యమే—వాక్యాంతము దనుక ఊని నిల్చి పద్య రచన సంతటిని సుకుమారముగచేసి ఆస్వాద్యమాన మగునట్లు చేయుచున్నది. ఇది ఉద్భటుని ఉపనాగరిక.

మూడవది కుంతకుని గృహీతముక్తరీతి కుదాహృతి. పైన విడిచినట్లు నాల్గుదళాలుగా భిన్నాక్షర సంపుటిచే పద్యమేర్పడి రచన రమ్యతరముగ చేయుచున్నది. ఇట్లును చూచుకోవచ్చు.

ఈ రచన వృత్తివిశేషమని దండి—ఉద్భట—కుంతకులు నిరూపించిరి. ఇది కేవల శబ్దాలంకారమైన యనుప్రాసవిషయము కాదు. దీనిని భావముఖనుగా చూడవలెను.

ఆది 4-72 మఱచిన—ఎఱుగని—ఎఱుగింప—మఱియెఱిగి యెఱుగ నొల్లని కఱటిన్

అర.2=135 అఱపొఱడు కుఱుచ చేతులు—నొఱవ శరీరంబు గిలిగి యొరులకు జూడం గొఱకాకుండియు—

(1 ఈ—ఱ—పరుషాక్షరము. దీని ప్రాచుర్యము ప్రస్తుత విషయముయొక్క అసాంగత్యమును వ్యంజించుచున్నది. అనగా మఱచిన వాడు దుష్యంతుడు. దానిని తెలుపుటకు బ్రహ్మకు శక్యము కాదు. దీని నది వ్యంజించుచున్నది.

2) రెండవ చోట వికృతాకృతి నపుడు. విరహావేదన ననుభ వించుట చూచి ప్రక్కనున్నవాడు పొందిన ఆశ్చర్యము. 'ఏడేమి? విరహావేదన'? ఈ అసంగతికది వ్యంజకము.

ఆది. 5=36 ధ్వజినీ పాత భరంబునం దలరగా ధరా హీంద్రమూ ర్ధజరత్నప్రకరంబు లున్నతగజేంద్రస్యందన ప్రోల్ల సద్ధ్వజ—సర్వదిగ్విజయార్థంబరిగెన్—

ఇది పాండురాజ జైత్రయాత్రావర్ణన నెంత వ్యంజించు చున్నది! మొదటి రెండక్షరాల బరువు ప్రతి పాదాగ్రమున బడుట ఆహీంద్ర మూర్ధమున బడినట్లున్నది కదా!

4-110 భరతు డశేష భూభువన భార—ఆయనెంత భార మును మోయుచున్నాడో అక్షరమే ధ్వనించుచున్నది. అసగా నుచ్చా రణలోని బరువు.

7-60 సురగరుడ విషోరగ యక్షరాక్షస—ఈమాట అంగార పర్ణుడు గాండీవితో బ్రాహ్మణ మాహాత్మ్యము చెప్పుటకన్న మాట. ఏరును విప్రులమాట దాటరుగదా యనుమ నన్న వాక్యము.

సుర, గరుడ, విషో—రగ - రగ-రగ కూర్పెంత చిత్రముగ

నున్నది. అనగా సుర, గరుడ, విషోరగ—ఇట్లు విడదీసి చదివినచో నక్షర రమ్యత లేదు. కలిపి చదువవలెను. అప్పుడు రమ్యత పుట్టును. అది భావవ్యంజక మగును. గరుడ—లో-'గ' ముందు 'సుర' లోనికి పోయి విషో—రగకు తర్వాత నన్వయించి వారి సంగవికలురనుగా జేయు చున్నది. య-క్ష-రాక్ష ద్విత్వాక్షర ద్వితయము—విప్రుల నెదుర్చుటలోని ఆపదను వ్యంజించు చున్నది.

ఆది. 8–72 పృథు కుంజగళజ్ఞుల నిర్ఘరంబు—పూరమే చెప్ప బడినది.

ఆది. 8–171 పుష్పితవల్లి వేల్లితోర్వీ జవనావృతిన్—
—ఆవృతిని వల్లి—వేల్లి ఆవృత్తియే చెప్పుచున్నది.

ఆది 8–272 ఆనకదుందుభి ప్రభృతి యాదవులు—

ఇందోష్ఠ్య ప్రాచుర్య మున్నది కదా! దుందుభి తర్వాత ప్ర-సంయుక్తాక్షర విన్యాసము చే—'భి' గురువగు చున్నది. ఈ అవ్య వధానపు కూర్పుచే పద్యమునకు శ్లిష్టత వచ్చుట యట్లుంది—సంయుక్తమగు ప్ర=వేగముగా భి—ని దాకుచున్నది. ఎట్లు? దుందుభిని దండమో—హస్తమో తాకినటు. అనగా పద్యము ధ్వనించు చున్నది. మృదంగముల మ్రోయింపు పుట్టుచున్నది. జాగ్రత్తగా చెవి నప్పగించుకోవలెనంతే!

ఆర. 2–177 అక్ష హృదయంబు—గరంబు—రయంబు—

ఈ త్రిరావృత్తి దాని నిచ్చుటలోని వేగమును హృదయ పూర్వక లక్షణమును తెల్పుచున్నది. ఇచ్చిన ఋతుపర్ణుడు. త్వరగా నిచ్చెను. ఎందుకు? 'విదర్భకుఁ జను వేడ్కఁ జేసి' బాహుకు డతనిని త్వరగా జేర్పవలెను. మఱి వాడు తనకా విద్య నేర్పుమన్నాడు. కాదన్నచో రథము త్వరగా తోలడేమో! అని "ఇచ్చెదనుగాని త్వరగా బోనిమ్ము. త్వరగా గ్రహింపు. ఆలస్యమేల" అన్నట్లు. మరి అఱకొఱ మనస్సుతో కాదు. ముమ్మాటికి చెప్పినట్లు త్రిరావృత్తి. హృదయ పూర్వకముగా నిచ్చెను. చివరిలో కవియే ఋతుపర్ణుడు-'పూర్ణ మనః ప్రసన్నుడై'—ఈ పర్ణ—పూర్ణ—ద్వ్యక్షరావృత్తి పూర్వ విషయమునకు సిద్ధాంత వాక్యముగా కవి వ్రాసినట్లున్నది. తానంత ఎఱిగి ఎఱిగి చేసిన రచన మన్నమాట!

ఆది. 8–224

ధన్యుల కా సుభద్రకు శతక్రతు పుత్రున కుద్భవించె స
హ్మాన్య యశుండు పుత్రుఁ డభిమన్యుఁడు వైన్యనిభుం డనన్యసా
మాన్య—ప్రబల మన్యుఁడు పుణ్య చరిత్రుఁ డస్య రా జన్య—

'ఆ' ఏకమైన 'న్య'—పోనుపోను ఎంత ఉదారతా వికాసముగా నున్నది. అభిమన్యుని తేజోన్మీలనము నొనర్చుచున్నది.
ఏ—'న్య' వ్యర్థమనగలము ?

ఇది అక్షరరమ్యత. యతిప్రాసల నా మహాత్ముడు అక్షర రమ్యతా

విషయకములగా గ్రహించెను. ఆయన సీసరచనమందును దీనిని చూడవచ్చు. ఇది వేఱుగా చూడదగినది.

మంత్ర తంత్ర శాస్త్రములం దక్షరము తత్త్వముఖముగా వ్యాఖ్యాతమైనది గదా. అచ్చులు—హల్లులు, అర్ధనారీశ్వరతత్త్వముగా దర్శింపబడినది. మంత్రమందలి బీజాక్షరములు. అవి తత్త్వమాత్ర పర్యవసానములు. ఈ మహా సంప్రదాయమును దర్శింప సరస్వతీమూర్తి అక్షరమును వాక్య నిర్మాణమునకు ప్రధాన భూమిక—పీఠిక—గా గ్రహించినాడు. ఇంతేగాక ఈ భాష అక్షరాశ్రిత. ప్రత్యక్షరము నుచ్చరించవలెను. అగుట అక్షర ప్రధాన భాష. పై తంత్ర విద్యలోని పద్ధతి ఆధ్యాత్మికము. మహాకవి అదే అక్షరమును ఆలంకారిక మార్గమున కొదిగించినాడు. ఇది రసభావాది వ్యంజకము. శైలీ నిర్ణాయకము. ఆలంకారిక రచనానుగుణముగా అక్షరములు ఘటించుట అక్షరరమ్యత.

అ ధో జ్ఞా పి క లు

1, స్మరః ఖరః ఖలః కాంతః — బంధ పారుష్యము విసర్గలచే సిద్ధించినది.

పత్రత్పకర్ష — ఎత్తుగడ దింపుగడల యందు వైషమ్యము. ఎత్తుగడలోని ఔజ్జ్వల్యము క్రమముగా క్షీణించుట.

"ప్రోజ్జ్వల జ్వలన జ్వాలా వికటోరుసటాచ్ఛటః
శ్వాసక్షిప్త కులక్ష్మాభృత్పాతు వో నరకేసరీ"
—ఆంధ్ర సాహిత్య దర్పణము (పరి. 7. పు. 21)

సంధియందు ఓకారము బహుధా పునరావృత్తమై శ్రవణబాధక మగునని భామహుడు. గతో యాతో హతో — 6–61

*a దండి దీనిని పరుష యనలేదు (చూ. ఏష రాజా—)

*b మాలతీలోలాలి కలలా—యన్న యుదాహరణమున బంధశైథిల్యమున్నందున లకార పునరావృత్తి యున్నను దండి దీనిని బంధ భేదముగా పరిగణించలేదు.

భామహుడు గ్రామ్యానుప్రాస భేదమును కొందఱు పరిగణింతురని చెప్పి—సలోల మాలానీలాలి కులాకుల గలో బలః — అని యుదాహరించెను.

*a ప్రచట వ్యాఖ్యాతలు — ఇస్ మూల శ్లోకమేఁ కజ్జల శబ్దమేఁ ఒకారకా అవ్యవధానసే ప్రయోగమాన్ కర్ ఉదాహరణ దియా హై. (వక్రోక్తి జీవితమ్. పు. 179)

అని వ్రాసిరి. కాని రో— రో ల మధ్య వ్యవధానము లేనందున వానినే గ్రహించుట సమంజసమని నా తలంపు. కజ్జల—ద్విత్వము — మరొక అక్షరముగా గ్రహించి ఇదే అవ్యవధాన పూర్వక వర్ణ విన్యాస వక్రతగా గ్రహించినచో ద్విత్వాక్షర శబ్ద జాల మంతయు భాషలో నున్నట్టిదేకదా! ఆపుడు కవి ప్రయత్న సాధ్యమగు వక్రత సిద్ధించునా? ప్రతిభా వినిస్యూత మగు వక్రత పై వానిలో నెట్లు చెప్పదుము?

'ప్రమాదో ధీమతామపి'

*a. భామహుడు గ్రామ్యానుప్రాస కుదాహరించిన శ్లోకమున అనవరముగా లకార పునః పునరావృత్తి యున్నది. ఇది వ్యసనము. ఇది గ్రామ్యత. కనుక గ్రామ్యానుప్రాసగా తిరస్కరించెను. ఉద్భటుడు దానినే కోమలానుప్రాస యన్నాడు. ఇచ్చిన యుదాహరణమును మార్పు కలదు. (చూ. 3వ పుట) భామహోదాహరణమున వాక్యాంతముదనుక విశ్రాంతి లేదు. ఉద్భటోదాహరణమున కేలి—మాలానాం కడకు వాక్యము విఱిగి మరల 'కల్లైః'—నుండి ప్రారంభమగును. ఇట విశ్రాంతి యుండుటయేకాక కల్లైః—కోలాహల్లైః—యనుటలో వాక్యము లేడివలె గంతు వేయుటచే సుందరమైనది.

*b. భామహుడును సంధులు—సమాసములు—పదములు వీనియందు పారుష్యమును నిరసించెను.

(చూ. 6 అము—భామహాలంకారము)

a. **"Crossing the Stripling Thames at Bablockhitbe-"** **"—while the imaginative value ot the word 'stripling' here is unmistakabue and the quality of syllabic sound in the sequence of consonants and vowels in 'stripling Thames Bablockhithe is equally noticeble and effective. (the suggestion of the sound of flowing water is obuious)**

—Principles of literary Criticisum. (P-43)
— L. Abercrombie

*b **"Style in broadest sense, which includes mood and spirit and the choice of matter as well as technique and language"**

—Principles of Literary Criticisum (P-14)
—L. A. Crmbieo.

రక్తయజ్ఞం

శ్రీ కలువకొలను సదానంద

(గత సంచిక తరువాయి)

9

వాన!

పాతబడిన పెంకుటింటి కప్పుల్లోనుంచి నీళ్ళుకారింది. నేలంతా తడిసింది. పడుకోటానికి చోటులేదు.

మంచంమీద — సుశీల పాపను కావలించుకుని పడుకుంది. సుందరానికి చోటులేదు. అతడు స్టూలుమీద కాళ్ళు చాపుకుని వాలు కుర్చీలో పడుకున్నాడు. మూడుజాములు గడిచిపోయాయి. అతనికి నిద్రపట్టలేదు. కళ్ళు మండుతున్నాయి. కాళ్ళు తిమ్మిరెక్కి పోతున్నాయి.

మంచం కిర్రుమంది, సుశీల నిద్రకళ్ళతో లేచి కూర్చుంది. సుందరంవైపు చూచి 'నిద్రపోలేదూ ?' అంది.

'నువ్వు నిద్రపో సుశీ !'

'కాస్సేపు మంచంపైన పడుకో బావా ! నేను ఈజీచేర్‌లో పడుకుంటాను.' అంటూ ఆమె మంచందిగింది.

సుందరం మంచంమీద పడుకున్నాడు. పాపబుగ్గమీద మెల్లగా ముద్దుపెట్టుకున్నాడు. పొట్టమీద చెయ్యివేసుకుని మత్తుగా కళ్ళు మూసుకున్నాడు.

మరుక్షణం—'కర్‌ర్‌ర్' మంటూ అసహ్యంగా కాకి అరిచింది. మంచంమీద పడుకున్న సుందరం చిరాకుపడుతూ కళ్ళుతెరిచాడు. 'ఇప్పుడేగా పడుకున్నాను ? అప్పుడే తెల్లారి పోయిందా ? ఐదునిమిషాలైనా నిద్రపోలేదే !'.

మంచంమీద పాప కనిపించలేదు. సుశీలకూడా లేదు. అంతా కల ! తెల్లవారిపోయింది. రాత్రి వాన పడలేదు. తాను బాగానే నిద్రపోయాడు. అయినా—రాత్రంతా నిద్రపోనట్టు, ఇప్పుడే పడుకుని లేచి కూర్చున్నట్లు వుందతనికి.

పాడుకాకి ! పెరటిగోడమీద వాలి పరమ అసహ్యంగా అరుస్తోంది. కాకి అంత వికారంగా అరవడం అతడెప్పుడూ వినలేదు.

'కర్‌ర్‌ర్ !

సుందరం లేచి వెళ్ళి కాకిని అదలించాడు.

ఎంత చిత్రమైన కల !

ఇంకా పెళ్ళి కాకుండానే — కొన్నేళ్ళముందున్న బ్రతుకును కళ్ళకు కట్టినట్లు చూపించింది. అది కలెందుకౌతుంది ? జరగబోతున్న నిజమేకదా!... తనకు పెళ్ళవుతుంది. సుశీల కాపురానికొస్తుంది. ఆమెకు పాప పుడుతుంది. ఖర్చులెక్కువవుతాయి. జీతం చాలదు. అప్పటికి ఈ పెంకుటిల్లుకూడా బాగా పాతబడిపోతుంది. మరమ్మత్తు చేయించటానికి డబ్బుండదు. వర్షం కురుస్తే ఇల్లంతా కారుతుంది. నేలమీద పడుకోటానికి వీలుండదు. పాపను పక్కనవేసుకుని, సుశీల మంచంమీద పడుకుంటుంది. తనకు మరో మంచం వుండదు. వాలుకుర్చీలో పడుకోవాలి. వేకువజామున లేచి పాప పక్కన పడుకోవాలి ! దారిద్ర్యంకూడా సుఖప్రదంగానే వుంటుంది ! ఎంత మంచికల ! ... ఇంతలో ఆ కాకి అలా అరవడం మాత్రం ఏమీ బాగాలేదు. నల్లనికాకి ! సంతాపచిహ్నంలాంటికాకి !

సుందరం పెళ్ళి—ఎల్లుండి సూర్యోదయాత్పూర్వం !

వేసవిసెలవులు గనుక బడిలేదు. అతను మధ్యాహ్నం వరకూ యింట్లోనే వున్నాడు. టేబుల్ సొరుగులో పెళ్ళిపత్రికలు కొన్ని మిగిలిపోయాయి. ఒక పత్రికను చేతబట్టుకుని చూస్తూ కూర్చున్నాడు. తనపేరు, సుశీలపేరు అచ్చులో ముచ్చటగా వున్నాయి. కొన్ని పత్రికలు జాగ్రత్తగా దాచిపెట్టుకోవాలి. ముసలివాళ్ళయ్యాక వీటిని చూసుకుని బోసినవ్వులు నవ్వుకోవచ్చు !

సుందరం మధ్యాహ్నం దర్జీవాడి దగ్గర కొత్తబట్టలు తీసుకుని యింటికి తిరిగివస్తూంటే-దారిలో రామలింగం కనిపించాడు.

'నీకోసం మీ యింటికి వెళ్ళానురా! నువ్వు లేవు... అన్నాడు

'ఏమిటీ సంగతి ?'

'ఎప్పుడు ప్రయాణం ?'

'రేపు మధ్యాహ్నం.'

'రాత్రికి వుంటావన్నమాట! అయితే చెప్పు. బొమ్మా, బొరుసా?' అంటూ రామలింగం రూపాయిబిళ్ళ చేతపట్టుకున్నాడు.

'బొమ్మేమిటీ, బొరుసేమిటీ ?'

'వూరికే—చెప్పవోయ్ !'

'బొమ్మ !'

రామలింగం రూపాయిబిళ్లను ఖంగున పైకెగరేశాడు. బొరుసు పడింది.

'ఒరే సుందరం! నువ్వు ఓడిపోయావు గనక నామాట వినాల్సిందే! ఈరాత్రి మనిద్దరం సినిమాకు వెళ్దాం!'

'సినిమాకు ఈరోజే వెళ్ళాలా ఏమిట్రా? మరెప్పుడైనా వెడదాం! రాత్రికి బాగా నిద్రపోవాలి.'

'నీకు పెళ్ళాం వొచ్చిన తరవాత మనిద్దరం కలిసి వెళ్ళడం కుదరదు. కనుక ఈరోజు మనం వెళ్ళాల్సిందే'

'అది కాదు రామలింగం...'

'ఇక మాట్లాడకు! నేను నీతోడుపెళ్ళికొడుకు ననుకో!... అందరూ ఈ సినిమా చాలా బాగుందంటున్నారు. ఈరోజే ఆఖరు. మొదటి ఆటకు యిద్దరం వెళ్దాం! సరే అను!'

'...సరే'

'రైట్! సాయంకాలం రెడీగా వుండు!' అంటూ రామలింగం వెళ్ళిపోయాడు.

సుందరం యిల్లు చేరుకున్నాడు. పెళ్ళికి తరలివెళ్ళడానికి అవసరమైన సామానులన్నీ సర్ది పెట్టుకున్నాడు.

సాయంకాలమైంది.

'పాలు తాగు రా!' అంది రాజమ్మ.

సుందరం గ్లాసు అందుకుని, పెదవుల దగ్గరికి చేర్చుకో బోయాడు. బయట రామలింగంగొంతు వినిపించింది.

'సుందరం!'

సుందరంచేతిలోని పాలగ్లాసు జారి క్రింద పడింది.

'అంతపాలు కింద ఒలకబోసేవేమిట్రా?' అంటూ రాజమ్మ నొచ్చుకుంది.

'చెయ్యి జారిపోయింది. పోతే పోయిందిలే! నేను సినిమాకు వెళ్ళొస్తానమ్మా!

'హోటల్లోనైనా కాఫీ తాగి వెళ్ళు!'

సుందరం, రామలింగం హోటల్లో కాఫీ్రతాగి సినిమాకు బయలుదేరారు.

'మీ మామగారు కట్నం ఎంతిస్తున్నారు సుందరం?'

'కట్నం ఎందుకూ?'

'పిల్లనిస్తే చాలంటావు! మీ అత్తకూతుర్ని ప్రేమించావా ఏమిటీ?'

సుందరం సన్నగా నవ్వాడు.

'నేను మాత్రం నీలాగా పిచ్చివాణ్ణి కాదలుచుకోలేదు. ఒక్క పెళ్ళాంకంటే ఎక్కువమంది వుండకూడదనే చట్టం వుంది కాబట్టి ఆ ఒక్క పెళ్ళిని సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కువ కట్నం తెచ్చే పిల్లనే నేను పెళ్ళి చేసుకుంటాను. డబ్బు తెచ్చిన పెళ్ళాన్ని మరీ గాఢంగా ప్రేమించవచ్చు.

'అది నీబోటివాళ్ళ లక్షణం లేరా!'

ఇద్దరూ సినిమా థియేటరు చేరుకున్నారు. ఆ వూరికంతా అదొక్కటే థియేటరు. ఊరిచివర వుంది. రామలింగం—తానే యిద్దరికీ టిక్కెట్లు కొన్నాడు.

రంగుల్లో తీసిన పౌరాణిక చిత్రం అది, అందులో శ్రీరాముడు అందంగా, కనులవిందుగా వున్నాడు. అతని ఒళ్ళంతా నీలంగా వుంది. బ్రతికినంత కాలం సీతకోసం ఏడ్చాడు రాముడు. చివర—ఆమె భూదేవికడుపున లీనమైపోయింది. అంతటి సుందరుడు, సుజనుడూ అయిన శ్రీరామచంద్రుణ్ణి విషాదానలం కాల్చివేసింది. అతడు ఉత్తమోత్తముడు! ఏ పతివ్రతకూ తీసిపోనంతటి పవిత్రత అతనిది! ఏకపత్నీవ్రతాన్ని ఆచరిస్తూ ఆ పత్నికి కూడా దూరమైన భాగ్యహీనుడు! పాపం...సీతారాములు!

సినిమా వదిలారు.

సుందరం, రామలింగం బయటకు వచ్చారు.

'అలా ఏట్లోకి వెళ్ళివద్దాం రారా!' అన్నాడు రామలింగం.

'ఆకలేస్తోందిరా! ఇంటికిపోదాం!'

'ఓ అయిదునిమిషాల్లో వచ్చేద్దాం పద!' అంటూ అతని భుజంమీద చెయ్యివేశాడు రామలింగం.

రెండు ఫర్లాంగుల దూరంలో ఏరు వుంది. ఇద్దరూ రోడ్డు మీద నడుస్తున్నారు. జనమంతా వెళ్ళిపోయారు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వాళ్ళ ముందర—కాస్త దూరంలో ఒక మనిషి నడిచి పోతున్నాడు. వెనక మరొకతను బీడీ తాగుతూ వస్తున్నాడు.

నిండు పున్నమి!

ఏ ఆలోచనలూ లేక అమాయకంగా వెలిగే పసిపాప చూపులకు మల్లే తేటగా వుంది వెన్నెల! పాపాయి కక్కివేసిన పాలకుమల్లే తెల్లగా వుంది!

ఇద్దరూ ఏట్లోకి వచ్చారు.

ఏట్లో ఇసుక—ఆరబోసిన పిండిలా తెల్లగా వుంది. ఏటిగట్టు మీది చెట్ల చిటారు కొమ్మలు వెన్నెలలో తళతళ లాడుతున్నాయి. చెట్లక్రింది నీడలు నల్లగా వున్నాయి. గాలికి కదిలే ఆకుల గలగలలు తప్ప మరే అలికిడీ వినిపించటంలేదు.

వాళ్ళముందు వెడుతూన్న మనిషి ఆగాడు.

'అగ్గిపెట్టె వుందా?' అని అడిగాడు.

'లేదు! వెనక ఎవరో బీడీ తాగుతూ వస్తున్నారు. ఆయన్నడుగు!' అన్నాడు రామలింగం.

వెనక వస్తూన్న మనిషి—సమీపించాడు. వెలుగుతూన్న బీడీని అవతల పారేశాడు. మొదటివాడు అతన్ని నిప్పు అడగలేదు.

ఆ ఇద్దరూ హఠాత్తుగా సుందరాన్ని రెక్కలు విరిచి పట్టుకున్నారు. నోట్లో గుడ్డ కుక్కారు. రెండు చేతులూ వెనక్కు విరిచి కట్టేశారు. సుందరం భయాశ్చర్యాలతో స్తంభించిపోయాడు. వెర్రిగా పెనగులాడాడు. వాళ్ళలో ఒకడు చాకుతీసి మెల్లగా వీపున తాకించాడు. 'పిచ్చివేషాలు మాని, చెప్పినట్టు విను. నడూ!' అన్నాడు.

సుందరం ఆశతోను, విస్మయంగాను రామలింగంవైపు చూశాడు.

'అంతే సుందరం!' అన్నాడు రామలింగం.

వాళ్ళు ముగ్గురూ అతన్ని జాగ్రత్తగా పట్టుకుని, చెట్లను మరుగు చేసుకుంటూ ప్రక్కనేవున్న కొండవైపు నడవసాగారు.

ఈ ఆకస్మిక సంఘటనను సుందరం వూహించలేదు. ఇదంతా ఒక భయంకర స్వప్నంలా వుందతనికి. అతను భయపడిపోయాడు ఏవేవో ఆలోచనలు అతని మనస్సులో అల్లిబిల్లిగా అలుముకోసాగాయి.

...రామలింగం! నువ్వా! ఇలా చేశావు? మిత్రునికే ఘాతకాన్ని తలపెట్టేంత నీచత్వానికి దిగజారిపోయావా నువ్వు? ఇందుకేనా మధ్యాహ్నంనుంచీ నన్ను అంటిపెట్టుకున్నావు? ఛీ! నీలాంటివాణ్ణి కన్నందుకు స్నేహం సిగ్గుపడుతోంది!...

రామలింగం సుందరానికి ముఖం చూపటానికి సిగ్గుపడి, వెనక నడుస్తున్నాడు. కొండవారగా, రైలుకట్టప్రక్కన నడిచిపోతున్నారు వాళ్ళు.

సుందరంపరిస్థితి అయోమయంగా వుంది. వీళ్ళు తనను ఎందుకిలా పట్టుకున్నారు? ఎక్కడికి తీసుకుపోతున్నారు? ఏం చేస్తారు?...ఉదయం అసహ్యంగా అరిచిన కాకి, సాయంకాలం నేలపాలైన పాలు జ్ఞాపకం వచ్చాయి. అతని ఒళ్ళు గగుర్పొడిచింది.

ఎదురుగా గూడ్సురైలు వస్తోంది.

'ఒరేయ్! బండివస్తోంది. బండిలో వాళ్ళు చూస్తారేమో!' అన్నాడు ఒకడు.

బొరియలాగావున్న రైలువంతెనకిందికి సుందరాన్ని లాక్కుపోయారు వాళ్ళు. ధణధణమంటూ గూడ్సురైలు వెళ్ళిపోయింది. సుందరం మనస్సులో గౌరి తళుక్కున మెరిసింది. అతనిముఖం పాలిపోయింది. శరీరంలో రక్తం చల్లబడిపోయింది. 'నీకు వాటిల్లిన ఈ దురవస్థకు కారణం గౌరి' అంటూ అతని అంతరాత్మ అతనితో గుసగుసలాడింది. అతను కదలలేకపోయాడు.

వాళ్ళు అతన్ని వంతెనలోపలినుంచి బయటికి లాగారు.

...ఏం జరిగింది? తన రహస్యం బయటపడిందా? ఇప్పుడేం జరగబోతున్నది? పర్యవసానం ఎలా వుంటుంది?...అతనికాళ్ళు తడబడ్డాయి.

రామలింగం సుందరంప్రక్కకు వచ్చాడు. భుజంమీద చెయ్యివేశాడు...'సుందరం! గాభరా పడకు! నీకు కీడుచేసే ఉద్దేశం నాకు లేదు. నీకు ఎలాంటి అపాయమూ జరగదు! కాకపోతే ఒకచిన్నమార్పు! అంతే! వర్షంలో హోటలుకు వెడితే, గొడుగులు మారిపోయినట్టు!... ఏ గొడుగైతేనేం? జింకమార్కో, ఏనుగుమార్కో—ఏదైనా పని కొచ్చేదే!...ఏం భయంలేదు. ధైర్యంగా వుండు!' అన్నాడు.

...రామలింగం! నేను నీ మిత్రుణ్ణిరా! కొద్ది నిమిషాల కితం దాకా నిన్ను నమ్మానురా! నన్ను యిలా వంచించి నువ్వేం చేసినా నేను భరించలేను. ఒరేయ్! నన్ను విడిచిపెటేయ్ నేను ఇంటికి వెళ్ళిపోతాను. మా అమ్మ నాకోసం ఎదురుచూస్తుంటుందిరా! ఒరే రామలింగం! మైడియర్ ఫ్రెండ్! మిత్రద్రోహీ!...

సుందరం మొండికెత్తినట్టు ఆగిపోయాడు.

వాళ్ళు అతన్ని బలంగా ముందుకు నెట్టారు.

చేలు, రాళ్ళు, వాగులు, మామిడితోటలు దాటుకుంటూ వాళ్ళు ఒక మైలుదూరం నడిచారు. కొండ్రపక్కన ఒకచోట ఆగారు

కొండమీదుగా రాతిబండల నడుమ సుబ్రహ్మణ్యస్వామిగుడి — వెన్నెల్లో తెల్లగా కనిపిస్తోంది. కొండదిగువ—గుడికివెళ్ళే దారికి యిరు ప్రక్కలావున్న చెట్లు గాలికి మెల్లగా కదులుతున్నాయి. చెట్ల ప్రక్కనున్న కోనేటిలోని నీళ్ళు చల్లగా నిద్రపోతున్నాయి. గట్టుమీదికప్ప కోనేటిలోకి దూకిందేమో—నీళ్ళు 'క్లంగు' మంటూ ఉలికిపడి, మళ్ళీ నిద్రకు ఉపక్రమించింది.

దారి ప్రక్కనే ఒక పూరిల్లువుంది. ఆ యింటితలుపు దగ్గరగా వేసివుంది. కిటికీ సందుల్లోంచి గుడ్డిదీపపు వెలుతురు బయటికి ప్రసరిస్తోంది. అందులో—దేవాలయార్చకుడు కాపురం వుంటున్నాడు.

వాళ్ళు కల్యాణ మంటపాన్ని సమీపించారు. అక్కడినుండి గుడివరకూ కొండమీదుగా రాతిమెట్లున్నాయి.

సుందరం అనుమానం నిజమైంది. కల్యాణ మండపంలో పెట్రోమాక్సులైటు వెలుగుతోంది. ఆ వెలుగులో మొట్టమొదట అతనికి గౌరి కనిపించింది. నాగరాజు గంభీరంగా నిలబడి వున్నాడు. అతనిప్రక్కన వాసు వున్నాడు. మరో యిద్దరు మగవాళ్ళుకూడా వున్నారు. గౌరితప్ప మరోస్త్రీ అక్కడలేదు. అతని చూపులకు—సుందరంగుండె జలదరించింది. అతన్నిచూచి గౌరి తలవంచుకుంది.

రామలింగం సుందరం కట్లు విప్పాడు. అతనినోట్లో కుక్కిన గుడ్డను లాగేశాడు.

'ఏమిటిది ?...' అన్నాడు సుందరం, అదురుతున్న కంఠంతో

అతని ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

ఒకడు పూజారియింటి వద్దకు వెళ్ళి, అతన్ని వెంటబెట్టుకుని తిరిగివచ్చాడు.

పూజారి కళ్ళు నులుముకుంటూ వేదికమీద చతికిలబడి, సమిధలుపేర్చి, 'అమ్మాయిని, అబ్బాయిని యిలావచ్చి కూర్చోమనండి'! అన్నాడు.

నాగరాజు గౌరిని వేదికమీద కూర్చోబెట్టాడు.

సుందరం పెదవులు కోపంతో వణికాయి. ''ఏమిటీ దౌర్జన్యం? నన్ను వెళ్ళనివ్వండి!' అంటూ విసురుగా వెనక్కు తిరిగి వేగంగా నాలు గడుగులు నడిచాడు. వాసు అతనిమీదికి దూకి చొక్కా కాలరు ఒడిసి పట్టుకుని, వేదికదగ్గరకు లక్కువచ్చాడు. సుందరం పెనగులాడాడు.

'నీకంటే రౌడీన్రా నేను! చచ్చినట్లు కూర్చో ! లేకుంటే ముక్కు పచ్చడి చేసేస్తాను!' అంటూ చెయ్యి పైకెత్తాడు వాసు.

'ఏయ్ వాసూ! ఏమిటా దుడుకు ? వూరుకో !' అంటూ అతన్ని ప్రక్కకు నెట్టాడు నాగరాజు. సుందరంభుజంమీద చెయ్యి వేసి, అతని ముఖంలోకి చూసి వికటంగా నవ్వాడు. సారా వాసన గుప్పు మంది. అతడు తప్పతాగి వున్నాడు. అతని మాటలు తడబడు తున్నాయి. 'అల్లుడూ! నువ్వు నా అల్లుడివి ! నేను నీ మామను ! అది నీ పెళ్ళాం! నిన్ను చంపేసేవాణ్ణే ! ఐతే నువ్వు నా అల్లుడివి! నోరు మూసుకుని కూర్చో అల్లుడూ!' అంటూ అతన్ని వేదికమీదికి తోశాడు.

సుందరానికి ఒక్కసారిగా ఏడుపొచ్చేసింది.

'నా మీద ఎందుకు మీరిలా పగబట్టారు? నేను మీకేం అప కారం చేశాను? మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను వెళ్ళిపోనివ్వండి ! రేపే నాకు పెళ్ళి! నా బ్రతుకు చెడగొట్టకండి! నన్ను భ్రష్టుణ్ణి చెయ్యకండి! నన్ను విడిచిపెట్టేయండి!' అంటూ పసివాడిలా ఏడ్చాడు.

పురోహితుడు చివాలున పైకిలేచి నిలబడ్డాడు. నాగరాజు వైపు కోపంగా చూశాడు. 'ఇదేదో దొంగపెళ్ళి అని మాత్రం అనుకున్నానుగానీ, బలవంతపు పెళ్ళి అని నాకు తెలియదు. ఈ పాపం నాకెందుకూ? మీకు బుద్ధిలేకపోతే, నాకూ బుద్ధి లేదనుకున్నారా?' అంటూ వేదిక దిగాడు.

నాగరాజు కళ్ళలో కత్తులు మెరిశాయి. చేతితో మీసం మెలి పెడుతూ, ఓ విషపు నవ్వు నవ్వాడతను. పురోహితుడు మళ్ళీ గబుక్కున వేదికమీదికెక్కాడు. 'పిలిచి పిల్లనిస్తానంటే వొద్దంటావేమిటి నాయనా?...సరే అను!' అంటూ సుందరాన్ని మందలించాడు.

నాగరాజు సుందరంప్రక్కన నిలబడ్డాడు.

'నిన్ను విడిచిపెట్టేయాలా అల్లుడూ! రేపు నీకు పెళ్ళా? నీ బతుకు చెడిపోకూడదు. నిన్ను భ్రష్టుణ్ణి చెయ్యకూడదు. సరే! బాగానే వుంది! అయితే నా కూతుర్ని ఏం చెయ్యమంటావల్లుడూ? దాన్ని ఏ నూతిలో తొయ్యమంటావు? దానికెందుకు కడుపు చేశావల్లుడూ?'

పురోహితుడు ఆశ్చర్యాన్ని అభినయించాడు. 'ఆఁ ఆఁ! అంతపని చేసేనా, యిప్పుడీ నంగిమాటలు మాట్లాడుతున్నాడు? మంచి పెద్ద మనిషే! ముఖం చూచి, ఈ పిల్లి కూడా పాలు తాగుతుందా అనుకున్నాను. పావలాడబ్బుతో దులిపేసుకునే సాని అనుకున్నావా, పది కాలాలపాటు బ్రతికే కన్నెపిల్ల అనుకున్నావా ? కట్టవయ్యా తాడు! ఇక మారుమాటాడకు!'

సుందరం అదిరిపడ్డాడు.

ఏమిటీ విధివైపరీత్యం? గౌరి గర్భం ధరించిందా? తన పాలిటికి పిడుగుపాటులా వుంది ఈ వార్త!

'అబద్ధం! మీరందరూ కలిసి నాటకమాడుతున్నారు. మీరు మోసగాళ్లు! గూండాలు!' అంటూ అరిచాడతను.

గౌరి తలపైకెత్తి అతనివైపు చూచింది. సుందరం కంపించి పోయాడు. ఆమెచూపుల్లో నిజం తొంగిచూస్తోంది.

...అయ్యో గౌరీ! ఎంతపని చేశావు! అంతా నీ సంకల్పం ప్రకారమే జరుగుతూన్నట్టుంది! నన్ను తిట్టాలనుకుని తిట్టావు. కొట్టించాలనుకుని కొట్టించావు. నన్ను పొందాలనుకుని పొందావు. గర్భం కూడా ధరించాలనే ధరించావా? నాకెంత సంకటాన్ని తెచ్చి పెట్టావు! న్యాయాన్ని నీవైపు కట్టిపడేసుకున్నావు. గెలుపు నీదే! గర్వం నీకుగాక మరెవరికుండాలి? నామీద యింత ఘోరంగా ప్రతీకారం తీర్చుకోవడం తగదు గౌరీ!...

సుందరం నిశ్చేష్టుడైపోయాడు. శక్తి లేని అతని మెదడు అరిగిపోయిన రికార్డులా ఏడుస్తోంది.

'నాయనా! ఏదో పొరబాటు చేశావు. నీవల్ల నా పరువు, నా కూతురి బతుకు నాశనం కాబోతున్నాయి. లేకుంటే నీ గురించి పట్టించుకునేవాణ్ణికాను! తప్పుచేశావు గనుక, దీన్ని కాపాడే భారం కూడా నీదే!' అన్నాడు నాగరాజు.

'నాగరాజూ!...' అన్నాడు సుందరం. 'నేను పొరబాటు చేయలేదు నాగరాజూ! మీ అమ్మాయిమీద నాకు ఎలాంటి పాడు ఆలోచనా లేదు. సిగ్గువిడిచి చెబుతున్నాను. ఆమె నన్ను బలవంతం చేసింది. ఆమె నా బతుకును నాశనం చేస్తోంది.'

'ఏమైతేనేం? తప్పుచేశావు. దానికి నెలతప్పింది'

...అయ్యో! లేదు లేదు! పట్టుకుని పంగనామాలు పెడితే మాత్రం దాసరవుతాడా? గౌరి నన్ను పట్టుకుని పంగనామాలు పెట్టింది. నేను తప్పుచేయలేదు. గౌరి నాచేత తప్పు చేయించింది. నా మనస్సు ఆమెతో వ్యభిచరించలేదు. నా శరీరంతో ఆమె ఆనందించింది. ఆమె పాపం చేసింది. నన్ను బోనులోకి ఎక్కిస్తూవుంది...

సుందరంలో తీవ్రమైన సంఘర్షణ ప్రారంభమైంది.

... తప్పు జరిగింది. ఆ తప్పు అణువంతే కావచ్చు. అది గౌరి కడుపులో వ్రణంలా పెరిగి పెద్దదై బయట పడబోతున్నది. సుందరం! ఒరే దౌర్భాగ్యుడా! ఆ వ్రణాన్ని కడిగి మందు వెయ్యాల్సిన వాడివి నువ్వే! తప్పదు! నువ్వు పద్మవ్యూహంలో చిక్కుకున్నావు. బయటపడలేవు. నీ చుట్టూ ఎలాంటివాళ్లున్నారో చూడు!...

...నిజమే! ఒప్పుకుంటాను. నమ్మబలికి, అనుభవించి, అవతలికి పారిపోయే స్వభావం నాకు లేదు. అయితే నా జీవితంలో ఇలాంటి మలుపును నేను ఆశించలేదు. నేను మొదటినుంచీ ఒకే దారిలో వెళ్లాలనుకున్నాను. ఆ దారిలో నడిచి నా సుశీలను అందుకోవాలనుకున్నాను. మధ్యలో — నా అంగీకారంతో నిమిత్తం లేకుండా గౌరి ఓ తప్పు చేసింది. ఆ తప్పు నాపాలబడింది. అదే శాసనంగా మారి, నన్ను నా దారిలోనుండి మళ్లించడం మహాఘోరం! ఈ మార్పును భరించగల ఆత్మస్థైర్యం నాకు లేదు. నేను చాలా బలహీనుణ్ణి! నా సుశీలను ఎలా ఒదులుకోగలను? అయ్యో! ఆ కలయిక సుశీలతో జరిగివుండకూడదూ? ఆమె గర్భవతి అయివుండకూడదూ? ఆమెను కాపాడటంకోసం నా మానప్రాణాలైనా త్యాగం చేసివుండనూ? ... గౌరీ! నువ్వు నా మనస్సులోని కోరికల్ని పసికడుతూ ఎత్తులు వేస్తున్నావా? నా బిడ్డ నా సుశీలకడుపులో ప్రాణం పోసుకోవాలని ఉవ్విళ్లూరాను. బందిపోటుదొంగలా నువ్వు నన్ను దోచుకున్నావు. దోచుకున్న నా సొత్తుకు నన్నే కాపలాదారుగా వుండమని ఒత్తిడి చేస్తున్నావు. వద్దు గౌరీ! నన్ను విడిచిపెట్టేయి. నా దారిని నన్ను పోనివ్వు! ఇలా ప్రార్థిస్తున్నందుకు నాకు సిగ్గువేస్తోంది! అయితే ఏంచెయ్యను? నేను స్వార్థపరుణ్ణి! ఈ జన్మ మళ్లీ రాదు. ఈ జన్మను నీకు త్యాగం చేయలేను గౌరీ!...

పురోహితుడు మంత్రాలు వల్లిస్తున్నాడు. దూర్వాసుడి శాపాల్లా కటోరంగా వినిపిస్తున్నాయి ఆ మంత్రాలు. సుందరం అనిమిషనేత్రాంలో ఎక్కడో దూరంగా చూస్తున్నాడు. దూరంగా వెన్నెల్లో ఊరు పెన్సిల్ డ్రాయింగ్‌లా కనిపిస్తోంది. కొండ దిగువ రైలుపట్టాలు మలుపుతిరిగినచోట ప్రతిఫలిస్తోన్న వెన్నెల వంపులు కటికవాళ్ల కత్తుల్లా మెరుస్తున్నాయి ... ఈ పండువెన్నెల మహా భయంకరంగా వుంది!

సుందరం గుండె ఝల్లుమంది. 'లబ్బాయ్! తాళిబొట్టు కట్టు!' అంటూ మంగళసూత్రం అతని చేతిలో పెట్టాడు పురోహితుడు. అది అతనిచేతిలో నిలవకుండా జారిపోయింది.

నాగరాజు ముందుకు వంగాడు. 'కట్టు' అన్నాడు. సుందరం మూగవాడిలా అతనివైపు చూశాడు.

...నాగరాజూ! ఈ పెళ్ళి జరక్కపోతే నీ పరువు పోతుంది' ఆ పెళ్లి ఆగిపోతే నా పరువు పోతుంది. అయ్యో! నన్నెందుకిలా వేధిస్తావు... విధిరాకాసీ! నువ్వు రూపాయిబిళ్లను పైకెగరేసి, బొమ్మా బొరుసా— అని అడిగావు. నేను బొమ్మ కావాలన్నాను. నువ్వు బొరుసు వేస్తున్నావు. వద్దు వద్దు! నాకు బొమ్మే కావాలి!

'మాట్లాడవేం?' అన్నాడు నాగరాజు.

...ఎలా మాట్లాడను ? ఏమని మాట్లాడను ? పంచేంద్రియాలూ నా అదుపు తప్పిపోతున్నాయి. నాకు మాటలు రావటంలేదు. ఇప్పుడే ఈ నేలమీద పడినట్లుంది నాకు ! పురిటి పాపలా ఏడవటం తప్ప, నాకు మాట్లాడటం చేతకాదు...

అందరూ అతనిచుట్టూ చేరి ఒత్తిడి చేయసాగారు.

'ఎంతసేపు యిలా బెల్లంకొట్టినరాయిలా కూర్చుంటావు ? నిన్ను వూరికే చేసుకోమనటంలేదు. నువ్వు ఏమడిగినా యిస్తాను. అమ్మాయికి బొట్టుకట్టు!' అంటూ మంగళసూత్రం అతని చేతిలో పెట్టాడు నాగరాజు.

...వద్దు ! నువ్వు నాకేమీ యివ్వద్దు ! స్వర్గలోకాధిపత్యం యిచ్చినా నాకు వద్దు! నా సుశీల తప్ప యింకేదీ నాకు వద్దు!...

'నువ్విలా మాట్లాడకుండా కూర్చుంటే నేనొప్పుకోను. కట్టి తీరాల్సిందే!'

వీళ్లంతా తనను బలవంతం చేస్తున్నారు. గౌరిమెడలో తాళి కట్టడానికి తాను సిద్ధంగాలేడు. తన నిర్ణయాన్ని యింత హఠాత్తుగా మార్చుకోమంటారేం వీళ్ళు ? ఏమీ ఆలోచించుకోలేకపోతున్నాడు తాను. వీళ్లు ఓ వారంరోజులు తనకు గడువివ్వరాదూ?బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రావచ్చు. ఎలాంటి నిర్ణయం ది? తాను గౌరిని పెళ్లి చేసుకోవాలనుకుంటాడా? సుశీలతో రేపు తనకు పెళ్లి జరగాలికదా! దానికి గిడువెవరిస్తారు ? తాను సుశీలను పెళ్లి చేసుకుంటే గౌరి గతేం కావాలి ? ఇప్పుడు వున్నట్టుండి గౌరి మెడలో బొట్టు కడితే, సుశీలను కోరుకుంటున్న తన బ్రతుకేం కావాలి? ఆ పెళ్లి ఏం కావాలి? అందరూ తనను ఏమంటాగు ?... ఈ సమస్యను తప్పించుకోవడం ఎలా ? ఇది గడువుతో తీరే సమస్య కాదు. రిప్ వాన్ వింకిల్ లాగా ఇరవైఏళ్లు ఈ కొండమీదపడి నిద్రపోవాలి! మళ్లీ లేచేటప్పటికి — ఈ సమస్య పరిష్కారమైపోయి వుంటుంది.

కాలం గడిచిపోతోంది. నాగరాజు ఏదో మాట్లాడుతున్నాడు. సుందరం చెవిటివాడిలా కూర్చుని వున్నాడు.

నాగరాజు మత్తు క్రమంగా వొదిలిపోతోంది. మత్తు తగ్గిపోతున్నకొద్దీ, అతనిలో కోపం పెరిగిపోసాగింది.

'కట్టవూ?' అంటూ పళ్లు పటపట గీటాడు అతను.

సుందరం తలవంచుకున్నాడు.

నాగరాజు కాలితో బలంగా అతని డొక్కలో ఒక్క తన్ను తన్నాడు. సుందరం బాధతో 'అమ్మా' అని మూలిగి, కడుపు చేత్తో పట్టుకున్నాడు.

నాగరాజుగొంతు కోపంవల్ల అదురులోంది. 'వెధవా ! రౌడీ వెధవా! నా కూతురిబతుకు గంగలో కలిపేద్దామనుకున్నావా? వూరికే విడిచిపెట్టేస్తాననుకున్నావా? అది బాగుంటేనే నువ్వూ వుంటావు. చెడిపోయే రాతే దానికుంటే, నువ్విక్కడే చస్తావు'.

'మం॥ తాలతో మామిడికాయలు రాల్తాయా ? దొంగవెధవ! నాలుగు తంతే వాడే కడతాడు' అంటూ వాసుకూడా సుందరం వీపు మీద ఒక తన్ను తన్నాడు.

'ఇప్పుడెందుకులెండి గొడవ ! ముహూర్తం కూడా ఎప్పుడో దాటిపోయింది' అన్నాడు పురోహితుడు.

'పోతే పోయింది. వాడు ఆ పాడుపని ముహూర్తం చూసే చేశాడా? వాడు తాళి ఎప్పుడు కడతాడో— అదే ముహూర్తం! కానీ!' అంటూ గద్దించాడు నాగరాజు.

సుందరం జాలిగా అతనివైపు చూశాడు.

...నాగరాజూ! నన్ను క్షమించు! నీ బాధ నేను అర్థం చేసుకోగలను. నా వేదనకంటే నీ వేదన ఎక్కువైనది! నీ వేదనకు ఒక కారకుణ్ణి నిలబెట్టటంకోసం నా దురదృష్టదేవత నన్నే వరించింది. పాపం! నాగరాజూ! నువ్వెంత మధనపడుతున్నావు ! నా ప్రాణంతో నీ వేదన తీరిపోగలిగితే చెప్పు— నా ప్రాణాన్ని సంతోషంగా నీకు దానం చేస్తాను...

సుందరాన్ని అందరూ నోటికి వచ్చినట్టు తిడుతున్నారు. గౌరి మాత్రం ఊపిరి బిగపట్టి కూర్చొంది.

నాగరాజు మొలలోంచి చాకు బయటికి లీశాడు. దాని మొన వెన్నెల్లో తళుక్కున మెరిసింది. ఎర్రగా కాలిన ఇనుపచువ్వల్లాంటి చూపులలో అతను సుందరంమీదికి వంగాడు.

భయవిహ్వలయై చూస్తున్న గౌరి 'వొద్దు నాన్నా!' అని కేక పెట్టింది.

సుందరంచొక్కా చర్రున చిరిగింది. అతని వక్షస్థలంమీద పొడుగ్గా ఎర్రటిగీత పడింది.

'నా కూతుర్ని కట్టుకోవటంకంటే ఈ చిత్రహింసే నీకు బాగుందా?' అని క్రూరంగా నవ్వాడు నాగరాజు.

హఠాత్తుగా రామలింగం – ముందుకు దూకాడు. నాగరాజు చేతిని గట్టిగా పట్టుకున్నాడు. 'వొద్దు! వాణ్ణి ఏమీ చెయ్యొద్దు !

వాడు తాళికట్టకపోతేనేం? గౌరినే కట్టుకోమందాం! వాడే కట్టాడని చెబితే సరిపోతుంది!'

నాగరాజు అతన్ని పక్కకు నెట్టివేశాడు. 'ఏం ? ఎందుకు కట్టడూ? నా కూతురుతో కులికినప్పుడు ఈ నంగనాచితనం ఏమైంది?... వీల్లేదు! వాడే కట్టాలి!' అంటూ మళ్ళీ సుందరం వైపు కత్తి వూపాడు.

'తొందరపడకు! వాడే కడతాడులే! నేను చెప్పి ఒప్పిస్తాను'

'సరే! ఒప్పించు మరి!'

రామలింగం సుందరంముందర కూర్చున్నాడు. సుందరానికి చాలా సంతోషం వేసింది. తన మిత్రుడు సిగ్గుపడేలా సూటిగా అతని కళ్ళలోకి చూశాడు.

రామలింగానికి ఏడుపొచ్చింది.

'నన్ను క్షమించురా సుందరం!... వాళ్ళు చెప్పినట్లు చెయ్యిరా! లేకుంటే చంపేస్తారురా! ప్రాణాలు దక్కించుకోరా!' అంటూ గడ్డం పట్టుకొన్నాడు.

సుందరం సంతోషంతో పులకించిపోయాడు. బదులుమాట్లాడకుండా చిరునవ్వు నవ్వాడు... చాలు రామలింగం! మిత్రుడిగా నీనుండి యింతకంటే యింకేమీ కోరను. నీ వంచన ఉల్లిపొరలా ఎగిరిపోయింది. నీ పాపం మంచులా కరిగిపోయింది. ఇప్పుడు నువ్వెంతో పరిశుద్ధంగా వున్నావు! ...

రామలింగం చాలాసేపు బతిమాలుకున్నాడు. సుందరం ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

రామలింగం కోపంతో అతన్ని నెట్టివేస్తూ పైకి లేచాడు. 'సరే! చావు! నీకు చావాలని వుంది. దిక్కులేకుండా చావు !' అంటూ పక్కకు తప్పుకున్నాడు.

పురోహితుడు గజగజలాడిపోతున్నాడు. 'నేను చూడలేను బాబూ! కళ్ళు తిరిగిపోతున్నాయి. నేను యింట్లోకి వెళ్లిపోతాను'

'వెళ్లిపో!' అంటూ ఈసడించుకున్నాడు నాగరాజు.

పురోహితుడు తొట్రుపడుతూ నాలుగడుగులు వేశాడు. 'అటుకాదు. ఇల్లు ఈవైపు!' అంటూ అతని చెయ్యి పట్టుకున్నాడు రామలింగం.

'నాయనా! నన్ను ఇంట్లో విడిచిపెట్టేయి నాయనా! ... శివ శివా!... శివశివా!'

రామలింగం అతన్ని ఇరవైబారల దూరంలోవున్న ఇంటివరకూ నడిపించాడు. తలుపు మూసివుంది. లోపల పురోహితుడి ముసలితల్లి రాగాలుతీస్తూ ఏడుస్తోంది.

'ఇదెక్కడి ఘోరంరా దేవుడో! వాళ్ళు ఆ కుర్రాణ్ణి చిత్రవధ చేసేస్తున్నార్రా దేవుడో!...'

ఊపిరి బిగబట్టి పడుకున్న ఆమెకోడలు 'వూరుకో! పిల్లలు లేస్తే జడుసుకుంటారు' అంటూ కోపంగా కసురుకుంటోంది.

'ఒసే! తలుపు తియ్యి!' అన్నాడు పురోహితుడు.

లోపల మాటలు ఆగిపోయాయి. శ్వాసకూడా వినిపించలేదు. గాలికూడా కదల్లేదు.

'ఒసేయ్! నేనే! తలుపుతియ్యి!'

లోపల మళ్ళీ చలనం ప్రారంభమైంది.

'మీరేనా?'

కిర్రున తలుపు తెరుచుకొన్నది. పురోహితుడు గబుక్కున లోపలికి దూరాడు. దభేలున మూసుకుపోయింది.

'శివశివా!...'

రామలింగం ఓ గుండుచాటుకు వెళ్లాడు. సందేహిస్తూ క్షణకాలం నిలబడ్డాడు. బండలను చాటుచేసుకుని, రాళ్లమీద చప్పుడు కాకుండా నడుస్తూ కొండ దిగాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది.

తుపాకి చప్పుడు విని భయపడిన కుందేలులా పరుగందుకున్నాడు రామలింగం. తాను అనుకున్నదొకటి, ఔతున్నది మరొకటి! నాగరాజుమీద అభిమానంతో సుందరాన్ని తీసుకొచ్చాడుగానీ, అతని పట్ల అఘాయిత్యాన్ని తాను ఊహించలేదు. సుందరాన్ని కాపాడటానికి ఏమాత్రం అవకాశమున్నా—దాన్ని జారిపోనివ్వకూడదు.

వెన్నెల్లో పరుగిడుతూన్న లేడిపిల్లలా వున్నాడు రామలింగం.

...ఈ శరీరం నాదికాదు. నాదికాని ఈ శరీరాన్ని గురించి నేనెందుకు బాధపడాలి ? ... ఇలా అనుకుంటూ వుంటే నా బాధ తగ్గిపోతూ వుంది. ఎంత చిత్రం! ఈ శరీరం కంటికి కనిపిస్తోంది. ఆ బాధ కంటికి కనిపించటంలేదు. అయినా, పాము కప్పను మింగినట్లు అది నా శరీరాన్ని పట్టుకుంటోంది. నా శరీరానికీ, నాకూ ఉన్న సంబంధాన్ని ఆసరాగా తీసుకుని అది నన్ను బెదిరిస్తోంది. ఈ శరీరాన్ని పరిత్యజించేస్తాను. ఆ బాధ నన్నేమీ చేయజాలదు...

గొర్రెపిల్లలాంటి సుందరం— సాధుజంతువులాంటి సుందరం— దుర్మార్గుడు ఎదురుగా వస్తే దారి యిచ్చి పక్కకు తొలగిపోయే సుందరం—వార్తాపత్రికల్లో వెలువడే ఘోరవార్తల్ని చదివి దిగులుపడిపోయే సుందరం— ఈనాడు మహాక్రూరుడైపోయాడు. రజో గుణానికీ, సత్త్వ గుణానికీ నడుమ సంకుల సమరం చెలరేగింది. ఎరుపు మీద ప్రతికారం తీర్చుకోవాలి! ఇప్పుడది తోడేలులా తనమీద విరుచుకు పడుతున్నది.

తూర్పున వేగుచుక్క పొడిచింది.

చంద్రబింబం పడమటివైపు జారిపోతున్నది.

ఈ వేకువ చాలా అందంగా వుంది. నిశ్శబ్దగంభీరంగా వుంది. ఇలాంటి వేకువలో విహరించాలంటే, ప్రాణం ఎంతో పుణ్యం చేసుకుని వుండాలి.

సుందరం చంద్రుణ్ణి చూస్తున్నాడు. మసకబారిన చంద్రుడు మృతంలాగా, గుడ్డిగా నవ్వుతున్నాడు.

వెన్నెల్లో రాలిపడ్డ నిప్పుతునకలా వున్నాడు నాగరాజు.

'ఊఁ! కానీ!' అన్నాడు.

సుందరంలో చలనం లేదు.

నాగరాజు బాకుతో అతని వీపుమీద ఒక్కపోటు పొడిచాడు. సుందరం బాధగా మూలిగాడు.

అయ్యో సుందరం! చివరికి నీ బ్రతుకిలా విషాదాంతమై పోయిందా! నువ్వు నమ్ముకున్న దేవుడికి బుద్ధిలేదు. వాణ్ణి క్షమించు!

గౌరి కెవ్వున కేకవేసి నేలకు అంటుకుపోయింది.

...గౌరీ! నీ దురాశతో ఎందుకు నాకు బంధం వేశావు? ఈ పాపం, ఈ మరణం — ఇవి రెండూ నువ్వు ప్రసవించిన కవల పిల్లలు! చూడు! చూడు! కళ్ళు మూసుకున్నావేం?...

సుందరం మళ్ళీ చందమామవైపు చూశాడు.

...చంద్రుడా! నీకు జాలిలేదు!...

'కట్టవూ?' అంటూ మళ్ళీ ఉరిమాడు నాగరాజు.

సుందరంతల కిందికి వాలిపోతోంది.

నాగరాజు అతనిగుండెల మీద ఇంకో పోటు పొడిచాడు.

సుందరం క్రిందికి ఒరిగిపోయాడు.

వున్నట్టుండి వాసు గాభరాగా కేకవేశాడు. ''పోలీసులు! కొండకింద పోలీసులొస్తున్నారు!'

సుందరం చుట్టూ వున్నవాళ్ళందరూ తలోకదిక్కుగా పరుగందుకున్నారు.

మసకవెన్నెల నెత్తుటితో తడిసిపోయింది.

★ ★ ★

సుందరం కళ్ళు తెరిచాడు.

అతనితల గౌరిఒడిలో వుంది. ఆమె ఏడుస్తోంది.

సుందరానికి జాలివేసింది. తన జీవితం అంతమైపోతోంది. కాని, గౌరి బ్రతుకేం కావాలి? ఆమెకడుపులోని బిడ్డ ఏంకావాలి? గౌరికి భర్తగా, ఆ బిడ్డకు తండ్రిగా తాను చచ్చిపోవాలి!

సుశీల యిక తనకు అందదు. ఇక తాను జీవించబోయే కొన్ని క్షణాల్లో, గౌరికి తాను చేయగలిగింది చేస్తే ఏంపోయింది? ... సుశీలను మోసంచేసి, ఆమెకు కనిపించకుండా దూరంగా పారిపోవాలి!

సుందరం గౌరితో మాట్లాడాలనుకున్నాడు. మాట్లాడలేక పోయాడు. అతికష్టంమీద మెల్లగా లేచికూర్చున్నాడు. రక్తసిక్తమైన మంగళసూత్రాన్ని ఆమెమెడలో కట్టాడు. అశక్తంగా ఆమె ఒడిలో పడిపోయాడు.

గౌరి గుండె బ్రద్దలై ఏడువసాగింది.

'సుందర్! నన్ను మన్నించు సుందర్! నిన్ను నేనే చంపేశాను. నన్నేంచేసినా పాపంలేదు'

తూరుపుదిక్కున — కొలిమిలో మెరిసే మంటల్లా ఎర్రటి కాంతులు పరుచుకుంటున్నాయి.

ఎరుపు!

నీలికళ్లలాంటి ఆకాశంలో నెత్తుటిజీరల్లాంటి ఎరుపు!

గాయంలాంటి ఎరుపు! గొడ్డుకారంలాంటి ఎరుపు!

అపాయంలాంటి ఎరుపు! అవమానంలాంటి ఎరుపు!

పగలాంటి ఎరుపు! పాపంలాంటి ఎరుపు!

కామంలాంటి ఎరుపు! క్రౌర్యంలాంటి ఎరుపు!

కన్నతల్లిశోకంలాంటి ఎరుపు!

కాలిపోతున్న బ్రతుకులాంటి ఎరుపు!

గౌరికడుపులో ప్రాణంపోసుకుంటున్న నెత్తుటిముద్దలాంటి ఎరుపు!

దేవుడి కన్నీళ్లలాంటి ఎరుపు!

ఈ ఎరుపు ఏరై తనమీద పొర్లి ప్రవహిస్తోంది.

చిత్రం! ఎదుట నిలబడ్డ పోలీసుటోపీకూడా ఎర్రగానే వుంది! సుశీల ఈపాటికి ఒళ్లువిరుచుకుంటూ నిద్రలేస్తూ వుంటుంది. ఆమె బుగ్గలమీది సిగ్గుకూడా ఎర్రగానే వుంటుంది!

సుందరంకళ్లు మూతలుపడ్డాయి.

ఇది తనకు అంతిమక్షణం!

'ఈ క్షణంలో దేవుణ్ణి స్మరించాలి.

నువ్వు అత్యంత ప్రియంగా పూజించే ప్రేమమూర్తిని దేవుడి స్థానంలో నిలుపుకో!

...అమ్మ! నాకోసం ఏడ్చే నా దైవం! ... అయ్యో, అమ్మా! నిన్ను తలుచుకుంటూవుంటే నా గుండె చెరువైపోతూవుంది. నిన్ను ఉద్ధరించడానికి నేను పుట్టలేదు. నీ కడుపులో చిచ్చుపెట్టడానికి పుట్టాను. నిన్ను తలచుకోవడంవల్ల కలిగే వేదన ఈ కత్తిగాయాల

వల్ల కలిగే బాధకంటే ఎక్కువగా ఉంది. నా ఊహల్లోనుంచి వెళ్ళిపో అమ్మా!...

సుందరం పెదవుల్లోంచి అస్పష్టంగా ఓ మాట వెలువడింది. అతడు పలికిన చివరిమాట అదే!

'సుశీ!'

ఆ శబ్దాన్ని మోయలేక గాలి బరువుగా మూలిగింది.

వార్త శబ్దరూపాన్ని ధరించడానికి ఆధారభూతమైనది గాలి. 'అయ్యో సుందరం! ఈ విషాద వార్తను నీ తల్లికీ, నీ ప్రేయసికీ ఎలా చెప్పమంటావు? అంత క్రూరమైన పని నన్ను ఎలా చేయమంటావు?' అంటూ ప్రభాతవాయువు పరమసాత్వికునిలా రోదించింది.

-: స మా ప్త ము :-

అంకితం

నాకు ఊపిరి పోసి
పెంచి
పెద్ద చేసిన
ఆంధ్రపత్రికా కుటుంబానికి
సభక్తికంగా

—సదానంద

అహమ్

శ్రీ తిరునగరి

ఏదీ నాది కాదంటూ
వేదాంతాన్ని వల్లించలేను
ఊపిరి ఉన్నంతకాలం
ఉన్నదంతా నాదే నంటాను

నాగరికతాసుందరి లాస్యం చూస్తూ
నగరంలో గడుపడం నాకు సరదా
పాలమనసులున్న జానపదులున్న
పల్లెసీమల్లో బ్రదుకడం వరంకాదా!

గుహల్లోకి పారిపోదామనే
గొప్ప గొప్ప వాళ్ళు
దృశ్యమంతా మిథ్య అని
అదృశ్యమరీచికలవైపే మొగ్గితే—

నా కీ కనిపించే జగత్తు
సత్యం, శివం, సుందరం

నేను మానవుణ్ణి
పరమాత్ముణ్ణి సైతం

పరమ దౌర్భాగ్యునిలో సందర్శిస్తాను
ఏకాంతరామయ్య సాక్షాత్కారంకోసం
ఎక్కడో రుద్రాక్షమాలికలు త్రిప్పలేక
ప్రతి నరునిలో రామయ్యనే చూడాలని
శ్రుతి తప్పిన వీణను సరిచేస్తాను.

కష్టాలు నావి
కన్నీళ్ళు నావి
రేపు నాది
నా రేపుకు రూపమిచ్చే
మేధస్సు నాది
అందుకే నేను వర్తమానాన్ని
జ్వలించే వాస్తవాన్ని
నాకు ఈ రూపు మిథ్య
అని నాకెప్పుడూ అందాం హరిమధ్య.

"నాదేశం-నాప్రజలు": ప్రవచన కవిత

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

నడుస్తున్న చరిత్రని ఆధునిక మానవేతిహాసంగా రూపొందిస్తూ వచన కవితామార్గంలో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ చేసిన సరికొత్త ప్రయోగం 'నాదేశం—నా ప్రజలు'. ఎన్నోవిధాల విలక్షణ మైన కావ్యం యిది.

ఈ యుగంలో నాయకుడు శ్రమజీవి—కార్మికుడు, కర్షకుడు అయిన మానవుడు. మనిషిలోని సృజనాత్మకశక్తి, కార్మికునిలో అయినా కర్షకునిలోఅయినా, కవిలో అయినా, వేదాంతిలో అయినా, శాస్త్ర పరిశోధకునిలో అయినా, రాజ్యపరిపాలకునిలో అయినా, మౌలికంగా ఒకటే! దీన్ని మనం సాధారణంగా అంగీకరించం. సామ్యవాది అయినవాడూ లేక సమదర్శి అయినవాడూ తప్పక అంగీకరిస్తాడు. మానవుణ్ణి గూర్చిన యీ అద్వైత సమన్వయ దృష్టి "నాదేశం—నా ప్రజలు" కావ్యానికి ఆధారం.

ఆధునిక కావ్యాల్లో 'మానవత'కు యిచ్చే నిర్వచనంకాని, వివరణకాని, ఏదో ఒక రాజకీయ లేక సాంఘిక లేదా మనోవైజ్ఞానిక దర్శనం మీద ఆధారపడి వుంటోంది. శర్మగారు ఈ కావ్యంలో 'మానవత' కు ఔపనిషదికమైన, అద్వైత వేదాంతపరమైన నిర్వచనం యిచ్చారు. దానికీ, ఏవిధమైన 'వివ' భావాలకూ వైరుధ్యం వైషమ్యం లేదనె సత్యాన్నికూడా ఈ కావ్యంద్వారా వ్యక్తంచేశారు. వేదాంతాన్ని సాంప్రదాయికమైన వైయక్తికపు ఏకాంతశిఖరాలనుంచీ వర్తమాన సామాజిక మానవ జీవన భూములకు, భగీరథునిలాగ, తరలింపజేశారు. అందువల్ల 'గంగ'కు వచ్చిన లోటేమీ లేదు.

*"నేను ధాన్యంలోనుంచీ పుట్టాను, ధాన్యంకోసమే బతుకులాను, మరణించి ధాన్యంలోకే వెళ్ళిపోతాను" (ఒకటోసర్గ) కర్షకుడైన మనిషి వాక్యంలా తోపింపజేస్తూనే, సృష్టిగా రూపొందుతున్న తత్వాన్నిగూర్చి చెప్పే ఉపనిషద్వాణిని ధ్వనిస్తూ, రెండింటికీ అభేదాన్ని ప్రతిపాదించే దృష్టిలో, చమత్కారమైన శిల్పంలో ఈ కావ్యం ప్రారంభం అవుతుంది. శర్మగారు మొదట వ్రాసిన 'మండే సూర్యుడు' పద్యాలలోనే సూర్యుడు, మానవుని సృజనాత్మక శక్తికి ప్రతీక అయినాడు. ఆ ప్రతీక ఈ కావ్యంలోనూ, అలాగే స్వీకరింపబడింది. విలియమ్ బ్లేక్ వ్రాసిన 'ప్రవచన కవిత్వం' (**Prophetic poems**) లో మానవుని సృజనాత్మకశక్తిని 'కవిమనీష' (**poetic gen us**) అని వ్యవహరించాడు. అంటే కేవలం కవిత్వరచనాశక్తికాదు. సృష్టిలో సర్వత్ర గోచరమయ్యే సృజనాత్మకశక్తి యొక్క అంశగా కవితాశక్తిని సృష్టిశక్తికి ప్రతీక చేశాడు బ్లేక్, శర్మగారూ అలాగే చేశారు. సూర్యుడు, సూర్యకిరణాలు ఆ సృష్టి శక్తికి ప్రతీక. ఉపనిషత్తుల్లో గాయత్రికిగల ప్రాముఖ్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటే దీని స్వారస్యం విదితమవుతుంది. కావ్యంలో 'నేను', 'సూర్యుడు' ఒక్కటే. అయినా రెండుగా కనిపించి, ఒక్కటై, మళ్ళీ వేరవుతూ వుంటారు. ఒకటో సర్గ— "లేస్తోంది ఉషఃకాంతుల్లోనించి ఒక హస్తం!... నేను కళ్ళు తెరిచి, ఆవులిస్తూ లేస్తా" అని ప్రారంభం. తర్వాత "ఈ చేత్తోనేను ఏ అందాన్ని సృష్టించలేదు! ఏది ఈ భూమిమీద చేతికి లొంగలేదు! కాని ఈ చెయ్యి ఖాళీగానే వుండి పోయింది శాశ్వతంగా" అనడంలో 'నేను' 'సూర్యుడు' తాదాత్మ్యం చెంది సృష్టికర్తకూడా ధ్వనిస్తున్నాడు. ఇక్కడ సృష్టికర్తయై, సృష్టిలో అంతర్లీనమైకూడా సృష్టికి అతీతంగా వుండే తత్వాన్ని ప్రతిపాదించడమే కాకుండా, కార్మిక కర్షకుల శ్రమఫలితం వారికి దక్కకుండా పోతున్న నేటిసమాజవ్యవస్థ తీరుకూడా ప్రసక్తమైంది. కావ్యమంతా యిదేపద్ధతి.

కావ్యంలో శ్రామికుడు; మానవుడు, సూర్యుడు సృష్టికర్త ఒకరిలో ఒకరై, ఒక్కొక్కరూ వేరై, విభిన్న కంఠస్వరాలు పలుకుతూ వుంటాయి. *నడుస్తున్న చరిత్రను, మానవేతిహాసాన్ని కథనంచేసేందుకు కవి అవలంబించిన విలక్షణమైన శిల్పం యిది. కవితాత్మక దృష్టి, భావన, శిల్పము, ఇతివృత్తము ఒకదానితో ఒకటి కలిసి, వేరై, ఒకటి మరొకటిగా, చిత్ర విచిత్రమైన స్ఫురణలతో ప్రతి వాక్యానికి విశిష్ట కవితా గుణాన్ని బహుళ వ్యంజకత్వాన్ని సమకూర్చుతున్నాయి. వీటిని విశ్లేషించుకోవడం, వాక్యాల్ని మామూలు ఆలోచనా పద్ధతిలోకి తర్జుమా చేసుకోవడం పాఠకుని కృషి. ఒక వేళ అలా చేసుకోకపోయినా యిబ్బందిలేదు. కావ్యంయొక్క ఆస్వాదనలో లభించే అనుభూతి మేధాస్పృష్టం కాకుండానే నేరుగా హృదయంగమం అయ్యే లక్షణం ఈ కావ్యంలో పుష్కలంగా ఉన్నది. హృదయంగమం అయినదాన్ని అవసరమనుకుంటే వివేచించి విడమర్చుకోవచ్చు. అటువంటి వివేచనకు నిలిచే నిర్మాణ సౌష్ఠవం, తాత్త్విక బలం కూడా ఈ కావ్యానికి ఉన్నది.

ఉదాహరణకు ఒకటో సర్గను విశ్లేషించి చూద్దాం ఇందులోని ఇతివృత్త విన్యాసం యిలా వుంది—(1) సృజనాత్మక శక్తి, దాని పరివ్యాప్తమైన స్వరూప వివరణ—మానవుడు, కర్షకుడు, కార్మికుడు, నేతపనివాడు, రస్తాకూలీ, సైనికుడు, కవి, వ్యక్తి, నావికుడు, శిల్పి వగైరా—కాని సృష్టికర్త (శ్రామికుని) చెయ్యి ఖాళీగానే ఉండి

---

* **A Symphony of Voices.**

* తైత్తిరీయం : అన్నాద్ భూతాని జాయన్తే, జాతాని అన్నేన వర్ధన్తే...

పోతున్నది. ఇక్కడ వేదాంతపరమైన సత్యమూ, నేటి వ్యవస్థా లక్షణ నిర్దేశమూ కవి శిల్ప చమత్కారంవల్ల ఏకీభవిస్తున్నవి. (2) 'గడచిన చరిత్రలో నాకు తావులేదు. ఇప్పుడు నడిచే చరిత్రకు నీతిలేదు' అనే గొంతుక శ్రామికునిది. అంతలోనే 'నా బ్రతుకొక నున్న, కానీ నడుస్తున్నా' అనే గొంతుక ఆత్మధర్మ ప్రత్యాఖ్యానంతో దారి కోసం వెదికే నాగరకునిది. (**Self-alienated modern man**) ముగింపులో 'నేనుమాత్రం నడుస్తున్నా... రగిలే నా ఎర్ర కోరికే ఒక జెండాగా !' అనేగొంతులో పై యిద్దరూ సృష్టికర్తతో (సృష్టికి నాంది సంకల్పం) సమసించడం జరుగుతుంది. (3) 'క్షణాలు కేవలం కాలాన్ని అనుసరించే పరివారం కాదు, కొన్ని క్షణాలుంటాయి. యావత్తు మానవచరిత్రనూ మార్చగల మహత్తు ఉన్నవి' అనే కవి ప్రవచనంలో భవిష్యద్వాణి, క్షణానికీ అనంతానికీ జరిగే సంయోగమూ ధ్వనిస్తుంది. విప్లవానికి నాంది నాక్యమూ అదే అవుతుంది. నడుస్తున్న చరిత్రలో మార్పు ఎలా వస్తుంది? 'సూర్యుడు తేజస్వి అవుతున్నాడు. సుత్తులు కొడవళ్లలాంటి కిరణాలు మిలియన్ల ప్రదానం చేస్తున్నాడు' విప్లవం సృజనాత్మకశక్తియొక్క కాలానుగుణమైన స్వరూపం. 'విప్లవం ఎందుకు ?' అంటే విప్లవం తప్పదు అనే సమాధానం. (ఝంఝూమారుతాన్ని అడుగు నీకెందుకింత ఆవేశం అని) విప్లవం ఎలా వస్తుంది ? కవి (కాలాన్ని కాగితచేసుకుంటూ), శ్రామికుడూ (శిల్పంగా చెక్కి భూమిమీద నిలబెడతా), మేధావి (కోరిక గొంతెత్తి అరుస్తుంది, కొత్త శకాన్ని లోకంమీదికి విసిరేస్తుంది) నడుం కట్టుతారు, ఒకటౌతారు, చివరకు సృష్టిలీలా విలాసంతో (చతుర్భుజ పద్యాలతో) సృష్టికర్తే కవిగా కొత్త కావ్యాన్ని రచిస్తాడు. (4) ప్రకృతికి వసంతం వస్తుంది. సమాజం మారుతుంది. వ్యక్తి జీవితంలో అందం, ఆనందం ప్రవేశిస్తాయి. ఇది కల, ఇది ఆశ, ఇదే మానవుడు సృష్టించుకునే భవిష్యత్తు. ఇదే కావ్యం. కవిలో నిర్వేదం పోయి సంతోషం వెల్లివిరుస్తుంది ('కన్నీరు కార్చిన వెట్టు నా కలమీద పూలవాన కురిసింది' అంటాడు)

ఈ విశ్లేషణద్వారా కావ్య నిర్మాణాన్నీ, కావ్యతత్వాన్నీ స్పష్టంగా పులాకంగా గ్రహించవచ్చు నిజానికి ఒకటోసర్గలోని పథకమే రకరకాలుగా పునరావృత్తమై, విస్తృత మౌతుంది మిగతా సర్గల్లో. ఇది కావ్యంలో లయ. ఎర్తలాలుగా సర్గలు సాగిపోతాయి. నీటిలో చిన్నరాయి విసరినప్పుడు విస్తృతమయ్యే తరంగవలయాలులాగ యితివృత్తం సర్గనుంచీ సర్గకి విస్తరిస్తుంది. రెండో సర్గలో ఆది మానవుని దగ్గరనుంచీ జరిగిన చరిత్ర తాలూకు స్మృతి ధ్వనిస్తుంది. మూడో సర్గలో వర్తమానం, నగరజీవితం, దానినుంచీ పారిపోయే మానవుడు; వీడికి జరామరణాలే పరిష్కార మార్గాలా ? అన్న ప్రశ్న చరిత్ర తత్వాన్ని గూర్చిన జిజ్ఞాస, ఉన్నాయి. నాలుగో సర్గలో విప్లవ భావాలకు అంకురార్పణ జరుగుతుంది. కవి మనిషి ఆవేదనని, హృదయానుభూతిగా అవగాహన చేసుకుంటాడు. భూమి సూర్యుణ్ణి పునరుజ్జీవనంకోసం అర్థిస్తుంది. అయిదోసర్గలో విప్లవానికి దారితీసే దుర్భర పరిస్థితుల చిత్రణా, విప్లవానికి సన్నాహం ఉన్నాయి. ఆరో సర్గలో కవి ప్రజల్ని ఉద్బోధిస్తాడు, పరిస్థితుల్ని విమర్శిస్తాడు. మానవత్వంతో చెర్లాడేవాళ్లని దూషిస్తాడు, "నా మెదడులో భావాల అరణ్యాలకు నిప్పంటుకుంది" అంటూ వర్తమానవ్యవస్థకే నిప్పంటిస్తాడు. ఈ ఆరో సర్గ టి. ఎస్.ఎలియట్ 'వేస్ట్‌లాండ్' తో సరితూగే కవిత్వం. ఏడో సర్గలో ప్రకృతి జయిస్తుందన్న విశ్వాసం కవికి కలుగుతుంది. ఎనిమిదో సర్గలో ప్రకృతివిజయం ప్రేమ విజయంగా. మానవతా విజయంగా కవి దర్శించడంతో కావ్యం ముగుస్తుంది.

ఈ కావ్యం ఏ కోవకు చెందుతుంది? ఆధ్యాత్మిక వాదులకూ మార్మిక, భావకవులకూ, చరిత్రతో, విప్లవంతో, శ్రామికునితో అవసరం లేదు! వీటితో అవసరంఉన్న అభ్యుదయ కవులకూ, విప్లవ కవులకూ వేదాంతంతో బొత్తిగా పడదు! ఈ రెండు రకాలవారిదీ సంకుచిత దృష్టి తప్ప సమగ్రదృష్టి కాదని ఈ కావ్యం ప్రతిపాదిస్తున్నది. భారతీయ దర్శనమైన వేదాంతానికి కేవలం భారతీయ చారిత్రక, సాంప్రదాయిక పరిధుల్ని నిర్దేశించి దాన్ని అలా బంధించడానికి వీల్లేదంటున్నది ఈ కావ్యం. వేదాంతానికి ఉన్న సమగ్ర మానవతా దృష్టినీ, దాని విప్లవాత్మక శక్తినిగూర్చి ప్రతిభతో చాటి చెప్పిన ఆధునికుడు వివేకానందస్వామి. అయినప్పటికీ వేదాంత దృక్పథాన్ని గూర్చిన అపోహ తక్కువచూపూ, పాశ్చాత్యులు మనకు ఏళ్ల తరబడి సంక్రమింపజేసి వెళ్లిన వారసత్వం. దాన్ని వదుకోలేకపోతున్నాం. పాశ్చాత్య దర్శనాలతో పబ్బం గడుపుకోవాలని చూచే మనవాళ్ల మనస్తత్వంలో కేవలం అనుకరణ ప్రవృత్తి, సృజనాత్మకశక్తి లోపించడమే కనిపిస్తుంది. అంటే, నేడు రాజకీయ, సాంఘిక విప్లవాన్ని ప్రతిపాదించే సిద్ధాంతాలలో పథకాలలో శాస్త్రదృష్టి, ప్రయోజనాత్మకత శూన్యమని చెప్పడంలేదు! ఈ యుగంలో ఏ సిద్ధాంతమైనా శాస్త్రమైనా మౌలికంగా మానవతా దృష్టిమీదే ఆధారపడి ఉంటోంది. అటువంటి దృష్టితోటే మార్క్స్ దర్శనం రూపొందింది. ప్రపంచ వ్యాప్తమైంది. కాని ఆ మానవతాదృష్టి, సామాజికదృష్టి వేదాంతానికి లేదనుకోవడం పెద్దపొరపాటు. వివేకానందస్వామి ఒకచోట ఆధునిక యుగాన్నిగూర్చి, రాబోయే యుగం కార్మిక కర్షకయుగంగా, నాలుగవ వర్ణమైన శూద్రుల యుగంగా వివరించి చెప్పారు. సామాజిక పరిణామంలో బ్రాహ్మణులనుంచీ, క్షత్రియులనుంచీ, వైశ్యుల*నుంచీ విప్లవం ఏవిధంగా చరిత్రలో సామాజిక ఆధిపత్యాన్ని ఒక వర్గంనుంచీ మరోవర్గానికి చెందేలా చేస్తూ వచ్చిందో వివరిస్తూ ఇరవయ్యో శతాబ్దంలో శ్రామిక విప్లవాన్నీ, శ్రామికవర్గం ఆధిపత్యాన్నీ సూచించారు. మార్క్సిజమ్ రాక పూర్వమే వివేకానందుడూహించిన విప్లవం యిది. పోతే కవిత్వానికి కావలసింది శాస్త్రదృష్టికాదు. రాజకీయ పథకాలు

---

* ఈ వర్గ విభేదం సమాజంలో ఆ యా వర్గాల గుణ కర్మ విభేదాలనూ, ఆర్థిక ప్రతిపత్తినీబట్టి అది అర్థం చేసుకోవాలి. క్షత్రియులనుంచి వైశ్యులకు అంటే ఫ్యూడలిజమ్‌నుంచి కేపిటలిజమ్ అని అర్థం.

కావు. వాటికి మూలమైన. ఆధుని యుగధర్మాన్ని ఆకళించుకొన్న మానవతాదర్శనం వేదాంత దృక్పథంతో ఆధునిక మానవుని వైయక్తిక, సామాజిక వైక్లబ్యాన్ని ఆవిష్కరిస్తూ, శాస్త్రీయ రాజకీయ సమన్వయంతో విప్లవాన్ని ఆవాహనచేస్తూ ఈ కావ్యాన్ని నిర్మించిన శేషేంద్ర శర్మను ఆధునికుల్లో ఆధునికుడుగా అచ్చమైన భారతీయుడుగా అభినందించాలి.

ఇరవయో శతాబ్దపు మానవుణ్ణి ప్రకృతి నుంచీ, భగవంతుడి నుంచీ ప్రత్యాఖ్యానం (**Alienated**) చెందిన మానవుడిగా ఆధునిక సాహిత్యం చిత్రిస్తోంది, వేదాంతదృష్టిలో 'ప్రత్యాఖ్యానం' ఒక ఆభాస (**Appearance**) మాత్రమే! పాశ్చాత్యుల భావనవేరు. వాళ్లకు క్రైస్తవమతం తాలూకు పురిటివాసనలున్నాయి. బగవంతుడి ఆజ్ఞ నతిక్రమించి ఈడెన్ నుంచీ బహిష్కృతుడైన తొలిమానవుని సంప్రదాయాన్నే వాళ్లు అన్వయించుకుంటారు, మానవుణ్ణి తిరుగబడిన కొంటెపిల్లవాడిగా, దారితప్పినవానిగా చిత్రిస్తారు. కాని వేదాంత దృష్టితో చూస్తే మానవునికీ ప్రకృతికీ వైరుధ్యంలేదు; మానవుడి అజ్ఞానమే, అహంకారమే ఆతణ్ణి భగవంతుడి నుంచీ దూరం చేస్తున్నది. పాశ్చాత్యుల దృష్టిలో విధ్వంసం, ప్రళయం, విప్లవం అనేవి భగవంతుని కోపాలే, మనిషికి శిక్ష, లేకపోతే చరిత్ర పోకడ (**Process** వేదాంత దృష్టిలో అవి సృజనాత్మకశక్తియొక్క నిత్యనూత్నమైన విన్యాసం మాత్రమే. వేదాంత దృష్టిలో చరిత్ర ఋతువులకు మల్లే పునరావృత్తమౌతుంది. (పాశ్చాత్యులకు చరిత్ర క్రమపరిణామంచెంది అంతమౌతుంది. మార్క్సు కూడా చరిత్ర అంతాన్నే ఊహిస్తాడు.)

"కొత్త పిల్లలు ఉదయిస్తారు. కొత్త గర్భాలకూ కొత్త విత్తనాలకూ కొత్త కాంతివలయాలు విసిరే ముఖాలతో" కొత్త నాగరికతలల్లుతారు, చరిత్ర పేజీలకందిస్తారు, పేజీలు పెరుగుతుంటాయి· వాటి మీద నిర్దాక్షిణ్యంగా కాలపు గండ్రగొడ్డలి పడేవరకూ" (మూడో సర్గ) ఇది వేదాంతదృష్టి.

చరిత్ర పునరావృత్తమౌతుందని వర్తమానంలో సమస్యల్ని ఉపేక్షించడం వేదాంత దృష్టికాదు. ఇది వివేకానందుడే నొక్కి చెప్పాడు. నేటి సమస్యల్ని చిత్రించడంలో శర్మగారి కవిత్వం ఎన్నో కొత్తపోకడలు పోయింది. ఉక్తివైచిత్రిని సాధించింది.

"నీటి గాయాలు చెట్లగాయాలు పైర్లగాయాలు మీకు కనిపించవు. పొలాలూ నదులూ అరణ్యాలు వీరమరణం పొందిన ఆత్మలు" (ఆరో సర్గ) ఇది వాతావరణ కాలుష్యాన్ని (**pollution**) గూర్చి, సూపర్ ఎరువులతో పండించిన పంటల్ని గూర్చి.

"మీరు పలకా పుస్తకాలూ పట్టుకొని పోతూంటే బాబూ! మీరు శిలువలు మోసుకుపోతున్న బాలక్రైస్తుల్లా కనిపిస్తారు నా కళ్లకు" (ఆరో సర్గ) ఇది చదువును గూర్చి.

"మనుషులు తపస్సుచేసి ఒక పామును పుట్టించారు. విరివిగా ఓట్లనే ధాన్యపు గింజలువేసి పెంచారు. ఆ పాము చట్టాలనే గుడ్లు సక్రమంగా పెడుతుంది" — ఇది రాజకీయ వ్యవస్థను గూర్చి.

ఏడో సర్గలో ప్రకృతి ఆధునిక మానవుని ఆర్భాటాన్ని ఒక కంట కనిపెడుతోంది అంటాడు కవి :

"గాలిలో విమానంతో పోటీపడుతున్న ఆ పక్షి వట్టిపక్షి అనుకోకు, అది నీలి ఎత్తులమీద కూర్చుని లేస్తూ పడుతూ నడిచే మానవ నాగరకతల్ని పరికిస్తున్న ప్రాచీన పక్షి..." (ఏడో సర్గ) ★ఇక్కడ ఉపనిషత్తులోని రెండు పకులూ స్ఫురిస్తాయి. ఒకటి అహంత. రెండోది ఆత్మ. సమిష్టి మానవుని అహంత విన్యాసమే ఈ నాగరకత. దీన్ని పరికిస్తున్న సాక్షి ప్రకృతి. ప్రకృతి అంటే మానవుని ఆంతర ప్రకృతి కూడా. నాగరకత చెడినా ఆత్మవినాశం లేదు మనిషికి అనే విశ్వాసమే ఈ కావ్యంచివర వ్యక్తమైంది.

ఎనిమిదో సర్గలో ప్రసక్తమైన ప్రేమ — కవీ అతని గీతికా మనిషీ ప్రకృతీ, సూర్యుడూ భూమీ, ప్రియుడూ ప్రేయసీ, సృష్టికర్తా సృష్టి — వీళ్లమధ్య ఉండే సంబంధమే ప్రేమ.

"నా దేశం నా ప్రజలు అనుభవిస్తున్న బాధల గాథలు ... నా శరీరాన్ని వ్యథాస్వరఝురీ వేగంతో ప్రతిధ్వనింపజేస్తున్నాయి, కానీ నీ రక్తనాళాలు ఒరసిపారే గంభీర శాంతరసమే, నా క్రోధోన్మత్త ఉత్తమాశ్వాలకు కళ్లెం వెయ్యగలిగింది" అంటారు సూర్యునితో భూమి, సృష్టికర్తతో సృష్టి, కవితో అతని హృదయం.

అందుకే ప్రేమ నశించినంతకాలం, మానవత్వమూ నశించదు. రెండూ సమానార్థకాలు. అదే కావ్యంచివరి ప్రవచనం —

"ప్రేమఅగాధపులోతుల్లో మానవ పదవీగౌరవాన్ని పొందాను" అంటాడు. ఎవరు? కవి, విప్లవకారుడు, భగవంతుడు. అన్నీ ఒకటైన మానవుడు.

'నా దేశం — నా ప్రజలు' వచన కవిత్వం కాదు. ప్రవచన కవిత్వం. ఎత్తుగడలో, శిల్పంలో, దృక్పథంలో, ఇతివృత్తంలో, నిర్మాణ సౌష్ఠవంలో విలక్షణమైన నూత్న సృష్టి. ఈ కావ్యంతో తెలుగు కవిత్వం ఒక మలుపు తిరిగిందని చెప్పడం తొందరపాటుకాదనుకుంటాను. 'కృష్ణపక్షం' భావకవితకూ, 'మహాప్రస్థానం' అభ్యుదయ కవితకూ వేగుజుక్కలైనట్లే 'నాదేశం — నా ప్రజలు' తెలుగు కవిత్వాన్ని కొత్త దారుల్లో నడిపిస్తుందని నాకు తోస్తుంది,

---

* ముండక : శ్వేతాశ్వతర } ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షంపరిషస్వజాతే తయోరన్యఃపిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యోభిచాకశీతి

జైన పురాణములు - జైన సంప్రదాయములో రామకథ

శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

జైన పురాణములు అతి ప్రాచీనములు. జైన శాస్త్రములను శ్రుత స్కంధములందురు. దానిలో నాల్గు భాగము లున్నవి. వీటిని అనుయోగములందురు. వాటిలో మొదటిది ధర్మానుయోగము. దీనికే ప్రథమానుయోగమని పేరు. జైన పురాణము లన్నియు దీనిలో అంతర్గతములు. శ్రుత స్కంధమును విస్తృత పరచిన వారు తీర్థంకరులు. జైనపురాణములు తీర్థంకరుల దివ్యవాణినుండి వెలువడినవి. గణధరులు వాటిని గ్రహించిన వారిలో మొదటివారు. కైలాస పర్వతమున ఆది తీర్థంకరుని గణధరుడైన వృషభసేనుడు భరత చక్రవర్తికి వీటిని ప్రప్రథమంగా నివేదించినట్లును, చివరి తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుని గణధరుడైన గౌతముడు మగధాధిపతియైన శ్రేణికునికి విపులాచలమున వాటిని వివరించినట్లు కన్నడిగుల ఆదికవియైన మహాకవి పంపడు పేర్కొన్నాడు.

జైన పురాణములు ప్రధానంగా తీర్థంకరుల చరిత్రలు. ఇరువది నలుగురు తీర్థంకరుల చరిత్రలు ఇందున్నవి. 'వారి కాలాంతరమున వచ్చు. ఇతర మహాపురుషుల చరిత్రలు కూడా ఈ పురాణములలో చేర్చబడినవి. పన్నెండుగురు చక్రవర్తులు, తొమ్మిదిమంది బలదేవులు, తొమ్మిది మంది వాసుదేవులు తొమ్మిదిమంది ప్రతివాసుదేవులు ఇరువధి నలుగురు తీర్థంకరులతో చేరి వీరందరూ అరువది ముగ్గురు మహాపురుషులు. వీరికే శలాకా పురుషు లని పేరు. అరువది ముగ్గురు శలాకా పురుషుల చరిత్రను వివరించు గ్రంథమునకు మహాపురాణమని పేరు. ఒక్కొక్క తీర్థంకరుని చరిత్రను విడిగా పేర్కొన్నపుడు దానిని ఇతిహాసమని పేర్కొనవలసినదిగా ప్రభాచంద్రుడను ఆచార్యుడు తెలిపినాడు.

సంస్కృతమున జినసేన గుణభద్రాచార్యుని 'మహా పురాణము' నేడు లభ్యమైన జైన పురాణములలో మొట్టమొదటిగ నున్నది. హేమచంద్రుని త్రిషష్ఠి సలాకా పురుష చరిత్ర (క్రీ.శ. 1068) అను మహాకావ్య మొకటియున్నది. హేమచంద్రుడు ఘూర్జర చాళుక్యుల ఆస్థానమున మహాపండితుడు. ఆతడు పన్నెండవ శతాబ్దమువాడు. ఈ రెండు పురాణములలో వ్యత్యాసము కానవచ్చుచున్నది. మొదటిది దిగంబర సంప్రదాయము. రెండవది శ్వేతాంబర సంప్రదాయమునకు చెందినది.

జైన సంప్రదాయమున రామకథ పలువిధములైన మార్పులతో కానవచ్చుచున్నది. ప్రధానముగా మూడు పాఠాంతరములు కానవచ్చుచున్నది. ఈ మూడింటిలో ఒకటి వాల్మీకి రామాయణమును యథాతథముగా అనుసరించినది. తక్కిన రెండు రామాయణములు జైన సంప్రదాయమున కనుగుణమైన మార్పులతో రచింపబడినవి.

విమలసూరి రచించిన 'పవుమ చరిఅ' అను ప్రాకృత రామాయణము జైన సంప్రదాయమునకు చెందిన రామాయణములలో అత్యంత ప్రధానమైనది. ఇది క్రీ.శ. మూడవ శతాబ్దికి చెందినదన వచ్చును. దీనికి ముందే సంగ్రహ రామగాధ లున్నట్లు కానవచ్చినప్పటికీ పరిపూర్ణమైన రామకథా రూపమున వెలువడిన మొట్టమొదటి కావ్యము విమలసూరి 'పవుమచరిఅ'యే. ఈ రామచరితము కూడా ప్రధానంగా వాల్మీకి రామాయణమందలి ఘట్టములను పేర్కొనుచున్నది. రామజననము, సీతారామకల్యాణము, సీతా లక్ష్మణులతో కూడి వనవాసము, రావణునిచే సీతాపహరణము, హనుమంతుని రాయబారము, రామ సుగ్రీవుల కలయిక, లంకపై దాడి, రావణపరాజయము మరియు వధ, సీతాదేవిపై ఆరోపణలు, సీతావియోగము, లవకుశుల జననము మున్నగున వన్నియు ఈ జైన రామాయణమున పేర్కొనబడినవి. విమలసూరి జైన సంప్రదాయమునకు అనుగుణ్యముగా రామకథను కొద్ది మార్పులతో రచించాడు. వాల్మీకి రామాయణమున రామకథ అవతార సిద్ధాంతముతో కూడినది. బాలకాండము మరియు ఉత్తరకాండములందలి రాముడు విష్ణ్వంశ సంభూతుడు. ఇందు వైదిక బ్రాహ్మణ వాతావరణము ఎక్కువగా కానవచ్చును.

జైన రామాయణమున కూడ పురాణ లక్షణములు లేకపోలేదు. వాతావరణ మంతయు జైన సంప్రదాయమునకు చెందినది. విమలసూరి రామాయణమున దశరథుడు, జనకుడు, రావణ, సుగ్రీవ హనుమదాదులు వారి కుటుంబములోని వారందరూ జైన సంప్రదాయమునకు చెందినవారు. జైనమునులు, వారి ఆచార వ్యవహారాలు విస్తృతంగా ఈ రామాయణమున కానవచ్చును. మహావీరుని గణాగ్రణియైన గౌతముడు మగధరాజైన శ్రేణికునికి రామకథను చెప్పినట్లు పేర్కొనబడినది. శ్రేణికుడు తన సందేహములను గౌతమునకు నివేదించుకొన్నాడు. రావణునికి పదితల లుండెనా? అంతబలవంతుడైన

రావణుని సైన్యమును వానరులు నాశనము చేయుట సాధ్యమా? కుంభకర్ణుడు ఆరుమాసముల పాటు నిద్రించినది వాస్తవమా? నిద్ర మేల్కొన్న వెంటనే చేతికి చిక్కినదల్లా తినెడివాడా? విశాలమైన సముద్రమును ఆంజనేయుడు ఏరీతిగా దాటగలిగెను? ఇట్టి ప్రశ్నలను దృష్టిలో నుంచుకొని మహావీరునివల్ల తాను తెలుసుకొన్న రామకథను గౌతముడు శ్రేణికునికి నివేదించెను. ఆ కథ యిట్లున్నది:

దశరథుడు వినీతాపురాధీశుడైన అనరణ్యుని కుమారుడు. అతడు అపరాజిత, సుమిత్ర, సుప్రభ అను ముగ్గురు భార్యలతో సుఖముగా రాజ్యమేలుచుండెను. ఆసమయమున దశముఖుడు దిగ్విజయము గావించి అష్టదిక్పాలకులను జయించి లంకలో రాజ్యమేలుచుండెను. ఒకనాడు జ్యోతిష్కుడొకడు విభీషణుని సమీపించి జానకి కారణముగా రావణుడు దాశరథిచే సంహరింపబడునని చెప్పెను. దశరథునికి జనకునికి సంతానము కలుగకముందే వారిరువురిని చంపివేసినచో రానున్న విపత్తునుండి బయటపడగలనని భావించి వారిని వధించుటకై విభీషణుడు సైనికులను వినీతాపురముపైకి పంపును. ఈ విషయమును ముందే గ్రహించిన నారదుడు జనక, దశరథులకు తెలుపును. వారి ప్రతిమలనుంచి అచటనుండి పారిపోవలసినదిగా ఏర్పాటు చేయబడినది. విభీషణుని సైనికులు ఆ ప్రతిమలను ఖండించి విభీషణునికి నివేదించిరి.

దశరథుడు దేశాటనము చేయుచూ అలమటించుచుండగా 'కౌతుకమంగలమ'ను పురమున కైకేయి స్వయంవరవార్త విని అచటికి వెళ్ళును. అచట కైకేయి అతని మెడలో పూలహారము వేయును. అసంతుష్టులైన రాజకుమారులతో దశరథుడు యుద్ధము చేయును. ఆ యుద్ధమున కైక అతనికి తోడ్పడి అతనినుండి రెండు వరములను కోరును. కొంతకాలము తరువాత దశరథుడు, జనకుడు, తమ రాజ్యములకు తిరిగి వెళ్ళుదురు.

దశరథునికి అపరాజితవల్ల రాముడు, కైకేయివల్ల భరతుడు, సుమిత్రవల్ల లక్ష్మణుడు, సుప్రభవల్ల శత్రుఘ్నుడు జన్మింతురు. జనకునికి వైదేహివల్ల ఒక కుమారుడు ఒక కూతురు కవలపిల్లలుగ జన్మింతురు. ఆ కుమారునికి ఒక నిశాచరు డెత్తుకొనిపోయి రథనూపుర చక్రవాళ పురమున వదలివేయును. అచటి విద్యాధరరాజైన ఇందుగతి అనునాతడు ఆ బాలునికి ప్రభామండలుడను పేరుపెట్టి పెంచుచుండెను.

ఒకమారు కిరాతుల బృంద మొకటి జనక రాజధానిపై దాడి చేయును. జనకుడు దశరథునిసహాయము కోరును. రామలక్ష్మణులు స్వయంగా వెళ్లి ఆ కిరాతులను తరిమివేయుదురు. జనకుడు ఆనంద పరవశుడై జానకిని రామునకిచ్చి వివాహము చేయుటకు ఏర్పాట్లు కావించెను. నారదుడు కుతూహల చిత్తుడై సీతాదేవిని చూడదలచెను. కాని సాధ్యపడలేదు. ఆమెచిత్రమును తీసికొని వెళ్ళి రథనూపుర చక్రవాళ పురోద్యానమున పెట్టుకొని అచట విశ్రమించెను. ఎట్లో అచటికి వచ్చిన ప్రభామండలుడు ఆ చిత్రమును చూచి మోహితుడై మూర్ఛిల్లెను.

ఇందుగతి ప్రభామండలుని కోర్కెను తీర్చుటకు యత్నించును. అతని సేవకుడైన ఒక విద్యాధరుడు అశ్వరూపమున జనకరాజువద్దకు వెళ్లి అతనిని తన పై ఎక్కించుకొని ఆకాశమార్గమున ఇందుగతిని చేరును. జనకుడు సీతావివాహము రామునితో ఇదివరకే నిర్ణయింపబడినట్లు చెప్పెను. దానిపై ఇందుగతి దుర్జేయమైన వజ్రావర్త, సాగరావర్తములనెడి రెండు ధనుస్సులలో ఒక దానిని ఎత్తి విరచిన వానికి మాత్రమే సీతనిచ్చి వివాహము జరుపునట్లు నిశ్చయించి జనకుని వదలిపెట్టును. రాముడు వజ్రావర్తమును విరచి సీతను చేపట్టును. సీతారాములు వినీతాపురమునకు వెళ్ళిపోదురు. ప్రభామండలుడు తాను సీతను తప్పక తెచ్చెదనని పూర్వజన్మ స్మృతివల్ల సీత తన సోదరి యని తెలిసికొని పశ్చాత్తప్తుడై మరలును.

రాముని పట్టాభిషేకమునకు కైకేయి వరములు అడ్డువచ్చును. రాముడు సీతా లక్ష్మణులతో అడవికి వెళ్ళును. ఒకనాడు లక్ష్మణుడు అడవిలో తిరుగుచుండగా తళతళమని మెరయునట్టి ఖడ్గమొకటి కానవచ్చును. దానిని తీసికొని పొదలను ఖండించుచుండగా ఒక యువకుని శిరస్సు తెగి క్రిందపడెను. అది రావణుని చెల్లెలైన చంద్రనఖా (శూర్పణఖా) కుమారుడైన శంబూకుని శిరస్సు. ఖరుడు వాని తండ్రి. లక్ష్మణుడు ఖరుని ఎదుర్కొని అతనిని చంపివేయును. చంద్రనఖ సీతను అపహరింపవలసినదిగా రావణుని ప్రేరేపించును. రాముడు మాయాసుగ్రీవుని చంపి సుగ్రీవునికి అతని పత్నియైన సుతారిని అప్పగించును. ఆ తరువాత హనుమ ద్వీపాధిపతియైన హనుమంతుని లంకాపట్టణమునకు పంపెను. ఆంజనేయుడు సముద్రమును ఈదుకుంటూ వెళ్లి లంకను ప్రవేశించి రావణునికి హితము చెప్పెను. రావణుడు ఆంజనేయుని మాటలను మన్నించనందున యుద్ధము అనివార్యమాయెను. రాముడు కపిధ్వజులైన వానరుల సహాయముతో లంకను ముట్టడించును. రామ రావణ యుద్ధమున రావణుని శిరస్సును (పదితలలను కాదు) ఖండించినవాడు లక్ష్మణుడు. రాముడు మోక్షకామియైనందున ఈ హింసాకాండకు పూనుకొనలేదు. సీతతో సహా రామలక్ష్మణులు వినీతాపురమునకు తిరిగి వెళ్ళుదురు. రాముడు చాలకాలం ప్రజారంజకంగా రాజ్యమేలును.

కొంతకాలం తరువాత సీతను వదలివేయవలసి వచ్చును. పుండరీకిణి రాజైన వజ్రజంఘుని పత్నియైన శీలవతి ఆశ్రయములో సీతాదేవికి లవకుశులు జన్మించిరి. వారు పెద్దవారై రామునిపై యుద్ధమునకు వెళ్ళుదురు. నారదునివల్ల లవకుశులు తనబిడ్డలే అని తెలిసికొన్న రాముడు వారిని స్వీకరించును. లక్ష్మణునిపైగల వ్యామోహములో రాముడు వృద్ధాప్యమున కూడా తపో దీక్ష వహించడు. దీనిని గమనించిన దేవతలు లక్ష్మణుని ప్రాణములను తీయుదురు. రాముడు ఆరునెలలపాటు లక్ష్మణుని శవమును భుజంపై వేసుకొని అలమటించును. చివరకు నిర్వేద భావములో తపస్సుచేసి ముక్తి నందును.

జైన సంప్రదాయమున సృష్టికర్తయగు పరమేశ్వరునికి స్థానంలేదు. సిద్ధులు లేదా ముక్తులు అనబడేవారు పరమోన్నతులు. జైన ధర్మము అవతారతత్వము నంగీకరించదు. జైనరాముడు మహోన్నత పురుషుడుగా చిత్రింపబడినాడు. జైన సంప్రదాయము మేరకు

బలదేవులు, వాసుదేవులు, ప్రతివాసుదేవులు ప్రతి మహాయుగంలోనూ తొమ్మండుగురుచొప్పున అవతరింతురు. శ్రీరాముడు ఎనిమిదవ బలదేవుడు. లక్ష్మణుడు ఎనిమిదవ వాసుదేవుడు. రావణుడు ఎనిమిదవ ప్రతివాసుదేవుడు. రామలక్ష్మణులు వారియొక్క విశిష్ట స్థానములను బట్టి మహా వైభవ సంపన్నులుగా చిత్రింపబడినారు. ఇతర బలదేవులందరివలె రామునికి వేయిమంది భార్యలు. సీత, ప్రభావతి, రతినిభ మరియు శ్రీధామ అను నలుగురు అతని పట్టమహిషులు. లక్ష్మణునికి వాసుదేవులందరికివలె పదహారువేలమంది భార్యలు.

జైన రామాయణమున కపిధ్వజులైన వానరులే కాక రావణాదులు కూడా విద్యాధరులు. రావణుడు విద్యాధర వర్గమునకు చెందినవాడు. దశముఖుడు, దశగ్రీవుడు అను పేర్లనుగురించి జైన సంప్రదాయమున ఒక కథ చెప్పబడినది. రావణుడు పుట్టుకతోనే అత్యంత బలపరాక్రమములు కల్గినవాడు. పుట్టిన కొన్ని రోజుల తరువాత అతడు మంచమునుండి దూకి ఒక అద్భుతమైన కంఠహారమును పట్టుకున్నాడు. ఆ పవిత్ర కంఠహారము వంశానుగతంగా ఆ కుటుంబమునకు చెందినది. దానిని వేయిసర్పములు కాపాడుచుండినవి. ఇదివరకు ఏ విద్యాధరరాజును ధరింపని ఆ హారమును రావణుని తల్లి అతని మెడతో వేసెను. ఆ హారమున పొదిగిన నవరత్నములలో రావణుని శిరస్సు ప్రతిబింబించెను. ఆనాటినుండి రావణుడు దశముఖుడని పిలువబడెను.

విమలసూరి రామాయణము ప్రకారము భరతుడు రాజ్యమును త్యజించి సన్యాసము స్వీకరించుటకు సిద్ధపడును. భరతుని ఈ నిర్ణయమునుండి తప్పించుటకై కైకేయి భరతుని రాజ్యాభిషిక్తునిగా చేయమని కోరును. రాముని వనవాసము, అతనికి భరతునిపట్లగల ప్రేమను సూచించుటకే కాక, రాముని స్వయం నిర్ణయముగ కూడ పేర్కొనబడినది.

జైన రామాయణంవలె జైన భారతంకూడా వైదిక మహా

భారతగాధతో భేదించుచున్నది. వైదిక మహాభారతమునకు జైన మహా భారతమునకుగల వ్యత్యాసము ఆ యా పర్వముల కల్పనలో కాన వచ్చును.

వైదిక భారతము	జైనభారతము
(1) ఆదిపర్వము	(1) ఆదిపర్వము
(2) సభాపర్వము	(2) అన్వయపర్వము
(3) అరణ్యపర్వము	(3) వసుదేవపర్వము
(4) విరాటపర్వము	(4) కృష్ణోదయపర్వము
(5) ఉద్యోగపర్వము	(5) కంసవర్ధనపర్వము
(6) భీష్మపర్వము	(6) అభ్యుదయపర్వము
(7) ద్రోణపర్వము	(7) ప్రద్యుమ్నపర్వము
(8) కర్ణపర్వము	(8) ఇంద్రపర్వము
(9) శల్యపర్వము	(9) కల్యాణపర్వము
(10) సౌప్తికపర్వము	(10) అరణ్యపర్వము
(11) స్త్రీ పర్వము	(11) ఉద్యోగపర్వము
(12) శాంతిపర్వము	(12) యుద్ధపర్వము
(13) అనుశాసనపర్వము	(13) చక్రపర్వము
(14) అశ్వమేధపర్వము	(14) దీక్షాపర్వము
(15) ఆశ్రమవాసపర్వము	(15) సభాపర్వము
(16) మౌసలపర్వము	(16) నిర్వాణపర్వము
(17) మహాప్రస్థానికపర్వము	
(18) స్వర్గారోహణపర్వము	

జైనపురాణమందలి ప్రధానరసము శాంతరసమని పేర్కొన బడినది. శాంతరసము సాధుత్వముయొక్క అధిష్ఠాన గుణము. జీవితమునుపట్ల విశాలమూ, ఉదాత్తమూ అయిన భావము ఇందు కాన వచ్చును. నాల్గువిధములగు భావదీప్తిని పండితులిట్లు పేర్కొన్నారు.

"సత్వేషు మైత్రీం గుణేషు ప్రమోదం
క్లిష్టేషు జీవేషు దయాపరత్వం
మధ్యస్థభావం విపరీత వృత్తౌ
సదా మమాత్మాపి దధాతు దేవ"

ఈ రీతిగా జీవమైత్రి, గుణానురాగము, దయాపరత్వము మరియు మధ్యస్థభావము అనునవి సాధువృత్తి ద్యోతకములు. శాంతరసమును ఆదర్శముగా వుంచుకొని ప్రతివ్యక్తి ఈ నాల్గు గుణములను సాధించవలెనని జైనపురాణములు ఆశించును. బౌద్ధుల శరణాగమన త్రయముపలె జైనుల పంచనమస్కారములు ప్రసిద్ధములైనవి.

నమో అరిహంతాణాం
నమో సిద్ధాణాం
నమో ఆయర్యాణాం
నమో ఉవజ్ఝాయాణాం
నమో లోయే సవ్వసాహూణాం

అర్హంతులు, సిద్ధులు, ఆచార్యులు, ఉపాధ్యాయులు మరియు సాధువులు అందరికీ నమస్కారమని జైనులందురు. భారతీయ దర్శనములలో బౌద్ధ జైన మతములు అవైదికములని పరిగణింపబడు చున్నప్పటికీ భారతీయ తాత్విక విచారదృష్టితో చూచినపుడు అవి మహత్తరమైనవి. ఆదిశంకరుల అద్వైతము, ప్రచ్ఛన్నబౌద్ధమన్నట్లు, శ్రీ మధ్వాచార్య అద్వైతమును ప్రచ్ఛన్నజైన మన వచ్చునన్న అభిప్రాయమున్నదని డా. ద. రా. బేంద్రే పేర్కొన్నారు.

డా. యస్. రాధాకృష్ణన్ తమ **"Indian religious thought and modern Civilization"** అను వ్యాసములో జైన ధర్మమును గురించి వ్రాస్తూ **"Jainism Emphasises the Potential divine stature of the man and its teaching claims to be of Universal application"** అన్నారు.

జైనపురాణములు జగత్సాహిత్యమునకు అభ్యుదయానికి, ధర్మాచరణకు అంకితమైనవి. మానవ జీవితం త్రికరణశుద్ధమై మహోన్నతంగా సాగిపోవాలన్నదే జైనపురాణముల సందేశము.

ఆధార గ్రంథములు :

1) **The narrative of Rama in the Jain tradition by Sri H. C. Bhayani, in Ramayana Samiksha published by S. V. Univercity Tirupati.**

2) **Hindu civilization Part II— by Dr. Radha kumud mookerji,**

3) కన్నడ సాహిత్యనల్లి జైనపురాణగళు — డా. సదానంద నాయక. **M. A. PhD.** కర్ణాటక విశ్వవిద్యాలయ ప్రకటణ.

4) పుష్పదంతన రామకథా నిరూపణె — శ్రీ **M. V.** చిత్రలింగయ్య. 'జీవన' మాసపత్రిక, సంచికలు.

5) హమారీ సాంస్కృతిక్ ఏకతా— డా. రామ్‌ధారీ సిన్హా దినకర్.

కలగూరగంప

చాటు—మాటలు

'చాటువు'—యీ పదము మొదట అక్షరాన్ని తాలవ్యముగా పలికితే తత్సమం అవుతుంది. చివరి అక్షరం తీసివేసి మొదటి అక్షరాన్ని దంత్యముగా పలికితే తెలుగు అవుతుంది. 'చాటు+ఉక్తి= చాటూక్తి' రమ్యమైనమాట అని అర్థం. అదే మొదట ఇచ్చిన పదం. ఏమిటా రమ్యత. 'హాస్య' గర్భితము, లేదా నిందాగర్భితము కావడమే. నీతిని చెప్పడం, హెచ్చరించడం, మంచిని బోధించడం—యీ యీవత్తూ ధ్వనిస్తుంది. అదీ చాటువు. ఇది తత్సమం.

ఒక వ్యక్తిని గురించి ఇద్దరు ముగ్గురు పరోక్షంగా మంచిని మినహాయించి దొసగు చెప్పకోడం ('చాటు'గా చెప్పిన మాట అయి) 'చాటు మాట' అవుతుంది.

'చాటువు'నే జానపదులలో కర్షకులు మొదలైన నిరక్షరాస్యులు 'సాటవ'—అని వ్యవహరిస్తారు.

నేనీ వ్యాసానికి 'చాటు-మాటలు'—అని పేరు పెట్టటంలో అర్థాన్ని యిప్పుడు గ్రహించే వారవుతారు పాఠకులు.

చాటువులు సామాన్యంగా నవ్వును పుట్టించేవే ఎక్కువగా వినిపిస్తాయి. కొన్ని ఆ యా వ్యక్తుల అనుభవాన్ని సూచిస్తాయి. కొన్ని కొరడాతో కొట్టినట్టు చురుక్కున సరాసరి మనస్సుకే తగుల్తాయి.

చాటు మాటలు కేవలం దోషప్రకాశకములనే అంగీకరించాలి· కాని వాటికీ వ్యక్తి జీవితానికీ కొంత సంబధం ఉండకపోదు. అలాగే కొంత ప్రయోజనం కూడా ఉంటుంది. ముందు ముందు తెలుసుకొందాము.

సంస్కృత వాఙ్మయములో చాటువుల ప్రభావం చాలాఉన్నది సామూహికంగా చూస్తే యీ చాటువులు వాఙ్మయానికి ఒక విధమైన అంగపుష్టిని ప్రసాదించే రసాయనాలు అనే చెప్పవచ్చు. ఘున్ముందుగా సంస్కృత చాటువులను కొన్నిటిని వివరించి వీలైతే తెలుగు చాటువులలోకి వెళ్తాను. ఈ చాటువులు తెలుసుకోడం కూడా కొంత అవసరమని నా ఉద్దేశం. ఆ యా వ్యక్తుల మాటల చాకచక్యమేకాక అనుభవం కూడా మనం తెలుసుకొనే అవకాశం కలుగుతుందని నేననుకుంటాను.

ముందుగా ఒక మంచి చాటువు వివరిస్తాను.

మనలో చాలామంది తెల్లవారి లేవగానే అరచెయ్యి చూసుకుని కళ్లకి అద్దుకుంటారు. ఎందుకలా చేస్తారు? దానికి సమాధానం ఈ క్రింది శ్లోకములో ఉన్నది.

'కరాగ్రే వర్తతే లక్ష్మీః
కరమధ్యే సరస్వతీ
కరమూలే వసే ద్గౌరీ
ఇత్యేవం కరదర్శనం'—

అరచేతి వ్రేళ్ల కొనలలో లక్ష్మి, అరచేతిలో సరస్వతి, మణికట్టులో గౌరి ఉంటారు, ఆ ముగ్గురమ్మలనూ చూసి కళ్లకి అద్దుకుని లేవడం మంచిది — ఇందుకూ అరచెయ్యి చూసుకోడం — అయితే యీ విషయం సనాతన సంప్రదాయం పైగా దేవతలపైనా విశ్వాసం, గౌరవ బుద్ధీ ఉన్న ఆస్తికులకు రుచిస్తుంది. దేవునైనా—గురువునైనా—అనే పెద్దమనుషులకు దీని ఆవశ్యకతలేదు. ఈ పద్యం ఒక విధమైన ఆస్తికతనూ, జీవిత పారిశుద్ధ్యమునూ బోధిస్తుందని మనకి అర్థమవుతూంది..·····

*　　*　　*

'నమస్కార ప్రియో భానుః'-సూర్యుడు నమస్కరిస్తే సంతోషిస్తాడు. కనుకనే సూర్యనమస్కారాలు శక్తి ఉంటే స్వయంగా చెయ్యడం, లేకపోతే శక్తి ఉన్నవారిచే తనపేరుమీద చేయించడం ఒక ఆచారంగా ఉన్నదే. ఆరోగ్య కాంక్షతో సూర్యోపాసన చెయ్యాలనేది అందరికీ తెలిసినదే. నేటి 'సైంటిస్టులు' కూడా ఆతపస్నానం వగైరా ఆరోగ్యానికి మంచి సాధనం అని చెప్పడం అందరూ ఎరిగిన విషయమే. కనుకనే 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' సూర్యునివల్ల ఆరోగ్యం కోరేది అన్నారు పెద్దలు. అంటే శాస్త్రీయ పద్ధతిలో సూర్యోపాసన చేస్తే ఆరోగ్యం కలుగుతుందని భావం. చూడండి. మబ్బులు క్రమ్మి సూర్యకాంతి మందంగా ఉన్ననాడు తలనొప్పి, ఆకలి లేకపోడం, చురుకుతనం తగ్గడం ఇలాటి దుర్లక్షణాలు కలుగుతాయి. ఎండ చురచురమంటూ ఉన్ననాడు ఖణీగా ఆకలివేస్తుంది. బుద్ధి చకచకలాడుతుంది. ఇది సర్వులకూ అనుభవములో ఉన్నదే. ఏతావతా తేలిన సారమేమంటే 'నమస్కార ప్రియో భానుః' అన్న పెద్దల మాటను వేదవాక్యముగా మన్నించి ఆరోగ్య కరుడైన సూర్యుణ్ణి ప్రభాతకాలములో తప్పక సేవించాలి—అని. సూర్యుడు నమస్కార ప్రియుడైనట్టే బ్రాహ్మణుడు భోజన ప్రియుడు.

'బ్రాహ్మణో భోజన ప్రియః'—

ఎంతధనమిచ్చినా భోజనం తృప్తిగా పెట్టకపోతే బ్రాహ్మ

కుడు సంతోషించడు, భోజనం తృప్తిగా పెట్టి సంభావన సామాన్యంగా యిచ్చినా సంతోషిస్తాడు.

ఒక ధనవంతుడైన సంసారి సద్గృహస్థు కూతురికి ఘనంగా పెండ్లి చేస్తూ సదస్యంనాడు బ్రాహ్మణ సమారాధన చేశాడు. చుట్టుప్రక్కల ఊళ్లలోఉన్న బ్రాహ్మణులు కాస్త డొక్కశుద్ధి వేద శాస్త్రాలలో ఉన్నవారు సదస్యానికి వచ్చారు. సదస్యం, సంభావన, విందుభోజనం అయిపోయాయి. ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. బలీయమైన కారణంచేత ఒక బ్రాహ్మణుడు సదస్యానికి వెళ్లలేక వెళ్ళి వచ్చిన బ్రాహ్మణుణ్ణి భోజనం విషయమై ప్రశ్నించాడు. ఆయన సమాధానం చెప్పాడు. 'ఆ యిద్దరి సంభాషణ ఒక చాటు పద్యమయింది అవధరించండి ఎంత చమత్కారంగా ఉన్నదో!

'భోజనే తత్ర వార్తాకా?
వార్తాకాస్తత్ర భోజనే
న సంతియది వార్తాకా
వార్తా కా తత్రభోజనే-'

'వార్తాకా' అనె పదం పైపద్యములో ఎక్కువచోటుచేసుకున్నది. దాని వివరణ ఇది :

ముందు ప్రశ్నోత్తర విషయం, తాత్పర్యం చెప్తాను. అక్కడ భోజన విషయమై ఏమిటి సమాచారం? అని ప్రశ్న. భోజనంలో విశేషించి చెప్పవలసేది వంకాయకూర. అని సమాధానం. వంకాయ కూర లేకపోతే విందు భోజనములో అడగవలసేది ఇంకేముంటుంది అని నిర్ణయం... ...

పై పద్యములో మొదటి పాదములో 'వార్తా=సమాచారము,' కా=ఏమి ? – అని పదచ్ఛేదం చెయ్యాలి.

రెండవ పాదములో 'వార్తాకాః'=వంకాయలు' – అని ఒకే పదం చెప్పాలి.

మూడవపాదములో 'వార్తాకాః'=వంకాయలే
'నసంతియది'=లేకపోతే
తత్రభోజనే=అక్కడిభోజనం విషయమై
వార్తా–సమాచారము (అడగవలసేది)

కా ?=ఏమి ఉంటుంది ? – అని యిలాగ వివరించి చెప్పవలసి ఉంది. ఎన్నిఉన్నా వంకాయకూర లేకపోతే భోజనానికి విలువ లేదన్న మాట – .

వంకాయకూర అన్నికాయగూరలలో అగ్రశ్రేణికి చెందినదని కవి ఆ బ్రాహ్మణుని నోట మనకిచెప్పినట్టు గ్రాహ్యం. నిజమే! వంకాయ ఎన్ని రకాలుగానో వండి ఉపయోగించుకోవచ్చు. కనుకనే దాని రుచి బాగా తెలిసిన ఒక తెలుగుకవి

'వంకాయవంటి కూరయు,
పంకాపతి వైరివంటి రాజుం గలడే
శంకరునివంటి దైవము,
పంకజముఖి సీతవంటి పడతియు గలరే' –

అని వంకాయను అంత విశిష్టంగా పేర్కొన్నాడు. రుచికేకాదు. జ్వరపడి లేచినవారికి లేత వంకాయకూర పథ్యమని వైద్యులుకూడా చెప్తారు. స్వానుభవముతో చెప్తున్నాను. వంకాయకూర అంటే నాకు ప్రాణపదం... ...పై తెలుగు పద్యములో మిగతా మూడు పాదాలలో ఉన్న వారిని గూర్చి వివరించేది యిపుడుకాదు. తెలుగు చాటువులను చెప్పినపుడు చెప్తాను ... ...

ఇంకొకచాటువు :– మరీ రమ్యమైనది వివరిస్తున్నాను. చెన్నపట్టణానికి దక్షిణంగా ఉత్తరార్కాటు జిల్లాలో 'వందవాసి' అనే గ్రామం. ఆ గ్రామ నివాసం గురించి ఒకకవి

'సురాపగోదార జడావృతాయాం
ద్విజప్రభాహృద్యవనావృతాయాం
వసంతి కాశ్యామివ నందవాస్యాం
పునర్భవేషాం నరకావకాశః'–అని చెప్పాడు.

వందవాసి అనేగ్రామం పవిత్ర క్షేత్రమైన కాశివంటిది. దానిలో నివసించే వారికి నరకబాధ మరి ఉండదు–దీనిని ఎంత చమత్కారంగా చెప్పాడో చిత్తగించండి.

సురాపగ అంటే దేవనది (గంగ) ఆనదియొక్క జలముతో కూడియున్నదిన్నీ, ద్విజప్రభా=వేదవిద్వాంసుల తేజస్సులో, హృద్య= మనోహరములైన, వన=తోటలలో, ఆవృతాయాం=ఒప్పుచున్నది– కాశి.

సురాప=మద్యమును త్రాగువారు, గోదార=ఆవులను చంపు వారున్ను, జడావృతాయాం=జడులున్నూ, జడలుగలవారున్నూ అయిన వారితో కూడినదిన్నీ, ద్విజ ప్రభాహృత్=బ్రాహ్మణుల గొప్పదనాన్ని పోగొట్టే, యవన=మహమ్మదీయులలో, ఆవృతాయాం=కూడియున్నది –అయిన వందవాసి–పదశ్లేషతో వందవాసికి యీఅర్థం వస్తుంది. తప్పత్రాగి మత్తెక్కి, గోమాంస భక్షకులై బ్రాహ్మణ ద్రవ్యాన్ని గుంజుతూ సుదీర్ఘ జటాధారులై ప్రత్యక్ష యమదూతల్లాగా క్రూరంగా సంచరిస్తూన్న మహమ్మదీయులుగల వందవాసిలో నివసించే వారికి మరి నరకబాధలేదు–అంటే ఇక్కడే నరకయాతన అనుభవిస్తున్నారని భావం. వందవాసి భూలోక నరకం–అని ధ్వని, చూశారా

ఎంత చమత్కారంగా ఎంత ఘాటుగా చెప్పాడో యీ చాటువు! యిది కిందటి శతాబ్దములో పుట్టిన చాటువు. యీనాడు వందవాసి కాస్త నాగరకంగా మారి ఉండవచ్చు.

'జడావృతాయాం' అనే పదములో కాశిని గురించి చెప్పినపుడు జలావృతాయాం అని లకారము చెప్పుకోవాలి. 'లడ' లకు భేదం లేదని సంస్కృత వ్యాకరణం చెప్పిన పెద్దలు అనుశాసించారు జలనిధి, జడనిధి అని రెండువిధాలా సముద్రానికి చెప్పవచ్చు. ప్రయోగాలుకూడా ఉన్నాయి. వ్యాసం పెరుగుతుందని ఉదాహరించలేదు.

వందవాసిలోఉండే మహమ్మదీయులను గురించి చెప్పినపుడు 'జడ' అని చెప్పాలి. జడులతో కూడుకున్నది అని చెప్పవచ్చు. పెద్ద పెద్ద జడులు కలవారు అనిన్నీ చెప్పనచ్చు. ఇది సాహిత్యానికి సంబంధించిన విషయం కనుక కాస్త సాహితీ ప్రియులను మనసులో ఉంచుకుని చెప్పవలసి వచ్చింది.

పైకి చాపస్తంగా కనిపించినా యీలాటి విషయాలు తెలుసుకొనడములో అనర్థం ఏమీ లేదని నా ఉద్దేశం. అందుకే యీలాటివి వ్రాయడానికి ఉపక్రమిస్తూఉంటాను. నాలుగున్నర దశాబ్దాల నా రచనానుభవములో ఈలాటివి చాలా సంపాదించి ఉంచాను. కాని పత్రికవారు ఓపికగా ప్రచురించాలి. పాఠకులు ఆమోదించాలి. లేకపోతే యిదంతా అరణ్య రోదనమే అవుతుంది. లేదా 'జీర్ణ మంగే సుభాషితమ్' అన్నట్లేనా అవుతుంది. నేనువ్రాసే చాటువులకు ఇది నాంది. అంటే అవసరమైవేద్యం.

— *శ్రీ యామిజాల పద్మనాభ స్వామి.*

శ్రీమతే హయగ్రీవాయ నమః

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని మనువంశ పురాణము

ఆంధ్ర కవీంద్రులలో అగ్రగణ్య శ్రేణికి చెందిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు బహు ప్రబంధ నిర్మాత. ఆయన తాను విరచించిన గ్రంథములను తన శృంగార శాకుంతల పీఠికా పద్యములలో దెలిపియున్నాడు. ఆ పద్యము—

సీ. "రచియించినాఁడవు రమణీయ వాగ్గీతి
నవరసదర్పణం బభినవముగ
బలికినాఁడవు తేటపడఁజేసి నారదీ
యము సత్కవిశ్రేణి యాదరింపఁ
జెప్పినాఁడవు శేముషీ విశేషంబున
మాఘమాహాత్మ్యంబు మంజుఫణితి
గావించినాఁడవు ఘనబుద్ధి మానసో
ల్లాససారము సముల్లసితశయ్య

తే. భారతీతీర్థ యతిసార్వభౌమ గురుకృ
పాతిశయలబ్ధ కవితా విభూతి గలిగి
గౌరవముఁ గాంచినాఁడవు కవులచేత
విపులచాటూక్తి నిర్నిద్ర వీరభద్ర..."

ఈ పద్యములో దెలిపినవి నాలుగు గ్రంథములు— 1 నవరస దర్పణము. 2 నారదీయము, 3 మాఘమాహాత్మ్యము, 4 మానసోల్లాస సారము. ఇవి అన్నియు చిరకాలము నుండియు దుర్లభదశ నొందినవి. ఇకను "శృంగార శాకుంతలము. 2 జైమిని భారతము, 3 మనువంశ పురాణము అను మూడు కృతులు మిగిలియున్నవి. ఈ మూడును ముద్రితములై సూర్యాలోక భాగ్యము నొందినవి. మొదటి రెండును (శృంగార శాకుంతలము జైమిని భారతములు) పలుతావుల పలుముద్రాశాలలయందు పలుపర్యాయములు ముద్రణము నొంది సాహితీసేవక లోకములో చాల పేరు కలిగియున్నవి. ఇకను మూడవదియగు మనువంశ పురాణము చాలకాలమునాడు ఒక్క పర్యాయము మాత్రము ముద్రితమైనది. ఏమి గ్రహవైపరీత్యమో కాని ఈ ముద్రిత గ్రంథము కూడా నేడు ఏ విద్వాంసుని వద్దను లేని స్థితి నొంది అజ్ఞాత వాసము గాంచినది. ఈ ముద్రితమనువంశ పురాణ గ్రంథము బహుకాలము నాడు (ఇప్పటికి సుమారు 70—80 యేండ్లనాడు) అచ్చైనది — ముద్రాపకులు మా పితామహచరణులయిన షడంగ వేదజ్ఞ శ్రీమాన్ కళత్తూరు విక్కాల రాఘవాచార్యుల వారికి (అట్టలోపల విడికాగితనుమీద పేరు వ్రాసి) యొసంగినది ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా కలికివాయ గ్రామములో మాతండ్రిగారు విద్యారణ్య పంచానన విద్యావాచస్పతి శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యుల వారు మా యింటిలో స్థాపించిన మా సొంత పుస్తక భాండాగారములో నుండినది.

మా అన్నగారు పండిత శ్రీమాన్ విక్రాల రాఘవాచార్యుల వారు నేను మా.భాండాగారమును పంచుకొనునప్పుడు ఆ గ్రంథము శ్రీమాన్ మా అన్నగారి భాగమునకు చేరినది. మా అన్నగారు పరమపదించిన తర్వాత వారికి చెందిన ముద్రితా—ముద్రిత—తాళపత్ర గ్రంథములలో కొన్ని పూర్తిగ చెదలుపట్టి చెదలు మట్టి ముద్దయైపోయి, మఱికొన్ని కొంత కొంత చెదలు తిని కొంచెము మిగిలియుండి పరిహృతములైనవి. వాటిలో చాల భాగము చెదలుపాలయి. కొలదిగ మిగిలియున్న ఒకటి—రెండు గ్రంథములు కాకినాడలో రామకృష్ణకవులు ముద్రించిన సిద్ధిరాజు తిమ్మభూపర ప్రణీతమైన 'పరమయోగి విలాసము" వంటివి కుప్పలో జూచి నేను ఏఱుకొని వచ్చి యుంచుకొనినాను. ఈ మనువంశ పురాణము యొక్క స్థితి యేమియాయెనో ఎఱుంగశక్యము కాకున్నది,

ఈ మనువంశ పురాణాది కర్తయైన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు మా కలికివాయ ప్రక్కయూరైన కలికివాయ బిట్టగుంట గ్రామవాసి కనుక ఈ వడుమ నీయనను గూర్చి యొకవ్యాసము వ్రాయ నెంచి అభ్యమానములైన ఈతనిపైమూడు ప్రబంధములలో మనువంశ పురాణమును జూడ గుతూహలముతో సంవత్సరము నుంచి పలుతావుల పుస్తక భాండాగారములం దిరిగి యటను గాంచక సాహితీ సేవకులయిన అనేక మిత్రులతో ముఖాముఖిగాను లేఖల ద్వారాను సంప్రతించియు దీని స్థితి నెఱుంగక–మాయింట నున్న 110 (నూటపది) సంవత్సరముల నాటినుండి పలుమాఱులు పలు ముద్రాశాలలలో ముద్రితములయిన (నాభాగునకు జెందిన) గ్రంథ సూచిక (కేటలాగు) లను సుమారు నలువదింటివి–దేనియందైనను దీనిపేరు కనుపించినచో దెప్పించుకొన నుద్దేశముతో జూచితిని. కాని పేరును కూడా చూడనోచుకొననైతిని. చివరకు 10–12 దినముల నాడు విశ్వదాత, దేశోద్ధారకులయిన శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులవారు (ఆంధ్రపత్రికా– భారతీ సంపాదకులవారు) 1929 సం.రములో ప్రచురించిన ఆంధ్ర వాఙ్మయ సూచికయందైనను దీనిపేరు చూడగలుగుదునేమోయని చూచితిని. అందు 146 వ పుట ముద్రిత గ్రంథముల పట్టికలో నీమనువంశ పురాణ విషయ మిట్లున్నది.

గ్రంథము		గ్రంథకర్త
మనువంశ పురాణము		పిల్లలమఱ్ఱి పినవీరభద్ర కవి
విషయము	ఛందస్సు	ముద్రణ కాలము
పురాణము	పద్యము	.1898

అని. అందే మఱల ముద్రిత గ్రంథముల పట్టికయందును "పినవీరభద్రకవి–పిల్లలమఱ్ఱి" అను పేరుక్రింద పైమూడు గ్రంథములు పేర్కొనబడినవి. (శృంగార శాకుంతలము శకుంతలా పరిణయ మని కలదు. ఎట్లైనను ఒకటియే) ఆంధ్రవాఙ్మయ సూచికలో దెలుపబడిన మనువంశ పురాణ ముద్రణకాలము పైన నేను తెలిపిన ముద్రణకాలము 5–6 సంవత్సరములు వారగ సరిపడి యున్నది.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడంతటి పూర్వ మహాకవి రచియించిన యిట్టి ప్రబంధ రత్నము అంతరించి పోకుండ ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారు (సంపాదించి పునర్ముద్రణము గావించి ఆంధ్ర భాషా సేవకుల కానంద మొనర్చెదరు గాకయని కోరుచున్నాను.

చెన్నపుర ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములో పోచిరాజు వీరనయను మఱియొక కవి రచించిన మఱియొక "మనువంశ పురాణ" ప్రబంధము ఉన్నటుల కనుపించుచున్నది.

—శ్రీ వ్రక్కాల శేషాచార్యులు.

1974 భారతిలో వచన కవితలు– ఒక పరిశీలన

1974లో వెలువడిన మొత్తము పండ్రెండు సంచికలలోను ప్రచురింపబడిన వచన కవితల సంఖ్య ముప్పదినాలుగు. ఈ ముప్పదినాలుగు కవితలను రచించిన రచయితల సంఖ్య ఇరువది నాలుగు రచయితల పేర్లు మరియు కుండలీకరణములందు వారి కవితల పేర్లు ఇస్తున్నాను. పరిశీలనా సౌలభ్యం కొరకు గేయ కవితలను కూడా వచన కవితలగానే పరిగణించాను.

1. ముదిగొండ శివప్రసాద్ (పరిమేయం, భావయానం, అక్షరాంశ)
2. కె. శివారెడ్డి (కవరు, పిలుపు, అనలధ్వజం)
3. వి. మోహనప్రసాద్ (పేరులేని పాప, సహజా ఓ సహజా!, జోలగోల)
4. పణతుల రామచంద్రయ్య (సీమోల్లంఘన, కిటికీ)
5. సోమసుందర్ (జీవనౌక, అతిథులు)
6. గడియారం శేషఫణిశర్మ (మౌనవ్యాఖ్య–కాంతిభిక్ష, మధుదీక్ష)
7. పులికంటి కృష్ణారెడ్డి (యువతాండవం, వడిశెల)
8. నెల్లుట్ల వేంకటేశ్వరరావు (అసిధార)
9. కె. యస్. వి. నరసింహం (నువ్వందుకోలేని లేఖ)
10. కేతవరపు రామకోటిశాస్త్రి (వేల)
11. డా. తంగిరాల (నిప్పులకోట)
12. పోచిరాజు శేషగిరిరావు (అరవిందార్చన)
13. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ (గది)
14. వసంతరావు వేంకటరావు (చావంటే భయమెందుకు)
15. సీరపాణి (ధ్వంసరచన)
16. మాదిరాజు రంగారావు (చీకటి వెలిగించిన వార్త)
17. అద్దేపల్లి రత్నాజీరావు (బ్రతకాలి)
18. డా. బొడ్డుపల్లి పురుషోత్తం (మన సంస్కృతి)
19. నూతలపాటి గంగాధరం (వెలుగులోనికి)
20. తిరుమల రామచంద్ర (నేనొక ఇంద్రచాపాన్ని)
21. కళాధర్ (నిరీక్షణ)
22. వైవియల్యాన్ (ది ట్రాజెడి)
23. జి. వి. సుబ్బారావు (స్వరలహరి)
24. వక్కలంక వెంకటకృష్ణారావు (అసంపూర్ణ చిత్రం)

వీరిలో మూడేసి కవితల రచించినవారు ముగ్గురు. రెండేసి

కవితల రచన చేసినవారు నలుగురు. మిగిలిన పదిహేడుమంది ఒక్కొక్క గేయం చొప్పున రచించారు.

నా పరిశీలనలో ముప్పదినాలుగు గేయాల్లోను పన్నెండు గేయాలు బాగున్నాయనిపించాయి. అవి 1. పరిమేయం, 2. అసిధార 3. సీమోల్లంఘన, 4. బ్రతకాలి, 5. ధ్వంసరచన, 6. భావయానం, 7. సహజా ఓ సహజా! 8. వెలుగులోనికి, 9. మౌనవ్యాఖ్య కాంతిభిక్ష, 10. అక్షరాంశ, 11. ది ట్రాజెడి, 12. అసంపూర్ణ చిత్రం వీటి అన్నింటిలోను భావయానం అసంపూర్ణచిత్రం చాలా చక్కటి వచనకవితలని నా అభిప్రాయం. ఇతరుల దృక్పథంలో ఇంకొన్ని ఇంకా మంచి రచనలుగా తోచవచ్చు. అప్పుడు నా అల్పత్వానికి మన్నించమని కోరుచున్నాను.

శ్రీ ముదిగొండ శివప్రసాద్ "పరిమేయం" చక్కటి భావాల పొందిక. ఇందులో ఒక ప్రశ్న—

నిన్నా—రేపు. తెలియని నాకు
'నేడు' — 'ఇప్పుడు' — 'ఇక్కడ' ఈ కాలఖండంలో ఉపాధి
ఏమిటిది?

వెల్లుట్ల వేంకటేశ్వరరావుగారి 'అసిధార'లో స్వాతంత్ర్యానికి ఓమంచి నిర్వచనం వుంది.

స్వాతంత్ర్యం
కామధేనువూ కాదు,
కల్పవృక్షమూ కాదు.
సాగుచేస్తే ఫలితమిచ్చే
భూమాత!
సక్రమంగా పఠిస్తే కాంతినిచ్చే
భగవద్గీత!!

'సీమోల్లంఘన' అన్న కవితలో పణతుల రామచంద్రయ్యగారు నేటి వ్యవస్థను విడనాడాలని భావించారు. ఈనాటి సాంఘిక వ్యవస్థపై అసంతృప్తిని వ్యక్తపరిచారు. నేటి రచనల్లోని సాధారణ బలహీనత ఏమిటంటే నేటి వ్యవస్థ సరిలేదంటూ విమర్శిస్తారు. మరో ప్రపంచాన్ని సృష్టించాలంటారు. ఆ ప్రపంచానికి అర్థం మాత్రం సక్రమంగా నిర్వచించరు. మార్పురావాలనడంకన్నా, ఎలాంటి మార్పు అనే దానికన్నా, మార్పు ఎలా సాధించడం అన్నది చాలా అవసరం 'బ్రతకాలి' అన్న కవితలో అన్నే సర్ల్లి రత్నాజీరావు . . కూడా ఈనాటి జీవితంపై పూర్తి అసంతృప్తిని ప్రదర్శించారు,

సీరపాణిగారు 'ధ్వంసరచన' అన్న కవితలో ఆశాజీవులకో చక్కటి ఉపమానం నిర్మించారు,

ఆశయజ్యోత్స్నల అన్వేషణలలో
ఇరుల ఉరులలో తగుల్కొన్న
ఈ ఆశాజీవులు
విశ్వరచయితచేతిలో
ఔచితిని కోల్పోయినపాత్రలు

ముదిగొండ శివప్రసాద్‌గారి 'భావయానం' చాలా మంచి రచన. పేరుకు తగ్గట్టు చక్కటి భావాల పొందిక. చలనమూ, అచలమూ, జీవమూ, నిర్జీవమూ - అన్నీ ఒక్కో భావం అంటారు.

'సహజా ఓ సహజా!' అన్న కవితలో 'డెజర్ట్ బోతల్' అన్న పద ప్రయోగం హాస్యాన్ని కదిలించింది.

నూతులపాటి గంగాధరంగారి 'వెలుగులోనికి' మనిషిలోని ఆత్మవిశ్వాసానికి ప్రతీక, ఆరోగ్యకరమైన రచన, నేటి సమాజానికి అత్యవసరమె నది.

"చీకటినుంచి వచ్చినా
చీకటిలోకాని వెలుగులోకి నడిపిస్తాను"

మౌనవ్యాఖ్య : కాంతి భిక్ష రెండు గేయాలనుకొంటాను. ఒకటిగానే ప్రచురించారు. ఉషోదయంలో చీకటి హరించిన దనటంలో భవిష్యత్తుపై మంచి నమ్మకం వుంది.

'అక్షరాంశ' అన్న కవిత బాగుంది. అక్షరము ఒక సజీవ చైతన్యమూర్తి ? రసానందగాత మని అన్నారు కవి.

'ది ట్రాజెడి' అన్న కవితలో అశ్రుల ప్రతిరూపాన్ని విరిసే దిరిసెన పుష్పం అని అనటంలో చక్కటి సమయస్ఫూర్తి గోచరిస్తుంది.

'అసంపూర్ణచిత్రం' అన్న కవిత చాలా మంచి రచన. జీవితం ఎప్పటికీ అసంపూర్ణ చిత్రమే అందుకే "ఎడతెగకుండా పయనిస్తాను, ఎడపక ఎపుడూ అన్వేషిస్తున్నాను' అని అంటున్నారు రచయిత—

రచనలో వైవిధ్యం కనిపిస్తూవుంది. విభిన్న కోణాల్లో పరిశీలించి ప్రచురణకు ఎన్నికచేసిన సంపాదకవర్గం అభినందనీయులు. . . . వాదానికి దోహదం కలిగించే రచనలు . . . . రచనల ప్రచురణకు భారతి సంపాదకవర్గం . . . . స్తాను. పరిశీలనా సౌలభ్యం కొరకు, విమర్శకులకు సహాయపడగలదని

పుద్దేశ్యంతో అకారాదిక్రమము ననుసరించి వచనకవితలపేరు—రచయితపేరు—ప్రచురింపబడిన మాసము- ఆ సంచికలో అది ప్రచురింపబడ్డ పుట సంఖ్య—వరుసగా ఇస్తున్నాను.

—శ్రీ నాయుని గురుశేఖరమూర్తి

గ్రంథ విమర్శలు

శిశుపాలవధ మహాకావ్యము

(ఆంధ్రమాఘము)

[గోపీనాథ వేంకట కవీంద్ర ప్రణీతము. డెమ్మీ సైజు 88 + 320 పుటలు. వెల రూ. 15. లభించుచోటు శ్రీమతి గోపీనాథం వసుంధరాదేవి, C/o శ్రీ గాడేపల్లి రాఘవయ్య 40/802–1ఎ నెహ్రూ నగర్, కర్నూలు.

సంస్కృత భాషలో ప్రావీణ్యం సంపాదించగోరేవారు విధిగా పంచకావ్యాలను చదువుతారు. వాటిలో మాఘకవి రచించిన శిశుపాల వధ మహాకావ్యం ఒకటి. దీనికి మాఘకావ్యమనే ప్రసిద్ధి. సంస్కృతంలోని కావ్యనాటకాదులకు ఏదో ఒక విధంగా అనువాదాలు కొన్ని శతాబ్దాల క్రిందటనే వచ్చినా ఈ మాఘకావ్యానికి మాత్రం అనువాదాలు రాలేదు. తొలి అనువాదం శ్రీ గోపీనాథ వేంకట కవిగారిది. ఇటీవల మాత్రం కొన్ని వచ్చాయి.

వెంకటకవిగారు గత శతాబ్ది చివరిభాగంలో సుప్రసిద్ధ విద్వత్కవులు. తిరుపతి వెంకటకవుల ప్రశంసలను అందుకొన్న మహాకవి. సంస్కృతాంధ్రాలలో ఉద్దండపండితులు. సర్వజన గ్రాహ్యమైన కవితలోనే కాకుండా ప్రౌఢ కవిత్వంలోనూ, బంధ కవిత్వంలోనూ కూడా నిపుణులు. వాల్మీకిరామాయణానికి యథామూలంగా వచ్చిన అనువాదాలలో వీరి అనువాదం ప్రసిద్ధి పొందినది. భాస్కరరామాయణం తర్వాత పేరుపొందిన రామాయణాలలో ఇదే మేలైనది. తక్కినవి దీని తర్వాత చెప్పదగినవి మాత్రమే! వెంకట కవిగారు వెంకటగిరి రాజావారి సంస్థానంలో ఉండి ప్రభువుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. రామాయణాన్నేకాక శ్రీకృష్ణ జన్మఖండం, బ్రహ్మానంద శతకం మున్నగు గ్రంథాంతరాలను రచించారు. వీరి రామాయణం తర్వాత చెప్పదగిన రచన వీరిశిశుపాలవధ మహాకావ్యం.

ప్రాచీనాలైన సంస్కృత పద్యకావ్యాలు, గద్యకావ్యాలు తెలుగులో చంపూ పద్ధతిని గద్య పద్యాత్మకములుగానే అనువదించ బడడం పరిపాటి. ఆ పద్ధతి ననుసరించే ఈ గ్రంథమున్నూ గద్య పద్యాత్మకంగా కూర్చబడింది. పద్య సంఖ్యకంటె గద్యసంఖ్య చాలా తక్కువ. సంస్కృతంలోని మాఘకావ్యం "సర్గ బంధో మహాకావ్య" మనే లక్షణం ప్రకారం సర్గలుగా విభజించబడింది. అనువాదంలో ఆంధ్ర సంప్రదాయాన్ననుసరించి ఆశ్వాస పద్ధతి అనుసరింపబడింది. మూలంలోని ఇరవై సర్గలు ఇందులో నాలు గాశ్వాసాలుగా విభజించబడినవి. ఈ గ్రంథం కవిగారి పోషక ప్రభువులు, వెంకటగిరి సంస్థానాధీశ్వరులు అయిన వెలుగోటి గోపాలకృష్ణ యాచేంద్రులకు అంకితమియ్యబడింది. గ్రంథాదిని దేవతా ప్రార్థన, కృతిపతి వంశాది వర్ణన, షష్ఠ్యంతాలూ కూర్చబడినవి.

శిశుపాలవధ కావ్యంలో కథాంశం తక్కువ. వర్ణన భాగమే అధికం. నారదముని శ్రీకృష్ణునివద్దకు వచ్చి ఇంద్ర సందేశం తెలపడం, ఉద్ధవ బలరాములతో శ్రీకృష్ణుని మంతనం, ఇంద్రప్రస్థ ప్రయాణం, సభాగృహ, రాజసూయ వర్ణనలు, సభా సంక్షోభం, యుద్ధప్రారంభం, శిశుపాలవధ ప్రధాన కథాంశాలు. మహాకావ్యంలో ఉండవలసిన అష్టాదశ వర్ణనలూ ఇందులో విపులంగా కానవస్తాయి.

శ్రీ వేంకట కవిగారు ప్రాచీన కవుల శ్రేణికి చెందినవారు. గత శతాబ్దిలో ఉండిన కవులలో అగ్రేసరులు. భారత, భాగవతాలతో పాటు వారి రామాయణం పురాణ పఠనానికి ఉపయోగించబడడమే వీరి కవితా ప్రాశస్త్యానికి తార్కాణ.

అనువాదం మూలానికి అన్యూనానతిరిక్తంగా సాగినది. మచ్చునకు రెండు ఉదాహరణలు—

మూలం —

> 'హరత్యఘం సంప్రతి, హేతు రేష్యతః
> శుభస్య, పూర్వాచరితైః కృతం శుభైః,
> శరీరభాజాం భవదీయ దర్శనం
> వ్యనక్తి కాలత్రితయేఽపి యోగ్యతామ్'   [1 26]

అనువాదం —

> చ. అనఘ! శరీరధారులకు
> నద్భుత వైఖరి నీదు దర్శనం
> బనిశము మూఁడు కాలముల
> యందును బాత్రత నొందఁజేయుఁ, నె
> ట్టనిన నఘం బడంచు నిపు,

డాయతియందును భద్రహేతువౌ
ననుపమ పూర్వపుణ్య విభ
వాధికతన్ గృతమయ్యెఁగావునన్. [ఆ. 1—92]

మూలం —

'అంకాధిరోపిత మృగ
శ్చంద్రమా మృగలాంఛనః;
కేసరీ నిష్ఠురక్షిప్త
మృగయూథో మృగాధిపః [2—53]

అనువాదం —

క. మృగమును దొడపై నిడుకొని
మృగాంకుఁడనఁ బరఁగె విధుఁడు, మృగముల నెల్లన్
దెగఁ గొనుటఁజేసి కేసరి
మృగరాజని బిరుదుగాంచె మేదినియందున్.
[ఆ1–180]

ఈ గ్రంథం 1887లో తొలిసారి వావిళ్లవారి ఆదిసరస్వతీ నిలయ ముద్రాక్షరశాలలో ముద్రితమైనది. ఇప్పుడు కవిగారి మనుమని మనుమలు శ్రీనివాసమూర్తిగారు విశ్వప్రయత్నంచేసి, ముద్రిత—లిఖిత ప్రతులను సంపాదించి ఇప్పుడు చక్కగా అచ్చువేయించి ప్రకటిస్తున్నారు. కవిగారి గ్రంథాల ప్రకటనకై వారు ఎంత శ్రమపడినదీ 'విన్నపము'నుబట్టి గ్రహించవచ్చు. కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు 'పీఠిక' వ్రాస్తూ కవిగారి జీవితాన్ని గురించీ, ప్రతిభా పాండిత్య కవిత్వాలను గురించీ, ముద్రిత లిఖిత ప్రతులకున్న పాఠభేదాలను గురించీ, ఛందోవిశేషాలను గురించీ, ఇతర విషయాలను గురించీ ఉపయుక్త విషయాలను ఎన్నింటినో వివరించారు. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు 'అనువాదము — శైలి' శీర్షికలో మూలానువాదాలను తులనాత్మకంగా పరిశీలించి అనువాదకుల కవితా ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు.

దీనికి అనుబంధంగా ఇప్పుడు అలభ్యమై ఎప్పుడో 'రత్నాకరము' అనే పత్రికలో ప్రకటితమైన కవిగారి 'శ్రీరాధికా పరిణయము'లోని పద్యాలు ఇయ్యబడినవి.

ఆంధ్ర వాఙ్మయాభిమానులు దీన్ని ఆదరించగలరని విశ్వసిస్తున్నాను.

— శ్రీ బులుసు వేంకటరమణయ్య

చర్య:

గద్యకవితా సంపుటి : కె. శివారెడ్డి; డెమ్మీ 1/8–90 పారటలు. వెల–రు 3/– ప్రతులకు:–నవయుగ బుక్‌హౌస్. సుల్తాన్ బజార్ (చౌరస్తా) హైదరాబాదు–1

శివారెడ్డిగారికి భావావేశానికి రూపం తీర్చిదిద్దగలిగిన భాష బాగా ఉన్నది. మనస్సులోని ఉద్రిక్తత మాటలలో వేడిఎక్కి ప్రవహిస్తుంది. దీనికంతా మెరుగుపెట్టే కమ్మటి తెనుగు నుడికారం పుస్తకమంతా చిగిర్చి ఉన్నది.

ఇక, యీ కోవవారి భావసరణి అంతా పరిపాటైపోయి విసుగు పుట్టిస్తుంది. స్వేచ్ఛ–ప్రతీకారము–హింస–ఇవీ వీరి కవితాసామగ్రి. ఒక వర్గంపై దయచూపి, ఇంకొక వర్గంపై క్రోధం కక్కడంవల్ల యీ కారుణ్యం పక్షపాత కళంకితమైపోతున్నది. కవి తనకు స్వేచ్ఛ కోరుతాడే గాని ఎదుటివాడు యీ స్వాతంత్ర్యానికి తగడంటాడు. ఒక పరాసుకవి–"నాతో ఏకీభవించకపోవడం నీ జన్మహక్కు, దానిని నా ప్రాణం ఒడ్డి అయినా రక్షిస్తాను"–అన్న పవిత్రలక్ష్యం యీ వర్గంవారికి నచ్చకపోవడంవల్ల, ప్రతీకారఖడ్గం భూతలాన్ని ఒక నెత్తురుబురదమడుగుగా చేస్తున్నది. "ఆరుబయట నిర్బంధంలో ఉంచబడ్డ నాకు తెల్సు. స్వేచ్ఛావాంఛలోని దాహం" (ఐ నో) అన్న దానిని అందరికీ అన్వయించవలదా?

ఈ కవి యీ తెన్నువారందరువలెనే సమత కావాలంటాడు. ఇది సాధ్యమైతే అందరికీ సంతోషమే! అయితే సమత ఆచరణ యోగ్యమా? అన్నదే ప్రశ్న. సమానావకాశాలే పరిష్కారమార్గమని పొంగు చల్లారిన మేధావులంతా యిప్పుడు అంగీకరిస్తున్నారు. ఆదర్శమనుకొనే రష్యాలో బ్రెజినోవ్ బండిలోలి బూడ్సులు తుడిచే మాలెన్ కోవులు లేకున్నారా? వీరికి యీ పోరాటపు ఆరాటం తగ్గిపోగానే దారినబడి, పదికాలాలపాటు నిలువ గలిగిన కవిత్వం వ్రాయగలరు.

ఈ కవి చాలాచోట్ల మర్మథోరణిలో పడుతున్నారు. ఈ పులుముడు పోయి భావం బయట పడుతుంటే కవితారీతి ఇంకా బాగా మెరుగెక్కుతుంది. పులిన వనమా? (రమతే పులినవనే) నుదుటిమీద రెండు పెదవులు (ముద్దు అనేనా?) ఏమిటీ ఆభాసలు. అన్యదేశ పదాలను సజీవ భాష తొలగద్రోచుకోలేదుగాని, ఎ పోయం–మెటాబాలిజం–ఐ నో–పెటి బూర్జువా అనే శీర్షికలు పెట్టుకోవలసిన భాషా దౌర్భాగ్యం యీ కవికి లేదే!

భావం భాష కళకళలాడే కొన్ని పట్టులు చూడండి :—

"దిగులు గువ్వకూస్తూనే వుంది"; "రాత్రి చీకటికండ్లకు కాలం గోరింటాకు పెట్టింది" (ఉదయం); "మనసు తీగల్లో నిశ్చింత సంతృప్తి ప్రవహిస్తేగదా విద్యుద్దీకరింపబడిన సౌధంలా దేహం జాజ్వల్యమానంగా నవ్వులు కురవటానికి "(స్థితి);" కసి పండ్లు;" "శత్రువుగుండె పగిలేస్తే ఆ నెత్తుట్లో నీ జీవన్మందారం వికసిస్తుంది"...ఈ కసే వీరి వేదాంతంగదా—ఈ మాటతో సౌమ్య భావం చెడిపోయినది, (చర్య); అహింసావాదులపై విసరు బాగున్నది చూడండి :— "అపాదమస్తకం తెల్లగానే మల్లెగానే శాంతినవ్వ లొలకబోస్తూనే కళ్లల్లో కరుణరసం పొంగిస్తూనే — వారి పాదాల వేళ్ళు మాత్రం నీ నాలాంటివాళ్ల రక్తాల ప్రాణాల పీలుస్తూనే— వీళ్లంతా లహింసావాదులు"; కాని పీడిత ప్రజల పేర వీరుకోరే హింసావాదం గూడ యిట్లాంటిదేగదా. "పరిణామాల తొక్కిళ్లు" (ధ్యేయం) "నా రక్తంలో నాలుగు దీపాలు వెలిగాయి" (క్వాలిటీ గెరిల్లా) "సూర్యుణ్ని కాస్తకాస్త తినేస్తూ ప్రాణవాయువుని లోకం మీద గుమ్మరిస్తూ, తనలో తన నంటవండుకుంటోంది"— గానుగ చెట్టులో శాస్త్రజ్ఞానం మంచి మాటలో వెలువరించి భావానికి మంచి సమన్వయం కూర్చినాడు. "ప్రజల కన్నీటిబొట్టు నాకలంలోన సిరా చుక్క." (వాడి లాజికెలో ంగా విసరు ఎత్తిపొడుపు చూడండి) "ఏ శ్రమా చేయనోడు కోట్లు సంపాదించగా లేంది, ఇన్నాళ్ళు ప్రజా సేవ చేసినవాణ్ణి యిప్పుడు నాలుగు డబ్బులు తినకూడదా" ఇదే గదా యీనాటి దేశభక్తుల తీరు ! "ప్రతి రాత్రీ ప్రసవించిన అమూల్య ఫలం ఉదయం" (కిసలయం) చెట్ల ఆకు లన్నీ బరువుగా నీళ్లతో కనురెప్పలు మూశాయి" (మరణం లేదు) కవి ప్రకృతిని బాగా గమనిస్తారు "సుఖాన్ని తూర్పారబోసే తూఫాను" (పెజ బూర్జువా) "రాత్రినుండి రాత్రికి పగలు అల్లుకున్నట్లు" (ఒకే ఒక్కసారి) "తుఫాను కసురు" (కవరు) "అపుడే నిదురలేచిన కొదమ కోరికల్లా వున్నాయి పూలు" (చెట్లు చెప్పిన పాఠం) "మునిమాపు ముసలితనం"—ఇట్లా నుడికారపు మల్లెలు చాలా పరిసిఉన్నవి.

ఈ ముతా కవులకు మంచి తెనుగు పదాలపై కన్నుబడటం మెచ్చదగిన సంగతి. గ్రామీణ నుడికారం వాడితే మారుమూల మాటు మణగిన పద మనే నవీన భాషారాధకుల వాదపు దినాలలో వీరి ప్రయోగాలు ఆదరణీయాలు. 'ప్రగతి' అనే మాట వినివిని చెవులు చిల్లులు బడివున్నవి. ఈ కవి "యుగాల ఎదుగుదల" (కవరు) ప్రయోగం శ్రావ్యంగా వున్నది. ఈ తెనుగు నుడికారంపై మోజు భాషకు బలుపేగాని వాపు గాదు.

—శ్రీ మ కో. రెడ్డి

నరుడు (నవల)

కర్త— అడవి బాపిరాజు. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కంపెనీ. మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు. పేజీలు 150. ఖరీదు 2-50 పాతరేటు.

నవలా సాహిత్యంలో అడవి బాపిరాజుగారి దొక ప్రత్యేకస్థానం. తా నేనవల వ్రాసినను అందులో నాటి సాంఘిక రాజకీయ పరిస్థితులు ప్రతిబింబింపజేసి కథను కమ్మగా వివరింపగల నవలా కారులు. భారతీయ సంస్కృతిపై మక్కువ ఎక్కువ. కంటితో చూచిన విషయాన్ని ప్రత్యక్షంగా చూపించగల సామర్థ్య మున్నది. అందువలననే వారి నవలలను చదివిన చిత్రకళ, శిల్పకళ, చరిత్ర మున్నగువానిని గూర్చి సంక్షిప్తంగా తెలిసికొనటాని కవకాశం ఏర్పడును. వీరు నవలలు మాత్రమే గాక కథలు, కథానికలు, నాటికలు, ఖండకావ్యములు కూడ వ్రాసినారు.

బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లాలో సరిపల్లెలో జన్మించారు. న్యాయవాదివృత్తి చేపట్టారు. స్వాతంత్ర్య శంఖారావం విని న్యాయవాదవృత్తి వదలి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కొంతకాలం కృష్ణజన్మస్థానంలో ఉన్నారు. నవ్యాంధ్ర కవులకు 'బావ బావ'గా చెలామణి అయినాడు. ఆయన వ్రాసిన నవలలు ఇప్పటికిని ఆంధ్ర పాఠకులచే ఆదరింపబడుచునే ఉన్నాయి.

జాతి మత భేదములతో క్రుంగి కృశించుచున్న సమాజం అట్టడుగున నున్న వ్యక్తి స్వయంకృషితో పైకివస్తే లోకం హర్షింపదు. కులమతాలు అడ్డువచ్చి వ్యక్తియొక్క గొప్పతనాన్ని గుర్తింపకుండా చేస్తుంది. కాని ఆ వ్యక్తి ఎప్పటికైనను గుర్తింపబడునని తెలియజేయుటకు ఎల్లమందపాత్ర ప్రతీకగా నిలుస్తుంది. సిరుపేద

సంసారంలో ఎల్లమంద జన్మించాడు. తండ్రి చంద్రయ్య కండలు విరిచి ముక్కలు చేసికొంటేనే జీవితం గడుస్తుంది. ఎల్లమందకు బాగా చదువు చెప్పించి కలెక్టరు చేయించా లను తలంపు తండ్రికధికం. ఎల్లమందను పాఠశాలకు పంపినపుడందరూ చంద్రయను ఎగతాళి చేసేవారు. ఎల్లమంద చదువుచున్నాడేగాని మనస్సంతా చీకాకుగా నున్నది. తన జాతిని తన వారిని గూర్చి సహాధ్యాయులు హేళన చేసే వారు. అయినా వారికి తగినసమాధానాలిచ్చేవాడు కాదు. ఎల్లమంద పాఠశాలలో అన్నింటియందు ప్రథముడుగానే వచ్చాడు. ఇది చూచి కొంతమంది ఓర్పువహింపలేక నానావిధము లైన బాధలకు గురి చేసేవారు. బాధలకు, వ్యథలను అధిగమించాడు. డాక్టర్ జెన్నిఫర్‌తో ఎల్లమందకు పరిచయం కలిగింది. ఉన్నత విద్యకై ఎల్లమంద విదేశా లకు వెళ్ళాడు. జెన్నీఫర్ సోదరుడు లయోనెల్‌కు ఎల్లమంద అనిన మహా ప్రీతి. తన చెల్లెలకు ఎల్లమంద 'భర్త' అవ్వాలనే తాపత్రయం ఉన్నది. కాని వీరి వివాహమునకు జెన్నీఫర్ తల్లిదండ్రులు అంగీకరింప లేదు. విదేశాలనుండి ఎల్లమంద తిరిగి వచ్చాడు. ఉన్నతోద్యోగం సంపాదించాడు. ఏర్పడిన చిక్కులను పరిష్కరించుకొని జెన్నీఫర్ ఎల్లమందల వివాహం జరిగింది. ఇది నవలలో సంక్షిప్తంగా కథ.

ఇందులో ఎల్లమంద జీవితం విషాద భూయిష్ఠం. పట్టుదల అతని జీవితంలో మార్గదర్శకమై నిలిచింది. సూటిపోటుల తూట్లు తనపైన పడిన వానిని లెక్కచేయక ముందడుగు వేసాడు. తనను గూర్చి తాను తెలిసికొన్నాడు. తండ్రి ఎన్నికష్టాలుపడి తనను చది వించాడని పదేపదే అనుకొంటూ ఉండేవాడు. అతనిలోఉన్న బుజు మార్గ ప్రవర్తనే ఎల్లమందను సమాజంలో ఒక విద్యావంతునిగా నిలబెట్టి హోరతులు పట్టింది. స్వచ్ఛమైన ప్రేమకు హద్దులు లేవు. కులమతాలడ్డురావని నిరూపిస్తుందీ నవల.

విద్యార్థి సాహితి (కథాంజలి3-)

విద్యార్థిసాహితి (కథాంజలి—3) ఎమెస్కోవారి ప్రచురణ. పేజీలు 256. రేటు 2—50 (పాతరేటు) మద్రాసు—సికింద్రా బాద్—మచిలీపట్నం.

"ఈ నాడు తెలుగుదేశంలో కథలు వ్రాయటం అధికమయింది. దానికి తగినట్లుగ పత్రికలు కూడ ప్రోత్సహించి మరుగుపడిన మాణిక్యాలను వెలికి తీస్తున్నాయి. నవలకంటె కథకు పాఠకు లధిక ప్రాముఖ్యం ఇస్తున్నారు. కాలం గడపటానికి, హాయిని కలిగించటానికి ఈ కథలు పాఠకులకు బహుదా తోడ్పడుచున్నాయి.

ఎమెస్కో సంస్థవారు యువరచయితలను, రచయిత్రులను ప్రోత్సహించా లను దృష్టితో నారిచేత కథలు వ్రాయించి పుస్తక రూపంలో ప్రకటిస్తున్నారు. ఈ ప్రయత్నం యువకులకు చాల ఆనందం కలిగించి కథలు వ్రాయుటకు దోహదం చేస్తున్నది. ఇంతకు ముందు ఆంధ్ర విశ్వవిద్యాలయ రచయితల సంఘ సంకలనము. రెండవది సికింద్రాబాదు యువభారతివారు విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన కథలపోటీలో నెగ్గినవాటి సంపుటి. ప్రస్తుత కథల సంకలనం మూడవది. ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థిరచయితల సంఘం వారు సమీకరించిన 124 కథలలో ఎన్నికైన 17 కథల సంపుటి ఇది. ఇందులో అందరు విద్యార్థులు రచయిత, రచయిత్రులే "వీరందరూ కొత్తగా కలం పుచ్చుకొని రచనా వ్యాసంగానికి ఉపక్రమిస్తున్నవారు. కాని అనుభవజ్ఞులైన కథకులకు తీసిపోనంత అందంగా అద్భుతంగా వ్రాసినవారు ఉన్నారు. నిజానికి కొన్నికథలు వజ్రపుతునకల్లాంటివి ఇందులో వున్నాయి." అని రావూరి భరద్వాజగా రంటున్నారు. ఇది యథార్థం.

ఈ సంపుటిలోని కథలను సమీక్ష చేయవచ్చును కాని పత్రి కాధిపతుల పరిమితి లనే ఆంక్షవల్ల నాలుగు కథలను గూర్చి వివరిస్తాను.

మొదటికథ 'కన్నీళ్ళతో కాలక్షేపం'. అమృతలత వ్రాసినది. కట్నాలమోజులో పడి చదువు సంస్కారం కాలరాసి సౌందర్యాన్ని కాల దన్ని మంచితనాన్ని మంటగలిపి అగ్నిజ్వాలలు రగిల్చికొన్న సంసారమే 'కన్నీళ్ళతో కాలక్షేపం' కథ)

మాల, సుధాకర్ బి. యస్సీ చదువుకొన్నవారు. అయితే మాల చదువాపింది— భర్తకంటె తక్కువగా ఉండాలని. వారికి వివాహ మయింది కాని సంతోషం లేదు. ఇచ్చిన కట్నం చాలలేదు. క్షణ క్షణం మాల ఆవేదనతో అలమటించింది. చదువుకొన్నవాడు తనను అర్థంచేసికొనగలడని భావించి అతన్ని మెప్పించాలని ప్రయత్నించింది. కాని సుధాకర్ భార్యమాట్లాడే ప్రతి మాటకు విపరీతార్థాలు తీసి ఆమెకు కన్నీరు పెట్టించాడు. కలలు కన్న సంసారం పగటికలగా మిగిలింది. ఆనందబాష్పాలకు బదులుగా దుఃఖం మిగిలింది. సుఖ సంతోషాలను పొందాలని ఆశిస్తే నిరాశా నిస్పృహలు ఎదురై జీవి తాన్ని క్రుంగదీసి కన్నీళ్లతో కాపురం చేయించాయి. నూరని మనుష్యు లున్నంతకాలం కట్టుకొన్న భార్యకు కన్నీరే గాని పరేమీ ఈ సమా జంలో లభించదు. కనీసం సానుభూతికై కూడ నోచుకోలే రట్టి గృహిణులు.

'అవశేషం' చంద్రకాంత్ రచన. మానవత్వం ఉన్నహృదయం ఎదుటివాడు రక్కసుడైనా, విపరీతమగు బాధలో ఉన్నా ఆదుకోవా లనిపిస్తుందనే కథ.

ఆనాడందరూ మంటలనుండి రక్షింపబడ్డారు కాని దొరగారి బిడ్డ మాత్రం మంటల్లో చిక్కుకొన్నది. కన్నబిడ్డ ప్రాణం రక్షించ టానికి 500 విలువకట్టి చుట్టుప్రక్కల వారితో చెప్పుకొన్నాడు కన్నతండ్రి. బిడ్డను రక్షింపలేక అరుపు అరచాడు. ఆ అరుపుకు నరసయ్య ఉలిక్కిపడి తన బిడ్డే మంటల్లో ఉన్నదని తలచి ప్రాణాన్ని లెక్కచేయకుండా దొరగారి బిడ్డను కాపాడినాడు. నరసయ్యలో మాన వత్వం ఉన్నది. కరుణ గూడుకట్టుకొన్నది. కరుణముందు దొరగారి అహంకారం బలాదూర్. దొరగారి బిడ్డను రక్షించింది 500 కాదు. కేవలం సాటివ్యక్తి సానుభూతియే.

'ఎఱ్ఱగన్నేరు' కథ కర్నె చిరంజీవి వ్రాసినది. రాఘవయ్య అయినవారందరికి అన్యాయం చేసి బాధలకు గురి చేసాడు. కాని శేఖరాన్ని చదివించాడు. శేఖరంతల్లి పార్వతి చనిపోయి రాఘవయ్య మనసును కలవరపరచింది. రాఘవయ్య తాను చేసిన పాపాలకు నిష్కృతి లేదని భావించాడు. ఎఱ్ఱగన్నేరు పువ్వులోని ఎరుపుదనం తీవ్రతకు గుర్తు. అహంకార తీవ్రతకు రాఘవయ్య లోనై తన్ను తాను తెలిసి కొనలేక అజ్ఞానంలో పడిపోయాడు.

'సగటు మనిషి' అడపా రామారావు రచన. ఈనాడు భూషణ రావువంటి వ్యక్తులు చాలమంది ఉన్నారు. చాలీచాలని జీతాలతో జీవి తాలు గడుపుతూ కట్టుకొన్న భార్యకు, కన్న బిడ్డలకు సంతోషం లేకుండా కష్టనష్టాలలో కాపురం చేసి నిజాయితి నిలబెట్టుకొన్నను కనిపించే సమాజం సానుభూతి చూపవపోగా తెలిసిపోని నిందలు మోపి జీవితాన్ని కుంగదీసి నిరుపేదస్థితికి నెట్టివేసే ఈ జీవిత మింతేయని ఆవేదనల జారులో కలిసిపోతాడు. భూషణరావు నెట్టివేయబడ్డ సగటు మనిషి. లతని జీవితం మధ్యతరగతి జీవనవ్యవస్థకు సంకేతం.

— శ్రీ రామమోహన్

మహతి

700 పేజీలు వెల 20/– ప్రచురణ: యువభారతి–సాహితీ సాంస్కృతిక సంస్థ. 5. కింగ్స్ వే. సికిందరాబాదు–3.

దీనిలో ప్రవేశం20వ్యాసాలు, ప్రయోగం 25, పరిశీలన14, ప్రస్తారం 20, ప్రభావం 21, అనేఖండాలలో మొత్తం అని పంద వ్యాసాలున్నవి. ఇది భారత స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంలో ప్రచు రింపబడింది. తెలుగు అధికార భాష యైన ఈ సమయంలో తెలుగు భాషా సారస్వతాలు ఈషన్మాత్రం ప్రతి తెలుగువాడు తెలుసుకోవాలి. నిత్యజీవితం కోసం ఊపిరాడకుండా శ్రమపడుతున్నా, చదవడానికి సరి యైన సదుపాయం లేకున్నా ఏ కొద్దిపాటి విరామంలో సమగ్రంగా జ్ఞానం సంపాదించడానికి అనువుగా యువభారతివారి మహతి వడ్డిం చిన విస్తరివలె సాహిత్యాన్ని అందరికీ అందించి తీరని లోటును పూర్తి చేసింది.

ఈ గ్రంథం శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారి ప్రోత్సా హంతో వ్రాయబడ్డది. ఇది రీసెర్చి ప్రాజెక్టుగా కొనసాగి వుండాల్సిన బృహత్ప్రణాళిక. అందరూ తరచిన నవనీతాన్ని ఐదు ఖండాలలో స్థాలీపులాకన్యాయంగా అందించినందుకు అభినందనపూర్వకంగా యూనివర్సిటీలు కూడ దీనిని సమీక్షాగ్రంథంగా నిర్ణయించారు.

మచ్చుకు ప్రముఖ రచయితల అమూల్యాభిప్రాయాలను చదువుకుందాము శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు పాతికేళ్ళు తెలుగువారు పండించిన పర్వాలను వివరించి ఈ నాడు కూడ తెలుగు వారిలో ఎంత మార్పు వచ్చినా వరకట్న పిశాచంలాటి దురాచారాలను మాన్పడానికి ప్రబోధం కావాలన్నారు. శ్రీ మామిడిపూడి వెంకట రంగయ్య ప్రజాస్వామికం చక్కగా పనిచేయాలంటే అధికార పక్షాన్ని చక్కగా విమర్శించగల వివేకవంతమైన ప్రతిపక్షం ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్ది దౌర్జన్యరాహిత్యమైన శ్రేయస్సును వృద్ధి చేయాలని, ఆర్థిక స్వాతంత్ర్యం రావాలంటే అందరూ కలిసికట్టుగా పని చేయా లని ఉద్బోధించారు. వి. సీతాకళ్యాణిగారు వ్యక్తిత్వం, సంస్కారం, భావ సంస్కృతి సౌందర్యారాధనలను జాగరితం చేసి సువ్యవస్థీకరించు కొని దేశీయతాముద్రకై పాటుపడాలన్నారు. శ్రీ మరుపూరి కోదండ రామిరెడ్డి అభిప్రాయంలో ప్రాచీన సంస్కృతిని పునఃస్థాపితం చేయ లేము కాని దానిని పూర్తిగా విస్మరించి ఇప్పటి దాన్ని మాత్రం పట్టుకుంటే ఎముకల గూటిని పట్టుకొని ప్రాకులాడినట్లే. ఆంధ్ర ఖద్దరు పేటంచు పంచ, అంగ వస్త్రం, వల్లెవాట్లను ఏ పావురమో ఎగుర తన్నుకపోయిందని బాధపడ్డారు. శ్రీ రామవరపు సుబ్రహ్మణ్య శాస్త్రి తెలుగువారి సాహిత్యాభిరుచులను వృద్ధి పరచడానికి ఔత్సాహికు లను, మంచి రచయితలను ఉదార సంస్థలు మరింత ప్రోత్సహించా లన్నారు.

శ్రీ కొత్తపల్లి వీరభద్రరావు కాల్పనికోద్యమం, రియలిజమ్, డాడాయిజమ్, అభ్యుదయ సాహిత్యం మొదలగు వాటిని చర్చించి

దాశరథి, నారాయణరెడ్డిని అభినందించారు. శ్రీ కె. వి. రమణారెడ్డి, ఆరుద్ర, తిలక్‌గార్ల కవిత్వాన్ని విమర్శించి దిగంబర కవులను గురించి వివరించారు. శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ ప్రవాసాంధ్రుల వాఙ్మయ సేవను చక్కగా వర్ణించారు. శ్రీ గోరాశాస్త్రి నేటి కథలన్నీ కాశీ మజిలీ పాత్రలకు ప్లైట్‌పాంట్లు, మినీ లంగాలు తొడిగి చూపినట్లున్నా యన్నారు. శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి రచయితల మనుగడకు తగిన పరిస్థితులను సృష్టించడానికి ఎవరూ ప్రయత్నించటంలేదని చింతిస్తున్నారు. శ్రీ అశ్వినీకుమార్ సినిమాల్లో జీవితంలో వ్యక్తికి గావలసిన డీసెన్సీ, మొరేల్‌లను పెంపొందించే సబ్జెక్ట్సు లేవని విమ ర్శించారు. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆశాభావంతో సజీవమైన, సముజ్జ్వలమైన అచంచలమైన విశ్వాసంవల్ల మానవతా దృక్పథంగల సాహిత్యాన్ని సృష్టించవచ్చని అన్నారు.

'ప్రతిభ' అనే ఖండమే నిజంగా మహతికి చేవనిస్తున్నది. శ్రీ విశ్వనాథ తన అనుభవాలను తమ బహుముఖ ప్రజ్ఞను వెల్లడించారు. శ్రీ శ్రీ దృష్టిలో 1925 నుండి ఎంతరాసినా, ఎందరు రాసినా మెజారిటీపైవ మైనారిటీ పెత్తనానికి పోదిపెట్టి రాసే రాతగాళ్లంతా దేశద్రోహులే:

'ప్రయోగం' అనే ఖండంలో కవితాప్రక్రియలోని వైవిధ్యంపై సర్జనాత్మక సమీక్ష వున్నది.

శ్రీ ఆరుద్ర మాటలలో నేటి సాహిత్యంలో ప్రయోజకత్వం దేశ విదేశాల తేడాలులేని, శ్రమజీవనాన్ని చిత్రించుటకే కృషి జరుగు తున్నదని తెలియవస్తున్నది.

డా. దివాకర్ల, తుమ్మల, వానమామలై ఇత్యాది రచయితలను పేర్కొని సంప్రదాయకవిత సంఖ్యలో కృశించినా నిర్మలంగానే ప్రస రిస్తున్నదని తృప్తిచెందారు. శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు 'రియలిజం అంటే కేవలం ఫొటోగ్రాఫీ' కారాదని ఏకాలపుజీవితాన్నైనా తీసికొని అవగాహన చేసికొని రాగద్వేషాలకు అతీతమైన పాత్రలను చిత్రించాలని వ్రాశారు.

శ్రీ సింగరాజు లింగమూర్తి 'యువతరంవారు థ్రిల్‌నే కోరు తున్నప్పటికి వారిని పెడదారిని పట్టించే రచనలు చేయరా'దని వ్రాశారు.

శ్రీ మధురాంతకం రాజారాం 'విశ్వదాత' ఏర్పాటుచేసిన పత్రి కల ద్వారా తెలుగు సాహిత్యంలో వైవిధ్యం అందరికీ తెలియవచ్చిందని వ్రాస్తూ నీళ్లు, పిండకృత పిశాచి, కాంతం కథలు మొదలగు కథ ల'ను చక్కగా విమర్శించారు.

శ్రీ పాతూరి శ్రీరామశాస్త్రిగారు ధర్మవరం, కోలాచలంవారిని తమ నాటకవిమర్శలో ఎందుకు పేర్కొనలేదో! శ్రీ జి. వి. సుబ్రహ్మ ణ్యం 'సద్విమర్శ'ను గురించి బాగావ్రాశారు. విశ్వవిద్యాలయేతర పండి తుల పరిశోధనలపై విమర్శ నెట్లా మరచారో ఆశ్చర్యం.

శ్రీ ఎన్. సి. ఎస్. వెంకటాచార్యులు వ్యాకరణంవల్ల భాష పటిష్ఠంగా వుంటుందని, ఎన్ని వ్యాకరణాలు రాసినా భాష కుంటు పడదని మార్పులకు అంతరాయం రాదని వ్రాశారు.

శ్రీ పుల్లెల రామచంద్రుడు సంస్కృతభాష నభ్యసిస్తేనే దేశంలో భావసమైక్యతకు దోహదమవుతుందని వ్రాశారు. శ్రీ ఇన్నయ్య గారు వైజ్ఞానిక దృష్టితో, ప్రజాస్వామిక దృక్పథంతో భావసమైక్యా నికి అందరూ పాటుపడాలని అన్నారు.

యువభారతి చిన్న దీపంతో సాధ్యమైనంత చీకటిని పోగొట్టి పరిపూర్ణమైన సమగ్రమైన వ్యక్తిత్వానికి తోడ్పడడానికి 'మహతి' ద్వారా పాఠకుల్లో చైతన్యం, ఆలోచనలు కల్గించుటకు తోడ్పడిం దనవచ్చును.

— శ్రీరామచంద్ర

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones . 75667 & 75226.